ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
విశాఖపట్నం
గురువారం 31 ఆగస్టు 2017 | 16



అరకులోయ మండలం కోడిగెడ్డ వద్ద వినియోగంలోకి రాని ఎత్తిపోతల పథకం



ఉత్తిపోతల

నత్తనడకన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు

రెండేళ్ల క్రితం క్రితం రూ.11.5 కోట్లు మంజూరు

- ఇంతవరకు సగం పథకాల పనులు కూడా పూర్తికాని వైనం
- కొరవడిన ఏపీఎస్ఐడీసీ అధికారుల పర్యవేక్షణ
- స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు
- నిర్వహణ పేరుతో నిధులు పక్కదారి
- సాగునీరు అందక రైతుల్లో నిస్పృహ

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు గందరగోళంగా మారాయి. రాష్ట్ర చిన్న నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులకు ఏడాదిన్నర క్రితం నిధులు మంజూరుకాగా, ఇంతవరకు సగం పథకాల పనులు కూడా పూర్తికాలేదు. జిల్లాకు సంబంధించిన ఏపీఎస్ ఐడీసీ కార్యాలయం విజయనగరంలో వుండడంతో ఇక్కడి పనులను అధికారులు సక్రమంగా పర్యవేక్షించడంలేదు. దీంతో కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు కుమ్మక్కై, పనులు పూర్తి చేయకుండానే బిల్లులు డ్రా చేసేస్తున్నారు. మైదానం, మన్యంలో మొత్తం 25 పథకాలు వుండగా, వీటిలో సగం పథకాల పనులు కూడా పూర్తికాలేదు. మోటార్లు బిగించకపోవడం, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం, కాలువలు ... మిగతా 6వ పేజీలో



చోడవరం : ముద్దుర్తిలో ఎత్తిపోతల పథకం నుంచి చెరువులోకి అరకొరగా నీరు చేరుతున్న దృశ్యం

గంజాయి స్మగ్లింగ్‌కు అన్నవరం హబ్



నర్సీపట్నం రూరల్ పోలీసులు పట్టుకున్న గంజాయి నిందితులు

- పుణ్యక్షేత్రం కేంద్రంగా రవాణా
- ముఠాల కార్యకలాపాలు
- గంజాయి కేసులో తొలిసారిగా హిజ్రా అరెస్టు
- స్మగ్లర్లతో తమిళనాడు, కేరళ సెటిలర్లకు వ్యాపార సంబంధాలు
- అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌ను ఛేదించిన నర్సీపట్నం పోలీసులు

...మెయిన్‌లో

ప్రగతి పథంలో ఆర్టీసీ

విశాఖపట్నం, ఆగస్టు 30:

విశాఖ ఆర్టీసీ రీజియన్ నష్టాల ఊబి నుంచి గట్టెక్కుతోంది. కనీస చార్జీ తగ్గింపు, ఇంధన వినియోగంలో పొదుపు, పార్శిల్ రవాణా విస్తరణ, ఖాళీ స్థలాలను దీర్ఘకాలిక ప్రాతిపదికన లీజుకు ఇవ్వడం, కార్మికులు, అధికారుల పనిగంటలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం వంటి వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటోంది. గత ఏడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు నెలాఖరు వరకు సగటున రోజుకు సుమారు రూ.88 లక్షలు ఆదాయం ... మిగతా 7వ పేజీలో

పెరిగిన ఆదాయం

- రోజుకు రూ.99 లక్షలు
- గతంలో రూ.88 లక్షలు
- తగ్గిన నష్టాలు
- పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- కలిసొచ్చిన కనీస చార్జీ తగ్గింపు
- రోజుకు అదనంగా రూ.లక్షన్నర రాక



ఆర్‌డబ్ల్యుఎస్ పనుల్లో టెండరింగ్

పాడేరు ఈఈ కార్యాలయం పరిధిలో అన్నీ అడ్డగోలు వ్యవహారాలే

- పథకం ప్రకారం అంచనాలు పెంపు
- సిండికేట్‌గా ఏర్పడి, ఏకపక్షంగా టెండర్లు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు
- తాజా పనుల టెండర్లను చేజిక్కించుకోవడానికి ఎమ్మెల్యే అనుచరుల యత్నం
- ఇతర కాంట్రాక్టర్ల అభ్యంతరం
- పరిస్థితి గందరగోళంగా మారడంతో టెండర్లు రద్దు చేసిన అధికారులు




పాడేరు, ఆగస్టు 30:

పాడేరులోని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో అడ్డగోలుగా వ్యవహారాలు నడుస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వరకు కాంట్రాక్టర్లు రింగ్‌గా ఏర్పడి, అధికారులతో కుమ్మక్కై పనుల అంచనా వ్యయాలను ఎక్కువగా చూపించి, పథకాల నిర్మాణ పనులను దక్కించుకునేవారు. చాలా కాలంగా ఆర్‌డబ్ల్యూఎస్‌లో చాపకింద నీరులా ఈ వ్యవహారాలు జరిగేవని ... మిగతా 14వ పేజీలో

మరో ఐటీ హబ్ 'క్వాంటమ్'

- హెచ్ఎస్‌బీసీ ఎదురుగా భవనాన్ని అద్దెకు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- 12 కంపెనీలకు కేటాయింపు
- ఐదు అంతస్థుల్లో 350 మందికి ఉపాధి



11

ఎన్టీఆర్ జలసిరికి నాబార్డ్ నిధులు



జిల్లాకు రూ.10 కోట్లు కేటాయింపు ... సెంటర్‌స్ప్రెడ్‌లో

సమష్టి కృషితో వ్యవసాయ ఆదాయం రెట్టింపు



'సంకల్ప్ సే సిద్ధి'లో జడ్పీ చైర్‌పర్సన్ భవానీ

16



పాడేరు ప్రధాన రహదారిలో హోరున కురుస్తున్న వర్షం

సాయంత్రాన.. ఏకధాటిగా వాన

పాడేరులో అర గంట పాటు ఎడతెరిపిలేని వర్షం

పాడేరు: రెవెన్యూ డివిజన్ కేంద్రం పాడేరులో అనుకోని విధంగా బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాయగా, సాయంత్రాన వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. ఐదు గంటల సమయంలో అకస్మాత్తుగా మార్పులు చోటుచేసుకుని భారీగా వర్షం కురిసింది. దాదాపు అర గంట పాటు ఎకధాటిగా పడిన వాన పడింది. తదనంతరం సాధారణ వాతావణం ఏర్పడడం విశేషం.

మాడుగుల రోడ్లు జలమయం



నీటితో నిండిపోయిన మాడుగులలోని మోదమాండ కాలనీ రహదారి

మాడుగుల: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం పడింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. ఆయా ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. మోదమాంబ కాలనీలో కాలువలు లేకపోవడంతో వర్షానికి నీరు వెళ్లే దారి లేక ఇళ్ల మధ్యలోనే ప్రవహించింది. ఇళ్లలో నీరు బయటకు తోడేందుకు మహిళలు నానా అవస్థలు పడ్డారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే వర్షాల సమయాల్లో ఇళ్లను వదిలి పరాయి కొంపలో తలదాచుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ 8న కోనాం జలాశయంలో

రెండు లక్షల చేప పిల్లల విడుదల

మత్స్య శాఖ సహాయ సంచాలకుడు నారాయణరావు

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయంలో వచ్చే నెల 8వ తేదిన రెండు లక్షల చేప పిల్లలను విడుదల చేస్తామని మత్స్య శాఖ సహాయ సంచాలకుడు ఎస్.నారాయణరావు తెలిపారు. జలాశయం వద్ద బుధవారం 90 శాతం రాయితీపై 49 మంది మత్స్యకారులకు వలలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కో వల రూ.10 వేలు కాగా లబ్ధిదారుడు వెయ్యి రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. భవిష్యత్తులో టాటా ఏసీలు, మోపెడ్‌లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 2017-18 బడ్జెట్‌లో వీటిని పంపిణీ చేయనున్నట్టు ఆయన చెప్పారు. టాటా ఏసీ ధర రూ.4 లక్షలు కాగా మత్స్యకారుడు రూ.40 వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. అలాగే మోపెడ్ రూ.45 వేలు కాగా, రూ.4500 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఇన్‌స్పెక్టర్ కెఎం.అప్పారావు, మత్స్యశాఖ అధ్యక్షుడు కమిడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు వలలు పంపిణీ చేస్తున్న ఏడీ

నిండు కుండల్లా జలాశయాలు

రిజర్వాయర్లలో గరిష్ఠ స్థాయిలో నీటి మట్టం ◆ జోలాపుట్టు పెరుగుతున్న నీరు

పరవళ్లు తొక్కుతున్న వరహా, శారదా నదులు ◆ పూర్తిగా నిండిన రావణాపల్లి

డొంకరాయి గేట్లు ఎత్తివేత.. తొమ్మిది వేల క్యూసెక్కుల నీరు విడుదల



జోలాపుట్టులో స్పిల్‌వే గేట్ల వరకు చేరిన నీరు



ఎలమంచిలి: ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా నది

జిల్లాలో భారీ వర్షాలకు నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. వరద నీటి ఉధృతికి పొంగి ప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయి. నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి.

ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహించే మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు జలాశయంలో నీటి మట్టం పెరుగుతోంది. కొన్ని రోజులుగా కురస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయ నీటి సామర్థ్యం 2750 అడుగులు కాగా, బుధవారం నాటికి 2734 అడుగుల నీటి నిల్వలు నమోదయ్యాయి. దిగువన ఉన్న డుడుమ జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో జోలాపుట్టు నుంచి నీటిని విడుదల చేయడం లేదు. అయితే ఈ వేసవి కాలంలో జోలాపుట్టు జలాశయం పూర్తిగా అడుగంటి పోయింది. గత నెల వరకు ఆశించిన స్థాయిలో జలాశయంలో నీటి నిల్వ లేదు. అయితే ఆగస్టు నెలలో భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురవడంతో ఒక్కసారిగా జలాశయం నీటి మట్టం పెరుగుతోంది. డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీట నిల్వ ఉన్నప్పటికీ, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరగడం లేదు. 1, 2, 4, 5 జనరేటర్ల సాయంతో 75 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. అలాగే మత్స్యగెడ్డ నిండుకుండను తలపిస్తున్నది.

వరహా, శారదా నదుల పరవళ్లు

ఎలమంచిలి: భారీ వర్షాలకు వరహా, శారదా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఎలమంచిలి, ఎస్‌రాయవరం మండలాల మధ్య ఉన్న వరహానది, రాంబిల్లి, ఎలమంచిలి మండలాల మధ్యలోని మైనర్ శారదానదులు వరద నీటితో కళకళలాడుతున్నాయి. అలాగే చెరువులు, సాగునీటి కాలువల్లోనూ వర్షం నీరు పుష్కలంగా చేరింది. అలాగే పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు సంబరపడుతున్నారు. ఈ వర్షాలతో ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఆటంకం ఉండదని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పొంగిన రావణాపల్లి రిజర్వాయర్

గొలుగొండ: రావణాపల్లి రిజర్వాయర్‌లో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. భారీ వర్షాలకు వరద నీరు చేరి రిజర్వాయర్ పొంగుతున్నది. దీని గర్షిష్ఠ నీటి మట్టం 358.5 అడుగులు కాగా, ప్రస్తుతం ఆ స్థాయి దాటిపోయి 358.9 అడుగులకు చేరింది. అలాగే రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 354 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 354 క్యూసెక్కుల నీరు పారుతోంది.



గొలుగొండ: రావణాపల్లి రిజర్వాయర్ నిండడంతో పొర్లుకట్టమీదుగా బయటకుపోతున్న నీరు



నిండు కుండలా గుంటవాడ రిజర్వాయర్

డొంకరాయి డ్యామ్ గేట్లు ఎత్తివేత

రెండు గేట్ల ద్వారా తొమ్మిది వేల క్యూసెక్కుల నీరు విడుదల: జెన్‌కో ఎస్‌ఈ మురళీమోహన్

సీలేరు: డొంకరాయి రిజర్వాయర్ గేట్లను బుధవారం ఎత్తి వేసినట్టు సీలేరు కాంప్లెక్స్ జెన్‌కో ఎస్‌ఈ మురళీమోహన్ తెలిపారు. వేశారు. రెండు గేట్ల ద్వారా తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడదల చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం సాయంత్రం డొంకరాయి రిజర్వాయర్ నీటి మట్టం 1036.8 అడుగులకు చేరిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరున్నర గంటల నుంచి నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. నీటి మట్టం 1036 అడుగులకు తగ్గేంతవరకూ నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని ఎస్‌ఈ చెప్పారు. అలాగే గుంటవాడ రిజర్వాయర్‌లో పూర్తి స్థాయి నీటి మట్టానికి ఇంకా 3.4 అడుగుల నీరు చేరాల్సి ఉందన్నారు. ఇక్కడ పూర్తి స్థాయి నీటి మట్టం 1360 అడుగులు కాగా, ప్రస్తుతం 1356.6 అడుగుల వరకు నీరు ఉందని చెప్పారు. బలిమెల జలాశయంలో ప్రస్తుతం 1479.8 అడుగులకు చేరిందని, ఇంకా ఇక్కడ 36.2 అడుగులకు వస్తే పూర్తిస్థాయికి చేరుతుందన్నారు. కాగా, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తి స్థాయి విద్యుదుత్పత్తి జరుగుతున్నదని, డొంకరాయి నీటి మట్టం తగ్గేంతవరకూ సీలేరులో ఉత్పత్తిని నిలిపి వేశామని ఎస్‌ఈ వివరించారు.

పెట్రోలు కొలతల్లో తేడా..బంకు సీజ్


పంపును తనిఖీ చేస్తున్న ఆర్ఐ రహీంతుల్లా

చోడవరం రూరల్: చోడవరం-అనకాపల్లి ప్రధాన రహదారిలోగల వెంకన్నపాలెంలో వున్న శ్రీహర్ష సర్వీస్‌స్టేషన్‌లో పెట్రోలు కొలతల్లో తేడా ఉండడంతో రెవెన్యూ అధికారులు బంకును సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి.బుధవారం మధ్యాహ్నం చోడవరానికి చెందిన ద్విచక్రవాహనదారుడు ధర్మిశెట్టి కొండబాబు రూ.90 పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్లగా వాహనం ట్యాంకులో పెట్రోలు పడకుండానే మీటరు తిరుగుతుండడాన్ని గమనించి బంకు సిబ్బందిని ప్రశ్నించారు.

అనంతరం మరోసారి పంపును పరిశీలించగా పెట్రోల్ గన్ పైకి ఎత్తగానే మీటర్ రీడింగ్ రన్నింగ్ అవుతుండడంతో వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఆర్ఐ రహీమ్‌తుల్లా సమక్షంలో మరోసారి పంపును పరిశీలించగా పెట్రోల్‌గన్ తీయగానే మీటరు రీడింగ్ చూపించడంతో వెంటనే బంకును సీజ్ చేశారు. పెట్రోల్ నాణ్యత తెలుసుకునేందుకు శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించనున్నట్టు ఆర్ఐ తెలిపారు.

మున్సిపాలిటీకి 3,184 ఇళ్లు మంజూరు

త్వరలో మంత్రుల చేతుల మీదుగా భూమిపూజ

మున్సిపల్ చైర్‌పర్సన్ సీహెచ్ అనిత

నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలోని అర్హులైన పేదలకు 3,184 ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ చింతకాయల అనిత తెలిపారు.. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో నివసించని వారు, రేషన్ కార్డులు లేనివారు, గతంలో హౌసింగ్ రుణాలు, సబ్సిడీలు పొందిన వారు హౌస్ ఫర్ ఆల్ పథకానికి అనర్హులన్నారు. అర్హుల జాబితాను వార్డుల వారీగా సిద్ధం చేశామన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి అంగీకార ఒప్పంద పత్రాలను త్వరలో తీసుకుంటామన్నారు. వీటికి సంబంధించి బయ్యపురెడ్డిపాలెం సమీపంలో స్థలం కేటాయించామని, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా భూమి పూజ జరుగనుందన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ, ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిలను తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అనంతరం వైస్‌చైర్మన్ సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాల కోసం ఎదురుచూస్తున్న వారి జాబితాను సిద్ధం చేశామన్నారు.

2,151 మందికి సరిపడా ప్రాజెక్ట్ జాబితాను ప్రభుత్వానికి ఇప్పటికే పంపించామన్నారు. దీనిపై త్వరలో ఒక నివేదిక వస్తుందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీహెచ్ అనిత

విద్యార్థులకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా

బయటపడేసి ఖాళీ కంచాలతో ఆందోళన

పాత పద్ధతిలోనే సరఫరా చేయాలి: విద్యార్థుల తల్లిదండ్రులు

రోలుగుంట: మండల కేంద్రంలోగల ఎంపీపీ పాఠశాల(మెయిన్)లో బుధవారం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కుళ్లిన కోడిగుడ్లను వడ్డించారు. దీంతో వారు వాటిని బయటపడేసి ఖాళీ కంచాలతో ఆందోళన చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. బుధవారం స్థానిక ఎంపీపీ పాఠశాల(మెయిన్)లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 110 మంది విద్యార్థులకు భోజన నిర్వాహకులు ఉడికించిన కోడిగుడ్లను అందించారు. ఈగుడ్లు కుళ్లి దుర్వాసన వెదజల్లడంతో విద్యార్థులు వాటిని కింద పడేసి కంచాలతో పాఠశాల ముందు ఆందోళన చేశారు. పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు ప్రసాద్ చూసి కుళ్లినకోడిగుడ్లు తీసివేసి సాంబారు అన్నం మాత్రమే తినమన్నారు. గతంలో భోజన నిర్వాహకులే ఏ రోజుకారోజు గుడ్లను కొనుగోలు చేసి వడ్డించేవారు. ప్రభుత్వం ఈవిధానాన్ని రద్దు చేసి కోడిగుడ్ల సరఫరాకు యూనైటెడ్ ట్రేడర్స్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థే వారానికి సరిపడా గుడ్లను ప్రతీ పాఠశాలకు ఒకేసారి అందిస్తోంది. ఒకేసారి సరఫరా చేయడంతో ఏ ఏగుడ్లు బాగున్నాయో తెలుసుకోలేని పరిస్థితి ఉంటుందని, చాలాచోట్ల గుడ్లు కుళ్లిపోవడంతో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.


ఖాళీ కంచాలతో ఆందోళన చేస్తున్న విద్యార్థులు. ఇన్‌సెట్‌లో కుళ్లిన కోడిగుడ్లు

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

ఎం.కిరణ్మయి, విద్యాశాఖాధికారి, రోలుగుంట



కుళ్లిన కోడిగుడ్లను సరఫరా చేసిన సంస్థను పాడైపోయిన గుడ్ల స్థానంలో కొత్తవాటిని ఇవ్వమని ఆదేశించాం. సరఫరా చేసిన యూనైటెడ్ ట్రేడర్స్ సంస్థపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

పాతవిధానంలోనే సరఫరా బాగుండేది

గవిరెడ్డి నానిబాబు,రోలుగుంట



పాత విధానంలో భోజన నిర్వాహకులే ఏరోజు ఆ రోజు తెచ్చుకుని తాజా గుడ్లను అందించేవారు. ఈ పద్ధతిలో సరఫరా బాగుండేది. ప్రస్తుత నూతన విధానంలో గుడ్లు చెడుపోతున్నాయి.

ఈ కంచే హెచ్చరిక బోర్డు

గుమ్మాశిరగంపుట్టు వద్ద భారీగా కోతకు గురైన ఆర్ అండ్ బీ రోడ్డు

ఏడాదిగా స్పందించని అధికారులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 27: ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే ఆర్అండ్బీ ప్రధాన రహదారి గుమ్మాశిరగంపుట్టు వద్ద భారీగా కోతకు గురైంది. ఈ ప్రమాదకర పరిస్థితి ఏడాది కాలంగా కొనసాగుతోంది. అయినప్పటికీ ఆర్అండ్బీ అధికారుల్లో కనీసం చలనం లేదు. నిత్యం వాహనాలు రద్దీగా తిరిగే ఈ మార్గంలో ఏ క్షణమైనా ప్రమాదం తప్పదని భావించిన స్థానికులు అప్రమత్తం అయ్యారు. గుమ్మాశిరగంపుట్టు గ్రామానికి చెందిన మఠం గణపతి, మరొ కొందరు కలిసి కోతకు గురైన ప్రాంతం చుట్టూ కర్రలతో కంచె నిర్మించారు. వాహనదారులు రహదారి కోతకు గురైన విషయాన్ని ముందుగానే గ్రహించే విధంగా కంచెను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కోతకు గురైన ప్రాంతమంతా మరింత ప్రమాదభరితంగా తయారైందని గుమ్మాశిరగంపుట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రమాదకర పరిస్థితిపై ఆర్అండ్బీ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించలేదన్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు తామే కంచెను తాత్కాలికంగా ఏర్పాటు చేశామన్నారు. అయితే ప్రమాదాలు సంభవించకముందే సంబంధిత అధికారులు స్పందించాలని.. కోతకు గురైన రహదారికి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు, ఆ గ్రామస్థులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు కోరుతున్నారు.



కోతకు గురై ప్రమాదభరితంగా మారిన రహదారిలో స్థానికులు ఏర్పాటు చేసిన కంచె

నవంబర్ 14 నుంచి జాతీయ గ్రంథాలయ స్వర్ణోత్సవాలు

పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు

విజేతలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు

అరకులోయ గ్రంథాలయం ఇన్చార్జ్ జి.మురళీకృష్ణ

అరకులోయ: ఈ ఏడాది నవంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అరకులోయ గ్రంథాలయం ఇన్చార్జ్ జి.మురళీక్రిష్ణ తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలను కలుపుకుంటూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ అంశమై బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు వివిధ కేటగిరీలుగా విభజించి.. డాన్స్, డ్రామా, మోనో యాక్షన్, ఎస్సే రైటింగ్ అంశాలలో ఈ పోటీలను నిర్వస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ 6న పాఠశాల స్థాయిలో, అక్టోబర్ 13న మండలస్థాయిలో, అక్టోబర్ 27న జిల్లా స్థాయిలో, నవంబర్ 11 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు కొనసాగుతాయన్నారు.

గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యమంత్రి, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి చేతులుమీదుగా ఫ్రీ లోడెడ్ టాబ్లెట్ పీసీలు , ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. నెలలో మొదటి గురువారం, మూడో గురువారాల్లో ఆఖరి రెండు పిరియడ్స్లో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి, గ్రంథాలయం ఇన్చార్జిలు, ఎంపిక చేసిన పాఠశాలల హెచ్ఎం ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

గణపతి నిమజ్జనం

హుకుంపేట: మండల కేంద్రంలో ఉపాధ్యాయులు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభించిన ఈ ఊరేగింపు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ప్రసాదాలు పంచి పెట్టారు. గత ఐదు రోజులు కురిసిన భారీ వర్షాలకు భక్తులు ఊరేగింపునకు అంతరాయం ఏర్పడుతుందని అందరూ భావించారు. అయితే బుధవారం వాతావరణం అనుకూలంగా ఉండడంతో భక్తులంతా ఎంతో ఉత్సాహంగా ఊరేగింపును నిర్వహించారు. ఊరేగింపులో ధింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం స్థానిక రాళ్లగెడ్డలో నిజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాగరి రాజారావు, జన్ని ఆనందరావు, చెల్లయ్య, భాస్కరరావు, రామ్మూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి

అరకురూరల్: విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విద్యార్థులకు విద్య వైజ్ఞానిక శిక్షణను స్థానిక గిరిజన సంఘం భవనంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో నేటికీ పూర్తిస్థాయి లెక్చరర్స్ను నియమించకపోవడం ఎంతో బాధాకరమన్నారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, వాటికి రన్నింగ్ వాటర్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కొన్ని పాఠశాలల్లో అనేక భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి పి.రామన్న, మండల అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, భాస్కర్రావు, నాయకులు లక్ష్మణ్, రామ్మూర్తి, మూర్తి, గాసి, సంతోష్, కె.సంతోష్, సుశీల, భారతి, సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు కె.నర్సయ్య

కుంగిన గత్తురుముండ కల్వర్టు

ఐదు గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు



గత్తురుముండ వద్ద కుంగిపోయిన కల్వర్టు

ముంచంగిపుట్టు: కొన్ని రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో.. దోడిపుట్టు పంచాయతీ గత్తురుముండ గ్రామ సమీపంలో కల్వర్టు వరద ఉధృతికి మంగళవారం రాత్రి కుంగిపోయింది. దీంతో ఈ ప్రాంతంలోని ఐదు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయింది. మండలంలో కూరగాయాలు సాగు చేసే గ్రామాల్లో మంచి పేరు ఉన్న గ్రామాలు దోడిపుట్టు, గత్తురుముండ, పనస గ్రామాల్లో విస్తారంగా వివిధ రకాల కూరగాయాలు సాగు చేపట్టి మండలకేంద్రంతో పాటు వివిధ పాఠశాలలకు, వారపుంసతలకు ఇదే మార్గం గుండా తరలిస్తుంటారు. అధికారులు స్పందించి తక్షణమే కల్వర్టు మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

హిమసోయగాల మధ్య వానరం



వరుస వర్షాలతో పాటు మన్యంలో హిమ సోయగాలు కొండల మధ్య ఎంతో ఆకర్షణగా నిలుస్తున్నాయి. అటువంటి హిమ సోయగాల మధ్య.. అనంతగిరి ఘాట్ రోడ్డులో ఓ వానరం హొయలు పోతూ ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కింది.
- అనంతగిరి రూరల్

అక్కడ అటెండరే వైద్యుడు, నర్సు

పెదబయలు పీహెస్సీలో దుస్థితి

పెదబయలు, ఆగస్టు 30: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెండర్ ఒక్కరే దిక్కయ్యారు. ఆస్పత్రిలో వచ్చే రోగులకు ఆయన మందులు, ఇంక్షన్లు వేస్తున్నారు.

బుధవారం పీహెచ్సీలో వైద్యాధికారితో పాటు సిబ్బంది సైతం అందుబాటులో లేకపోవడంతో అటెండర్ మాత్రమే వైద్యం అందిస్తున్నారు. అయితే మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుబారీ నీలకంఠం వాంతులు చేరుకుని వైద్య సేవలకై పీహెచ్సీకి చేరుకున్నారు. అయితే సాయంత్రం 4 గంటలైనా వైద్యసిబ్బంద ఎవ్వరూ రాలేదు. దీంతో పలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇక్కడ వచ్చే జ్వరబాధితులకు మాత్రం అటెండర్ తనకు తెలిసిన మాత్రలు, ఇంజక్షన్లు అందిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి రోగులకు సకాలంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని రోగులు కోరుతున్నారు.



ఇంజెక్షన్ చేస్తున్న అటెండర్

420 మందికి వాక్సినేషన్

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలోని పలు గ్రామాల్లో సుమారు 420 మంది గిరిజన చిన్నారులకు మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్సను బుధవారం హెల్త్ ఆసిస్టెంట్ కె.రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటసీమ పంచాయతీ పరిధిలో ఉన్న చిన్నారులకు వ్యాక్సిన్ వేసి బుధవారంతో ముగింపు చేశామని తెలిపారు. వ్యాక్సిన్ వేసుకున్నా చిన్నారులకు ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు కలగలేదని అన్నారు. వైద్యాధికారి సింధూరంపడాల్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బంది హెచ్ఎస్ సాంభశివ స్వామి, మిల్టాన్ సునీలా, లక్ష్మి, పార్వతి, మీనా పాల్గొన్నారు.



వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను ఎత్తివేయాలి

హుకుంపేట: ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలను మూసివేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కొర్రా మార్కండేయులు అన్నారు. ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలను ఎత్తివేయాలని, లేని పక్షంలో భవిష్యత్లో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

మండల కేంద్రంలో బీవీకే పాఠశాలలో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన పూర్తిస్థాయిలో రికార్డులు లేకుండా పాఠశాల నడుపుతున్నారని, దీన్ని సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి, మూసివేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



హుకుంపేటలో బీఎస్ఎన్ఎల్ టవర్

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ ఉండడం లేదాయే..

రెండు రోజులుగా వినియోగదారుల అవస్థలు

హుకుంపేట, ఆగస్టు 29: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా సిగ్నల్ సరిగ్గా లేకపోవడంతో ఎవ్వరికీ ఫోన్లు చేసినా లైన్ కనెక్ట్ అవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. వారానికి రెండు, మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఎదురవుతోందని, దీంతో అత్యవసర వేళల్లో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సెల్ సిగ్నల్ సక్రమంగా పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

పెదబయలు: మండలంలోని 23 పంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి కూలీలకు అందాల్సిన రూ.2 కోట్లు చెల్లించాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకుడు సన్నిబాబుతో పాటు లబ్ధిదారులు ర్యాలీ నిర్వహించారు. లబ్ధిదారులు సుమారు మూడు గంటలపాటు ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ, మండలంలోని అన్ని పంచాయతీల్లో జాబ్‌కార్డు దారులు చేపట్టిన పనులకు సంబంధించి మొత్తం రూ.2 కోట్లు బకాయి ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని తక్షణమే కూలీలకు అందించాలన్నారు. అలాగే వన్నడ గ్రావెల్ రోడ్డు, సీకరి, రూడకోట లోని మరుగుదొడ్ల బిల్లుల చెల్లించాల్సి ఉందని అన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఏపీడీ భ్రమరాంబపై చర్యలు తీసుకోవాలి

అరకులోయలో మరుగుదొడ్ల నిర్మాణం ● చెల్లింపుల అంశమై సీపీఎం డిమాండ్

అరకులోయ: ముఖ్యమంత్రి దత్తత పంచాయతీ అరకులోయ ఏపీడీ భ్రమరాంబపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది. ఈ అంశమై అరకు డివిజన్ సీపీఎం కార్యదర్శి సురేంద్ర, మండల కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు చెల్లించాల్సిన వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లుల మొత్తాలను ప్రైవేటు వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు ఏ నిబంధనలను అనుసరించి జమ చేశారని ఏపీడీ భ్రమరాంబను ప్రశ్నించారు. ఏది ఏమైనా నిధులను మళ్లించి అవకతవకలకు పాల్పడిన ఆమెపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రినే తప్పుదోవ పట్టించి బహిరంగసభలో వందశాతం మరుగుదొడ్లు పూర్తి అయ్యాయని ప్రకటనలు చేయించడం గమనార్హమన్నారు. ఏ గ్రామంలో ఎంతమంది లబ్ధిదారులకు బిల్లులు అందలేదో, వారి బిల్లులు ఏ ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు ఎంతెంత జమ చేశారో ఆ వివరాలను విచారణ అధికారి ఏపీడీ లచ్చన్నకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశామని పేర్కొన్నారు. అయితే వేరే శాఖకు సంబంధించిన ఉన్నతాధికారిని విచారణ అధికారిగా నియమిస్తే బాగుండేదని.. కలెక్టర్, ఐటీడీవో పీవోను ఉద్దేశించి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా ప్రభుత్వ లక్ష్యం ప్రకారం మరుగుదొడ్లు పూర్తిచేసి డబ్బులు అందని లబ్ధిదారులందరికీ చెల్లింపులు చేయాలన్నారు.



విచారణ అధికారి లచ్చన్నకు ఫిర్యాదు అందజేస్తున్న సీపీఎం ప్రతినిధులు సురేంద్ర, బాలదేవ్

అభివృద్ధిపై సమగ్ర సమాచారం అందించాలి

జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కొట్యాడ అప్పారావు

అనంతగిరిరూరల్: మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కొట్యాడ అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిదులకు అధికారులు ఎటువంటి సమాచారాన్ని అందించడంలేదని ఈపద్ధతి మార్చుకోకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెలతానన్నారు. గిరిజన అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయిలు మంజూరు చేస్తుండగా వాటిని ప్రజలకు తెలిపే భాద్యత తమపై ఉందని , ఏనిదులు మంజూరయ్యాయో అధికారులు గోప్యత పాటిస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఈసమావేశానికి హాజరుకాని అధికారులపై సీఈఓకు ఫోన్‌లో ఫిర్యాదుచేసి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌రామన్, ఏపీఓ శ్రీనివాస్, ఏఓ పావని, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొట్యాడ అప్పారావు

బోందుగుడలో బైబిల్ కళాశాల ప్రారంభం



బైబిల్ కళాశాల ప్రారంభం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమ

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ బోందుగుడ గ్రామంలో బుధవారం జెహోవా జైరే మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో బైబిల్ కళాశాలను అరకులోయ మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ కమిషన్ ఛైర్మన్ సివేరి సోమ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ సందేశం ప్రతీ ఒక్కరికీ అవసరమన్నారు. గిరిజనులు ఇరత ప్రాంతాలకు పోకుండా ఇప్పుడు అరకులోయ పరిసరా ప్రాంతంలోనే బైబిల్ కళశాల ప్రారంభం చేయడం ఏంతో శుభసూచికమని అన్నారు. మేరీ భాస్కర్ బిట్రా డైరెక్టర్ , ఫౌండర్‌గా వ్యవహారిస్తు ఇక్కడ బైబిల్ కళశాల స్థాపించడం క్రైస్తవ సోదరులకు మంచి అవకాశమని పేర్కొన్నారు. శ్యామ్‌కిషోర్ పాల్గొని దేవ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమీటి సభ్యుడు కె.సుబ్బారావు, టీడీపీ నాయకులు ఎం.స్వామి, బి.వెంగళరావు, క్రాంతి కుమార్ బైబిల్ మిషన్ రాజమండ్రి తదితరులు పాల్గొన్నారు

వివిధ దశల్లో ఎన్టీఆర్ గృహకల్ప ఇళ్ల నిర్మాణం

పి.లోకనాథం, హౌసింగ్ ఏఈ, హుకుంపేట

ఇంటర్వ్యూ



ప్రశ్న: ఎన్టీఆర్ గృహ కల్ప పథకం ద్వారా మండలంలో ఎన్ని గృహాలు మంజూరయ్యాయి?

జవాబు: మండలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం ద్వారా 125 గృహాలు మంజూరయ్యాయి. వాటి నిర్మాణ పనులు వేగవంతానికి తగు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఆయా గృహాలు పలు దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

ప్రశ్న: నూతనంగా గృహాలకు దరఖాస్తులు ఏమైనా అందాయా?

జవాబు: సుమారు 200కు పైగా గృహాలకు దరఖాస్తులు అందాయి. వాటికి సర్వే చేసి, పూర్తిస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతిపాదిస్తాం. తర్వాత మంజూరైన వెంటనే లబ్ధిదారులు నిర్మాణాలకు తగు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మొదటి విడతగా మంజూరైన గృహాల పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి? నిజమేనా?

జవాబు: మొదటి విడతగా మంజూరైన గృహాలకు బిల్లులకు సంబంధించి ఆన్‌లైన్ సమస్య కారణంగా కొన్ని ఇబ్బందులు తలెత్తుతుండంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాటి బిల్లులు అందించేందుకు చర్యలు చేపట్టి పనులు వేగవంతానికి కృషిచేస్తాం.

- హుకుంపేట

కాఫీ పెంపకాన్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఏడీ రాధాకృష్ణ

పెదబయలు: మండల కేంద్రంలో ఉపాధి హామి పథకం ద్వారా చేపడుతున్న కాఫీ తోటల పెంపకాన్ని మరింతా అభివృద్ధి చేయాలని ఆ శాఖ ఏడీ రాధాకృష్ణ అన్నారు. బుధవారం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో కాఫీ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ రాధాకృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కాఫీ తోటల అభివృద్ధి చేయాలన్నారు. కాఫీ సాగుతో అధిక ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ధనుంజయ్, హెచ్‌వో ప్రవీణ్‌పడాల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తిపోతల

... మొదటి పేజీ తరువాయి

తవ్వకపోవడం వంటి కారణాల వల్ల ఆయకట్టుకు నీరు అందక రైతులు పంటలు సాగు చేసుకోలేకపోతున్నారు.

చిన్న, సన్నకారు రైతులకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గతంలో పలుచోట్ల ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. విద్యుత్ బిల్లులు భారం కావడం, నిర్వహణ పనులు లోపించడం, మోటార్లు పాడైపోవడం, తదితర కారణాలతో సుమారు పదేళ్ల నుంచి ఎత్తిపోతల పథకాలు మూలకు చేరాయి. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం తిరిగి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం... జిల్లాలో 43 ఎత్తిపోతలల్లో 25 పథకాలను పునరుద్ధరించడానికి 2015-16వ సంవత్సరంలో రూ.11.50 కోట్లు విడుదల చేసింది. మోటార్ల ఏర్పాటు, విద్యుత్ బకాయిల చెల్లింపు, సంప్/వెల్‌ల వద్ద వాటర్ డైవర్షన్ వాల్వ్ నిర్మాణం వంటి పనులు చేపట్టాలి. వీటిని ఏపీఎస్‌ఐడీసీ విజయనగరం సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలి. ఈ పనులు పూర్తయితే మైదాన ప్రాంతంలోని ఏడు మండలాలు, ఏజెన్సీలోని నాలుగు మండలాల్లో 6,203 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మైదాన ప్రాంతంలోని అనకాపల్లి మండలం వెంకుపాలెం, మునగపాక మండలం వాడ్రాపల్లి, కోటవురట్ల మండలం ఎండపల్లి, దేవరాపల్లి మండలం సమిధ గ్రామాల్లో ఎత్తిపోతల పథకాల పనులు పూర్తయ్యాయి. చోడవరం, అచ్యుతాపురం, పెందుర్తి, మునగపాక మండలాల్లో రూ.1.22 కోట్లు


కోడిగెడ్డలో నీటి సరఫరాకు కాల్వలు లేని దృశ్యం

ఖర్చు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ ఇంతవరకు పనులు పూర్తికాలేదు. ఏజెన్సీలో కూడా సగం పథకాల పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. పూర్తయిన పథకాల నుంచి వివిధ కారణాలతో ఆయకట్టుకు నీరు అందడంలేదు.

కాంట్రాక్టర్ల అవతారం ఎత్తిన స్థానిక ప్రజా ప్రతినిధులు

ఎత్తిపోతల పథకాల నిర్వహణ పనులు చేపట్టేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు పోటీపడినట్టు తెలిసింది. టెండర్ల ద్వారా పనులు కేటాయించినప్పటికీ, ఎస్‌ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు వీరితో కుమ్మక్కైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్లు దక్కించుకున్న వ్యక్తులు కొన్నిచోట్ల పనులను మధ్యలో వదిలేశారు. మరికొన్నిచోట్ల విద్యుత్ సరఫరాలేక పథకాలు ముందుకు సాగలేదు.

కొరవడిన పర్యవేక్షణ

ఎత్తిపోతల పథకాల పునర్నిర్మాణ పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. చెప్పాలి. ఏపీఎస్‌ఐడీసీ సర్కిల్ ఆఫీస్ విజయనగరంలో వుండడంతో ఇంజనీర్లు వారానికి


ముద్దుర్తిలో ఇంజన్లతో నీటిని తోడుకుంటున్న రైతులు

ఒకటి రెండు రోజుల కూడా పనుల పర్యవేక్షణకు రావడం లేదు. దీంతో పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్లు(స్థానిక నేతలు) పనులు వేగంగా చేయకుండా తాత్సారం చేస్తున్నారు. కొన్నిచోట్ల అడ్వాన్సు బిల్లు పొందిన కాంట్రాక్టర్లు, పనులు మధ్యలోనే వదిలేశారు. ఏజెన్సీలోని పాడేరు, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో ఈ పరిస్థితి వుంది.

ఏజెన్సీలో ఎక్కడి పనులు అక్కడే

ఏజెన్సీలో హుకుంపేటలో మినహా మరెక్కడా ఎత్తిపోతల పథకం పనులు పూర్తికాలేదు. మారెలలో రూ.27.95 లక్షలతో పనులు చేపట్టగా, ఇంతవరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. అడ్డుమండలో రూ.30.5 లక్షలతో, పాడేరు మండలం ఒబ్బిడిపుట్టులో రూ.50 లక్షలతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశారు. హుకుంపేట మండలం కొంతిలి, కొట్నాపల్లి; అరకులోయ మండలం నక్కలపుట్టు, కొత్తవలస, కొడిగెడ్డ, డుంబ్రిగుడ మండలం నిమ్మగెడ్డల్లో సివిల్ పనులు పూర్తిచేసి బిల్లులు మార్చుకున్న కాంట్రాక్టర్లు, మోటార్లు బిగించకుండా వదిలేశారు. ఎత్తిపోతల పథకాల వద్ద పునరుద్ధరణ పనులకు కేటాయించిన నిధులు, ఆయకట్టు, రైతుల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా బోర్డులు ఏర్పాటు చేయలేదు.

ఏ పథకానికి ఎంత...

అనకాపల్లి మండలం వెంకుపాలెం పథకానికి రూ.12.35 లక్షలు, మునగపాక మండలం వాడ్రాపల్లికి రూ.12.57 లక్షలు, కోటవురట్ల మండలం ఎండపల్లికి రూ.18.60 లక్షలు, పాడేరు మండలం సేరిబయలు-1 పథకానికి రూ.55.69 లక్షలు, సేరియబలు-2 పథకానికి రూ.16 లక్షలు, హుకుంపేట మండలం దిగుడుపుట్టు పథకానికి రూ.27.60 లక్షలు, మారెల పథకానికి రూ.27.95 లక్షలు, అడ్డుమండ రూ.30.50 లక్షలు, దేవరాపల్లి మండలం సమిధ రూ.39.29 లక్షలు, పాడేరు మండలం ఒబ్బిడిపుట్టు రూ.50 లక్షలు, చింతపల్లి మండలం కొత్తూరుబయలు రూ.61.90 లక్షలు, హుకుంపేట మండలం కొంతిలి రూ.68.29 లక్షలు, చోడవరం మండలం ముద్దూరు రూ.67 లక్షలు, అరకులోయ మండలం నక్కలపుట్టు రూ.68.94 లక్షలు, హుకుంపేట మండలం కొట్నాపల్లి రూ.71.50 లక్షలు, డుంబ్రిగుడ మండలం నిమ్మగెడ్డకు రూ.75 లక్షలు, అరకులోయ మండలం బెంజిపూర్‌కు రూ.76.20 లక్షలు, కొత్తవలసకు రూ.కోటి, హుకుంపేట మండలం తడిగిరికి రూ.79 లక్షలు కేటాయించారు. పెందుర్తి, చోడవరం, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు మరో రూ.1.22 కోట్లు మంజూరు అయ్యాయి. కానీ ఇంతవరకు ఎంత మేర నిధులు ఖర్చు అయ్యాయి? ఏ ఏ పనులు పూర్తయ్యాయి? ఇంకా పూర్తికావాల్సిన పనులు ఏమిటి? జాప్యానికి కారణాలు ఏమిటి? పూర్తయిన పథకాల ఆయకట్టుకు నీటి సరఫరా ఎందుకు జరగడంలేదు? వంటి ప్రశ్నలకు ఏపీఎంఐడీసీ అధికారులు సమాధానాలు చెప్పాల్సి వుంది.

ముద్దుర్తిలో రైతులకు అక్కరకురాని పథకం

- రూ.47 లక్షలు ఖర్చు చేసినా పొలాలకు చుక్క నీరు అందని వైనం

చోడవరం : మండలంలోని ముద్దుర్తిలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ పథకం రైతుల సాగునీటి అవసరాలను ఏ మాత్రం తీర్చలేకపోతోంది. రెండు దశాబ్దాల నుంచి వృథాగా పడి ఉన్న ఈ ఎత్తిపోతల పథకానికి ఇటీవలే 47లక్షల రూపాయలు వెచ్చించి వినియోగంలోకి తెచ్చినప్పటికీ, ఆయకట్టు పరిధిలోని పొలాలకు సాగునీరు అందని పరిస్థితి ఉంది. లక్షలు ఖర్చు చేసినా లక్ష్యం చేరని ఈ సాగునీటి పథకం నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. ముద్దుర్తి గ్రామంలో ఐదొంద ఎకరాల భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో శారదానది ఒడ్డున 1993లో రూ.9లక్షల వ్యయంతో పథకం నిర్మించారు. శారదానది నుంచి ఇన్‌టేక్ వెల్ ద్వారా నీటిని పంపింగ్ చేసి, గ్రామానికి సమీపంలో ఉన్న చెరువుకు పైపులైన్ల ద్వారా డంపింగ్ చేసి అక్కడ నుంచి కాలువల ద్వారా రైతుల పొలాలకు నీరందించాలన్నది పథకం ఉద్దేశ్యం. పథకం ప్రారంభమైన తరువాత ఏడాదిపాటు బాగానే నడిచింది. ఆ తరువాత పథకం నిర్వహణ కొరవడడం, పథకానికి సంబంధించి విద్యుత్ బిల్లులు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యుత్ సౌకర్యాన్ని తొలగించారు. అప్పటి నుంచి ఈ పథకం పడకేసింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇందుకు సంబంధించిన మోటార్లు, ఇతర యంత్రసామాగ్రి తుప్పుపట్టిపోయాయి. ఈ పథకం గురించి పట్టించుకున్న నాథుడు కరువవ్వడంతో రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితిలో ఈ పథకం నిర్వహణకు స్థానిక ఎమ్మెల్యే రాజు ప్రభుత్వం నుంచి గత ఏడాది రూ.47లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో పడకేసిన పథకాన్ని తిరిగి పట్టాలెక్కించారు. పాడైన


ముద్దుర్తిలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం

పైపులైన్ల స్థానంలో కాల్వలు తవ్వి మరోసారి కొత్త పైపులు అమర్చి విద్యుత్ కనెక్షన్ కూడా ఇచ్చారు. చెరువు నుంచి నీరు బయటకు పోయేందుకు వీలుగా పైపులు కూడా అమర్చారు. పథకానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో ఈ పథకం పనిచేస్తుందని, తమ కష్టాలు గట్టెక్కినట్టేనని రైతులు సంబరపడ్డారు.

తూ.తూ. మంత్రంగా పనులు

పథకం నిర్వహణ పనులు చేపట్టి వినియోగం లోనికి తెచ్చినా, పైపుల నుంచి చెరువులోనికి పరిమితంగానే నీరు పారుతోంది. నీరు తోడడానికి ఏర్పాటు చేసిన రెండు మోటార్లలో ఒకటే పనిచేస్తోంది. ఆ ఒక్క మోటారుతో తోడుతున్న నీరు చెరువులోనికి కనీస స్థాయిలో చేరడం లేదు. రెండో మోటారు మరమ్మతుకు గురైందని అందువల్ల ఒక్క మోటారుతోనే నీటిని తోడుతున్నట్టు అధికారులు చెపుతున్నప్పటికీ, అసలు విషయం వేరే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తూ.తూ. మంత్రంగా పథకం పనులు చేపట్టినందున ఇది సరిగా నడవడం లేదని రైతులు వాపోతున్నారు. మోటార్లు కెపాసిటీకి తగినట్లుగా పైపులు వేయలేదని, అందువల్ల రెండు మోటార్లు ఆన్ చేస్తే పైపుల్లో నీరు ఎగదన్ని పైపులు ఎక్కడికక్కడ లీకైపోతున్నట్టు రైతులు చెపుతున్నారు. దీనితో ఒక్క మోటారునే పనిచేయించి దానితోనే నీరు తోడుతుండడంతో ఇది రైతుల అవసరాలకు ఏమాత్రం చాలని విధంగా ఉందని రైతులు చెపుతున్నారు. ఇదిలావుంటే, చెరువు నుంచి బయటకు నీరు పోయే మార్గం పనులను కూడా అధికారులు మొక్కుబడిగా చేపట్టారు. చెరువు లోతుగా ఉండడం, పైపులైన్లు ఎత్తులో పెట్టడంతో చెరువులో భారీగా నీరు నిండితే తప్ప బయట పొలాలకు నీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. గత్యంతరం లేక చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజన్లతో రైతులు తోడుకుంటున్నారు. ఈ సౌకర్యం లేని రైతులు ఆకాశం వంక దీనంగా చూడడం తప్పితే ఏం చేయలేకపోతున్నారు. ఈ పథకం నిర్వహణ, మోటారు ఆన్ చేయడానికి ఏర్పాటు చేసిన ఉద్యోగికి వేతనం ఇవ్వక పోవడంతో ఆయన విధులకు రావడం మానేశారు. దీంతో పథకం ఆన్‌చేసే నాథుడు లేకపోవడంతో చెరువులోకి నీరు రావడం లేదు. ఇప్పటికైనా పైపులు సక్రమంగా అమర్చడంతో పాటు, పథకానికి 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పిస్తే, వేసవిలో కూడా ఇక్కడ వ్యవసాయం చేయడానికి అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

నాలుగు గంటలు తోడితే ఏ మూలకీ చాలదు



రోజుకు నాలుగు గంటలు పగలు, రాత్రి మూడు గంటల పాటు త్రీఫేజ్ కరెంటు వస్తోంది. ఈ కరెంటుతో ఒక మోటారుతో నీటిని తోడితే ఆ నీరు చెరువులో కనీసం చేరడం లేదు. రెండు మోటార్లతో వరుసగా రెండు రోజుల పాటు నీటిని తోడితే చెరువు నిండి కాలువల్లోనికి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇలా ఒక్క మోటారుతో ఉదయం నాలుగు గంటలు నీటిని తోడితే అది రైతులకు చాలడం లేదు.

- కడియం రాజు, రైతు, ముద్దుర్తి

లక్షలు వ్యయం.. ప్రయోజనం శూన్యం!



అరకులోయ : మండలంలో మూడు ఎత్తిపోతలు పథకాలు ఉన్నాయి. బెంజిపూర్, చొంపి, కోడిగెడ్డ ఎత్తిపోతల పథకాలు. ఒక్కో ఎత్తిపోతల పథకం కింద సుమారు 150 నుంచి 300 ఎకరాలకు పైగా నీరందించే లక్ష్యంతో నిర్మించారు. ప్రస్తుతం ఏ ఒక్క పథకం రైతుల పంట పొలాలకు నీరందించడం లేదు. అరకొరగా పని చేసే ఈ పథకాలకు విద్యుత్ బిల్లులు ఎక్కువగా రావడంతో రైతులు వాటిని కట్టుకునే పరిస్థితి లేకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గత ఏడాది ఈ పథకాల పనులను ఏపీ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ విజయనగరం జిల్లా విభాగం స్టేట్ ప్లాన్ నిధులతో చేపట్టింది. పంప్‌హౌస్, మోటార్లు, పైపులు, కలక్షన్ ట్యాంకు, ఫిల్టర్ బావులు ఇలా కొన్ని పనులను చేపట్టారు. అయితే ఏ లక్ష్యంతో పునర్నిర్మించారో ఆ లక్ష్య సాధన దిశగా పనులను పూర్తి చేయలేదు. ఈ పథకం నుంచి పంట పొలాలకు అవసరమయ్యే పంట కాల్వలను మాత్రం నిర్మించలేదు. దీంతో చుక్కనీరు ఈ పథకం నుంచి పొలాలకు చేరిన దాఖలాలు లేవు. కోడిగెడ్డ ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఒక్క పంట పొలానికీ నీరు సరఫరా చేసే కాల్వలు నిర్మించలేదు. పాత కాల్వలకు మరమ్మతులు కూడా చేపట్టలేదు. పనులు చేపట్టి ఏడాది కావస్తున్నా పంట పొలాలకు నీరిచ్చిన దాఖలాలు కనిపించలేదు. వర్షాధారం పైనే ఆధారపడి వరిసాగు చేస్తున్నారు. కోడిగెడ్డ ఎత్తిపోతల పథకాన్ని అధికారుల లెక్కల ప్రకారం 150 ఎకరాల విస్తీర్ణానికి నీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. వాస్తవానికి సుమారు 450 నుంచి 500 ఎకరాల విస్తీర్ణానికి నీరు అందే అవకాశం ఉంది.

పంట కాల్వలు నిర్మించాలి



కోడిగెడ్డ ఎత్తిపోతల పథకం కింద ఉన్న ఆయకట్టుకు తక్షణం నీటి సరఫరా అయ్యేలా పంటకాల్వలు నిర్మించాలి. పంట కాల్వలు నిర్మించకుండా అర్ధంతరంగా పనులు నిలిపేసి వెళ్లిపోయారు. రైతులను కనీసం భాగస్వామ్యం చేయకుండా మరమ్మతులు చేపట్టారు.

- బురిడి ప్రసాద్, ఆయకట్టుదారుడు, నిసానిగుడ

అనకాపల్లి - పెందుర్తి వయా విశాఖ బస్సుకు చర్యలు

- ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ వెల్లడి
- 'డయల్ యువర్ డీఎం'లో సమస్యల స్వీకరణ

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి నుంచి సబ్బవరం, పెందుర్తి మీదుగా విశాఖనగరానికి బస్సు నడిపేందుకు ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డీఎం వి.ప్రవీణ తెలిపారు. బుధవారం ఆమె డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనకాపల్లి ఆర్టీసీ డిపో నుంచి సబ్బవరం పెందుర్తి మీదుగా విశాఖపట్నానికి బస్సు నడపాలని కోడూరు పంచాయతీకి చెందిన హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధి శ్రీనివాసరావు కోరగా ఆమె పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సబ్బవరం మీదుగా విశాఖకు బస్సు నడిపే అంశం అధికారుల దృష్టిలో ఉందన్నారు. శంకరం గ్రామం వద్ద బస్టాప్ ఉన్నా బస్సులు ఆపడం లేదని కొందరు, బస్సుల్లో పది రూపాయల కాయిన్లు తీసుకోవడం లేదని మరికొందరు తెలిపారన్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులు, వికలాంగులకు కేటాయించినట్లే భార్యాభర్తలకు సీట్లు కేటాయించాలని అనకాపల్లికి చెందిన ప్రయాణికుడు కోరారని చెప్పారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎం ప్రవీణ

అంకితభావంతో పనిచేయండి

◆ వారాంతపు సెలవుపై ఎస్పీతో చర్చిస్తా ◆ హోంగార్డ్స్ కమాండెంట్ రామచంద్రరాజు



హోంగార్డులకు సూచనలు ఇస్తున్న రామచంద్రరాజు

అనకాపల్లిటౌన్: క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి సమాజంలో గుర్తింపు పొందాలని హోంగార్డ్సు కమాండెంట్ రామచంద్రరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన హోంగార్డుల పెరేడ్‌కు ఆయన హాజరై పలు సూచనలు చేశారు. ప్రజల్లో మంచిపేరు తెచ్చుకునే విధంగా ప్రవర్తించాలన్నారు. పోలీసులకు సమానంగా విధులు నిర్వహి స్తూ చక్కని ప్రతిభ కనబరుస్తున్నారని అభినందించారు. పెరెడ్‌లకు హోంగార్డులు సక్రమంగా హాజరుకావడం లేదని, ఇకపై అలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని సూచించారు. హోంగార్డులకు వారంతపు సెలవులపై ఎస్పీతో సంప్రదిస్తామన్నారు. పలువురు హోంగార్డులు యూనిఫాం సక్రమంగా అందడం లేదని కమాండెంట్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి విధిగా అందరికీ యూనిఫాం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా హోంగార్డుల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రహ్మణ్యం, ఆర్ఎస్ఐ ప్రభాకర్, హెడ్ కానిస్టేబుల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఇళ్లకు జియోట్యాగింగ్

జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి



ఇంటి కొలతలను పరిశీలిస్తున్న డీపీఓ కృష్ణకుమారి

రావికమతం: జిల్లాలో రెండు లక్షల ఇళ్లకు జియోట్యాగింగ్ పూర్తి చేశామని జిల్లా పంచాయతీ అధికారి బి.కృష్ణకుమారి తెలిపారు. బుధవారం రావికమతంలో జరుగుతున్న జియోట్యాగింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఐదు లక్షల ఇళ్లకు జియోట్యాగింగ్ చేయాల్సి ఉందన్నారు. 927 పంచాయతీలకు 319 మంది కార్యదర్శులు ఉన్నారని, ఒకొక్క కార్యదర్శికి రెండు పంచాయతీలను అప్పగించామన్నారు. అయినప్పటికీ జియోట్యాగింగ్ ఆశాజనకంగానే జరుగుతుందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో నెట్‌వర్క్ అందుబాటులో లేక జాప్యమవుతుందని చెప్పారు. సబ్బవరం మండలం ప్రథమ స్థానంలోను, రావికమతం ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. ఈవోపీఆర్‌డీ ఓ.మహేష్ చొరవతో పనులు వేగవంతమవుతున్నాయన్నారు. జిల్లాలో 42 పంచాయతీల వీధి దీపాలకు 49,429 ఎల్ఈడీ బల్బులు అమర్చామని తెలిపారు. అరకు మండలం చెదలపూడి గ్రామంలో నూరుశాతం ఎల్ఈడీ బల్బులు అమర్చిన తరువాత విద్యుత్ వినియోగం 50 శాతం తగ్గిందని చెప్పారు. జిల్లాలో 23 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 528 కేంద్రాలకు స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని డీపీవో కృష్ణకుమారి చెప్పారు. స్వీపర్ల వేతనాలకు జనరల్‌ఫండ్‌లో నిధులు అందుబాటులో లేకపోతే 14వ ఆర్థిక సంఘం నిధులు నుంచి చెల్లించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఉపసర్పంచ్ కె.జగన్నాథరావు, ఈవోపీఆర్‌డీ ఓ.మహేష్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేశవరం పాఠశాలకు స్వచ్ఛ విద్యా పురస్కార్



◆ న్యూఢిల్లీలో ప్రదానం రేపే
◆ కేంద్ర మంత్రి నుంచి అందుకోవడానికి బయలుదేరిన హెచ్‌ఎం, విద్యార్థి

కేంద్రప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ విద్యా పురస్కార్‌కు కేశవరం పాఠశాల ఎంపికైంది. జిల్లాలో ఎంపికైన మూడు పాఠశాలల్లో కేశవరం ఒకటి. సెప్టెంబర్ ఒకటో తేదీన కేంద్ర మంత్రి ప్రదానం చేయనున్న పురస్కారం అందుకోవడానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి, ఐదో తరగతి విద్యార్థి అభిషేక్ న్యూఢిల్లీ పయనమయ్యారు. గ్రామస్థులు, విద్యార్థుల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

పాయకరావుపేట : మండలంలోని కేశవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామస్థులు, విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దాలని హెచ్‌ఎం ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిర్ణయించుకున్నామని ఉపాధ్యాయుడు ఎం.శ్రీరాములు తెలిపారు. తమ నిర్ణయానికి గ్రామస్థులు కూడా సహాయ, సహకారాలు అందించడానికి ముందుకు వచ్చారు. ఏడాది పాటు సమష్టి కృషితో పాఠశాల పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచామని, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించామని, మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించామని, అలాగే పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా నిర్వహించామన్నారు. ఈ అంశాల్లో తమ పాఠశాల మెరుగైన పాయింట్లు సాధించి స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కి ఎంపికైందన్నారు. విశాఖ రూరల్ జిలా నుంచి ఎంపికైన రెండింటిలో ఒకటి తమ పాఠశాల కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో వివిధ సౌకర్యాల కల్పనకు గ్రామస్థులు రూ.30 వేల సాయం చేశారని, డక్కన్ కెమికల్ కంపెనీ యాజమాన్యం పాఠశాల ప్రహరీ నిర్మించిందని తెలిపారు. విద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేసి స్వచ్ఛ భారత్ అమలు చేశామన్నారు.

స్వచ్ఛ పాఠశాల కమిటీ సభ్యులు వీరే

పాఠశాలలో స్వచ్ఛ పాఠశాల కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో పి.దుర్గా భవానీ (పాఠశాల ఆవరణ శుభ్రత), వై.కుసుమ (మరుగుదొడ్ల నిర్వహణ), వి.సౌజన్య (ఆరోగ్య పరిరక్షణ) ఎ.వర్షిత (పరిసరాల పరిశుభ్రత) ఆర్.అరుణ (నీటి వినియోగం) సభ్యూరాలుగా ఉన్నారు. ఉపాధ్యాయుల సూచన మేరకు వీరు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.



కమిటీ సభ్యులు వరుసుగా వై.కుసుమ, పి.దుర్గాభవానీ, వి.సౌజన్య, ఎ.వర్షిత, ఆర్.అరుణ



సక్రమంగా నిర్వహిస్తున్న మరుగుదొడ్లు

ప్రగతి పథంలో ఆర్టీసీ

... మొదటి పేజీ తరువాయి

వచ్చేది. ఈ ఏడాది అదే కాలానికి సగటున రోజుకు రూ.99 లక్షలు వస్తున్నది. గత ఏడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు నెలాఖరు నాటికి అంటే ఎనిమిది నెలల కాలానికి రూ.28.79 కోట్లు నష్టాలు రాగా, ఈ ఏడాది మొదటి ఎనిమిది నెలల కాలానికి నష్టం రూ.5.81 కోట్లకు తగ్గింది. రానున్న రోజుల్లో నష్టాలు మరింతగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రీజనల్ మేనేజర్ జి.సుదేశ్‌కుమార్ తెలిపారు.

పెరిగిన ఈపీకే

ఆర్టీసీ విశాఖ రీజియన్ పరిధిలో ఎర్నడ్ పర్ కిలోమీటర్ (ఈపీకే) పెరిగినట్టు అధికారులు లెక్కలు కట్టారు. గత ఏడాది మెదటి ఎనిమిది నెలల కాలానికిగాను సగటున కిలోమీటర్‌కు 24.90 రూపాయల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది సగటున కిలోమీటర్‌కు 28.36 వచ్చింది. అంటే ప్రతి కిలోమీటర్‌కు 3.46 రూపాయలు అదనంగా ఆర్జించింది. దీన్ని 30 రూపాయలకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

పెరిగిన ఓఆర్

ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆక్యుపెన్సీ రేషియో బాగా పెరిగింది. గత ఏడాది మొదటి ఎనిమిది నెలల కాలానికి సగటున ఆక్యుపెన్సీ రేషియో 59 శాతంగా నమోదైంది. ఈ ఏడాది అదే కాలానికి 67 శాతంగా నమోదయ్యింది. దీన్ని 72 శాతానికి పెంచుకోవాలన్నది లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు అధికారులు తెలిపారు.

పెరిగిన ప్రయాణికుల సంఖ్య

ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో 1036 బస్సులు రోజుకు 3,42,000 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ సుమారు ఆరు లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెలాఖరు వరకు సగటున రోజుకు 3.2 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి 5.5 లక్షల మందికి సేవలందించాయి. ఈ ఏడాది ప్రయాణించిన దూరం, ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం వున్నదని రీజియన్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కనీస చార్జీ ఎఫెక్ట్

ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో కనీస చార్జీని ఐదు రూపాయలకు తగ్గించడంతో ఆర్టీసీ రోజువారీ ఆదాయంలో ఒకటిన్నర లక్షల రూపాయలు పెరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. కనీస చార్జీ సవరణకు ముందు రోజుకు 97.5 లక్షల రూపాయల ఆదాయం వచ్చేది. కనీస చార్జీ ఐదు రూపాయలకు సవరించిన తరువాత రూ.99 లక్షలు వస్తున్నట్టు అధికారులు లెక్కలు తేల్చారు.

పెరిగిన పార్శిల్ రవాణా ఆదాయం

ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో గత ఏడాది జూన్ ఒకటవ తేదీన పార్శిల్ రవాణా ప్రారంభించింది. మొదట్లో నెలకు సుమారు రెండు లక్షల రూపాయల ఆదాయం వచ్చేది, ఇప్పుడు అది 24 లక్షల రూపాయలకు పెరిగింది. ఒక కేంద్రంతో ప్రారంభమైన పార్శిల్ రవాణా ఇప్పుడు పది కేంద్రాల ద్వారా సాగుతోంది.

నష్టాలను అధిగమిస్తాం



ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు వస్తున్న నష్టాలను కనీస స్థాయికి తగ్గించగలిగాం. రోజువారీ ఆదాయం కోటి పది లక్షల రూపాయలకు చేరుకోగలిగినప్పుడు మాత్రమే నష్టాలను అధిగమించి లాభాల బాటలోకి వెళ్లగలుగుతాం. అందుకు అవకాశం వున్న అన్ని ఆదాయ వనరులను వినియోగించుకుంటున్నాం. ప్రయాణికులకు మరింత చేరువ అయ్యేందుకు ఏమేం చేయాలో అవన్నీ చేస్తున్నాం. ఈ ఏడాది చివరకు నష్టాలను అధిగమించగలమన్న ఆశ వుంది.

జి.సుధేశ్‌కుమార్, ఆర్ఎం, విశాఖ రీజియన్



మామిడి చెట్టుకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

మామిడి, జీడిమామిడి తోటల్లో... సస్యరక్షణ పనులు

దిగుబడులు పెంచుకోవడానికి ముందస్తు చర్యలు



మామిడి తోట



జీడిమామిడి తోట

చోడవరం, ఆగస్టు 30: మామిడి, జీడిమామిడి తోటల్లో వర్షాకాలంలో కూడా తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీనివల్ల రానున్న సీజన్‌లో దిగుబడులు పెరగడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దిగుబడి తగ్గిపోవడం లేదా కాపునకురాని మామిడి తోటల్లో వర్షాలు ప్రారంభమైన తరువాత ప్రత్యేక సంరక్షణ పనులు చేపడితే, వచ్చే సీజన్‌లో దిగుబడి పెరగడం, కాపునకు రావడం జరుగుతుందని అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త జమున చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో మామిడి, జీడిమామిడి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి ఆమె తెలిపిన సమాచారం....

మామిడి తోటల్లో...

- కాయల కోత తరువాత మామిడి తోటల్లో కొన్ని చెట్లు బలహీనంగా కావడం, కొమ్మలు ఎండిపోయి చెట్లు దాదాపు నిద్రావస్థలోకి చేరుకుంటాయి. ఇటువంటి తోటలకు, చెట్లకు జీవం అందించాల్సిన సమయం ఇదే. ఎండిన కొమ్మలను, తెగులు సోకిన కొమ్మలను జాగ్రత్తగా కత్తిరించుకోవాలి. కొమ్మలు కత్తిరించిన చోట బోరో పేస్టు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్ట్‌ను పూసుకోవాలి. కొద్ది రోజులు విరామం ఇచ్చి, కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి కొమ్మలపై పిచికారీ చేసుకోవాలి.
- తోటల్లో వాలుకి అడ్డంగా చెట్ల మధ్య దున్నుకోవాలి. దీనివల్ల భూమి పై పొరల్లో ఉన్న పురుగుల గుడ్లు సూర్యరశ్మి తగిలి చనిపోతాయి. కురిసిన వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకి, అనంతర కాలంలో చెట్లకు బాగా నీరందడానికి అవకాశం వుంటుంది.
- తోటల్లో చెట్ల మధ్య జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు చల్లుకుని, పూత సమయంలో భూమిలో కలియ దున్నాలి. దీనివల్ల మామిడి, జీడిమామిడి చెట్లకు సేంద్రియ ఎరువుల లభ్యత పెరుగుతుంది.
- చెట్లకు వేయవలసిన ఎరువుల మోతాదును మూడు బాగాలుగా చేసి, మొదటి భాగం ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లో, రెండో భాగం వర్షాకాలం ముగిసిన తరువాత... అంటే నవంబరు, డిసెంబరు నెలల్లో, మూడో భాగం ఫిబ్రవరి, మార్చి నెలల్లో... అంటే పిందె కట్టిన తరువాత వేసుకోవాలి.
- ఎరువుల మోతాదు విషయానికి వస్తే.... ఏడాది వయస్సున్న తోటల్లో చెట్టుకు 10 కిలోల పశువుల గెత్తం, 200 గ్రాముల యూరియా, 600 గ్రాములు ఎస్ఎస్‌పీ, 500 గ్రాముల ఎం ఓపీ వేసుకోవాలి.
- ఐదు సంవత్సరాల తోటల్లో చెట్టుకు 25 కిలోల పశువుల గెత్తం, కిలో యూరియా, మూడు కిలోల ఎస్ఎస్‌పీ, 800 గ్రాముల ఎంఒపీ వేసుకోవాలి.
- పదేళ్ల వయసు దాటిన తోటల్లో ఒక్కో చెట్టుకు 40 కిలోల పశువుల గెత్తం, రెండు కిలోల యూరియా, ఆరు కిలోల ఎస్ఎస్‌పీ, 1600 గ్రాముల ఎంఒపీ వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల తోటల్లో కొత్త చిగళ్లు వస్తాయి.
- కొత్తగా వచ్చే ఆకులను చీడపీడలు ఆశించకుండా, చిగురులు తొడిగే సమయంలో... అంటే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సూక్ష్మపోషక మిశ్రమాలైన ఫార్ములా 4 లేదంటే ఆర్కా మ్యాంగో స్పెషల్ మందులను లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. చెట్లకు జీవం అందడంతోపాటు పూత, పిందె అధికంగా రావడానికి అవకాశం ఉంటుంది.

జీడిమామిడి తోటల్లో....

- మామిడి మాదిరిగానే జీడిమామిడి తోటల్లో కూడా వర్షా కాలంలో సంరక్షణ చర్యలు చేపట్టాలి. ఎండు కొమ్మలను కత్తిరించుకోవడంతోపాటు, భూమికి మీటరు ఎత్తు వరకు ఉన్న కింది కొమ్మలను కత్తిరించి, చెట్టు ఏపుగా వృత్తాకారంలో పెరిగేటట్టు చేసుకోవాలి.
- తోటల్లో తుప్పలు, అనవసర కలుపు లేకుండా ఒకటికి రెండుసార్లు కలియదున్నుకోవాలి.
- ముదురు తోటల్లో ఈ ప్రక్రియ రెండేళ్లకో సారి నిర్వహించాలి. ఇలా చేయడం వల్ల తోటలకు తగినంత సూర్యరశ్మి, వెలుతురు, గాలి సోకి దిగుబడులు పెరుగుతాయి.
- కత్తిరించిన ప్రతి కొమ్మకూ బ్లైటాక్స్ మందును పేస్టులా తయారు చేసి బ్రష్‌తో పూయాలి. దీనివల్ల తెగుళ్ల బెడద తగ్గుతుంది.
- చెట్టు మొదలు నుంచి ఒక మీటరు లేదా 1.15 మీటర్ల వెడల్పులో మొక్క చుట్టూ గాడి చేసి వేపపిండి, పశువుల ఎరువు, కంపోస్టు వేసుకుంటే ఫలితం ఉంటుంది.
- ఆరు సంవత్సరాలు దాటిన తోటల్లో ఒక్కో చెట్టుకు 1100 గ్రాముల యూరియా, 750 గ్రాముల ఎస్ఎస్‌పీ, 225 గ్రాముల ఎంఒపీ వేసుకోవాలి. దీనివల్ల దిగుబడి పెరగడానికి అవకాశం ఉంటుంది.

చెరకు తోటలకు అంతుచిక్కని తెగులు



తెగులు సోకి, ఎండిపోతున్న చెరకు ఆకులు

- **ఆకులు పసుపు పచ్చగా మారి ఎండిపోతున్న వైనం**
- **గణనీయంగా తగ్గిపోతున్న చెరకు దిగుబడులు**
- **నివారణకు మందులేదు... ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు**

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 30: అనకాపల్లి ప్రాంతంలో చెరకు తోటలకు పసుపు ఆకు తెగులు కొరకరాని కొయ్యగా మారింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా తగ్గడంలేదు. దీంతో చెరకు దిగుబడులు బాగా తగ్గిపోతున్నాయి. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఈ తెగులును శాస్త్రవేత్తలు కూడా నిర్ధారించక లేక పోవడం, దీనికి నివారణ మందును చూపలేకపోవడంతో చెరకుసాగు తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావం బెల్లం తయారీ, తద్వారా బెల్లం వ్యాపారం, పంచదార మిల్లులపై పడే అవకాశం వుంది. అచ్యుతాపురం మండలంలో సుమారు 2,900 ఎకరాల్లో చెరకు సాగవుతున్నది. చెరకు ఆకులు అక్కడక్కడా పసుపు రంగులోకి మారుతున్నాయి. తోట ఎదుగుదల ఆగిపోయింది. ఈ తెగులు విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు, శాస్త్రవేత్తలకు తెలియపరిచారు. వారు వచ్చి పరిశీలించి, ఈ తెగులుకు నివారణ లేదని చెప్పడంతో రైతులు ఖిన్నులయ్యారు.



తెగులు సోకడంతో ఎదుగుదల లేని చెరకు తోట

తెగులు నివారణకు ఏం చేయాలో పాలుపోవడంలేదు



నేను ఈ ఏడాది 12 ఎకరాల్లో చెరకు వేశాను. కొద్ది రోజుల నుంచి చెరకు ఆకులు పసుపు పచ్చగా మారిపోయి, ఎండిపోతున్నాయి. చెరకు ఎదగడం లేదు. గత ఏడాది దిగుబడులు తగ్గడంతో ఈ ఏడాది భూసార పరీక్షలు చేయించి పంట వేశాను. అధికారులు చెప్పినట్టు ఎరువులు వేశాను. కానీ పసుపు ఆకు తెగులు నివారణ చర్యల గురించి చెప్పడంలేదు. ఏం చేయాలో పాలుపోవడంలేదు.

- పీలా నాయుడు, చెరకు రైతు, కాశీపాలెం

పంట విరామం ప్రకటించాలి



జిల్లా వ్యాప్తంగా చెరకు రైతులను ఆందోళనకు గురిచేస్తున్న పసుపు ఆకు తెగులు నివారణకు ఇంకా మందులు రాలేదు. ఈ తెగులు సోకిన ప్రాంతంలో రెండేళ్లపాటు చెరకు పంటకు బదులు వేరే పంటలు వేసుకుంటే మంచిది. చెరకులో కూడా కొన్ని రకాలకు ఈ తెగులు సోకడం లేదు. తెగులు సోకని రకాలను గుర్తించి, వచ్చే ఏడాది వేసుకోవాలని సూచిస్తున్నాం.

- రంగాచారి, వ్యవసాయ అధికారి, అచ్యుతాపురం



బంతిపూల సాగుతో... సమృద్ధిగా ఆదాయం



- మొక్కలె నాటుకోవడానికి ఇదే అదును
- పండుగల సమయాల్లో దిగుబడులు
- పెరుగుతున్న పూల వినియోగం
- గిట్టుబాటు అవుతుందంటున్న ఉద్యానవన అధికారులు

అనకాపల్లి అగ్రికల్చర్/చింతపల్లి, ఆగస్టు 30: వివాహాలు, గృహప్రవేశాలు, పండుగల సమయంలో పూజలు, అలంకరణకు ఇటీవల కాలంలో బంతి పూల వినియోగం గణనీయంగా పెరిగింది. దేశవాళీ రకాల స్థానంలో హైబ్రిడ్ రకాలు వచ్చాయి. దిగుబడులు అధికంగా వుండడంతో సాగుదారులకు మెండుగా లాభాలు వస్తున్నాయి. దీంతో ఇటీవల కాలంలో జిల్లా బంతి పూల సాగు జిల్లాలో పెరుగుతున్నది. అక్టోబర్ నుంచి జనవరిలో సంక్రాంతి పండుగ వరకు, తరువాత పెళ్లిళ్ల, గృహప్రవేశాల ముహూర్తాల సమయాల్లో బంతిపూలకు మంచి గిరాకీ వుంటుంది. ఈ సమయాల్లో పూల దిగుబడి వచ్చేలా సాగు చేసుకుంటే గిట్టుబాటు ధర లభిస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

- జిల్లాలో గత ఏడాది సుమారు 500 ఎకరాల్లో బంతి పూల తోటలను సాగు చేశారు. ఈ ఏడాది మరో వంద ఎకరాల వరకు పెరిగే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు. భీమిలి, ఆనందపురం, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో బంతి పూల సాగుకి నారుమడులు పోశారు. మరికొంతమంది రైతులు కడియం నర్సరీల నుంచి మొక్కలను రప్పించి, నాటడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నారు ఎదగడానికి నెల రోజులు పడుతుంది. నారును నాటిన తరువాత 45 రోజుల్లో పూతకు వస్తాయి. సుమారు 110 రోజుల వరకు పూలు పూస్తాయి. ప్రస్తుతం నారు మడులు పోసుకుంటే సెప్టెంబర్ చివరి వారంలో నారు అందుబాటులోకి వస్తుంది. నవంబర్ మూడో వారం నుంచి పూతకు వస్తాయి. ప్రస్తుతం ఎదిగిన నారును నాటుకుంటే, దసరా పండుగ సమయానికి పూలు పూయడం మొదలవుతుంది. నవంబర్ నుంచి జనవరి చివరి వరకు పూల దిగుబడి వస్తుంది. రకాలనుబట్టి ఎకరాకు 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఖర్చులు పోను 50 నుంచి 60 వేల రూపాయల వరకు మిగులుతాయి. అయితే మార్కెట్‌లో డిమాండ్, సీజన్, మార్కెట్‌కు వచ్చే పూల సరఫరాపై ధరలు ఆధారపడి వుంటాయి. బంతి విత్తనాలపై ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తున్నది. మామిడి, ఆయిల్‌పామ్ తోటల్లో మొక్కలు వేసిన మూడు నాలుగేళ్ల వరకు అంతర పంటగా బంతి మొక్కలు వేసుకోవచ్చు. పాలీ హౌస్‌లలో కూడా బంతిపూలను సాగు చేస్తున్నారు. దీనివల్ల అధిక దిగుబడులు వస్తున్నప్పటికీ, ఖర్చు ఎక్కువగా వుండడంతో చిన్న, సన్నకారు రైతులు ఆసక్తి చూపడంలేదు.





- ఏజెన్సీలో పాడేరు, చింతపల్లి, అరకులోయ, డుంబ్రిగుడ; మైదాన ప్రాంతంలో ఆనందపురం, తగరపువలస, కశింకోట, సబ్బవరం, తదితర మండలాల్లో హైబ్రిడ్ బంతి పూలను సాగు చేస్తున్నారు.
- నారు పోసుకోవాలంటే ఎకరాకు 80 నుంచి 100 గ్రాముల విత్తనం సరిపోతుంది. నర్సరీ నుంచి నారు తెచ్చుకుని నాటుకుంటే ఎకరాకు 12 వేల మొక్కలు అవసరం అవుతాయి.
- సారవంతమైన గరప నేలలు అనుకూలం. నీరు త్వరగా ఇంకిపోయే భూములను ఎంపిక చేసుకోవాలి. మొక్కలపై చెట్ల నీడ పడకూడదు. నీడలో మొక్కలు ఏపుగా పెరుగుతాయే తప్ప పువ్వులు అంతగా పూయవు.
- కోల్‌కతా, బెంగళూరు నుంచి దిగుమతి అయ్యే బంతి నారు జిల్లాలో లభ్యమవుతున్నది. తూర్పుగోదావరి జిల్లా కడియంతోపాటు జిల్లాలోని ఆనందపురం, తగరపువలసల్లో నారుమొక్కలు విక్రయిస్తున్నారు.

ఎరువులు: ఆఖరి దుక్కిలో ఎకరాకు 20 టన్నుల చొప్పున బాగా చివికిన పశువుల గెత్తం వేసి కలియదున్నాలి. దీంతోపాటు 30 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. మొక్కలు నాటిన 40 రోజులకు మరోసారి 30 కిలోల నత్రజనిని పైపాటుగా వేసి నీరు పెట్టాలి.

రకాలు...

- ఆఫ్రికన్ టాల్. ఇది నిమ్మ, పసుపు, బంగారం, నారింజ తదితర రంగుల్లో పూలు పూస్తాయి. పూస, ఎండీయూ-1 రకాలు కూడా వాడుకోవచ్చు.
- ఫ్రెంచ్ డ్వార్ఫ్. ఇది పొట్టిగా, గుబురుగా పెరిగి ముద్దబంతి, బంతి రెక్కపూలను పూస్తాయి. ఆకర్షణీయమైన రంగుల్లో వివిధ వర్ణాలు మిళితమై పూస్తాయి.
- నారు పోసుకోదలుచుకుంటే చదరపు మీటరుకు 10 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి. చీమలు, చెదల నుంచి నారును కాపాడుకోవడానికి ఫాలిడాల్ అనే పొడి మందును చల్లుకోవాలి. వారం రోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి.
- నెల వయసు, మూడు లేదా నాలుగు ఆకులు వచ్చిన మొక్కలను నాటుకోవాలి. సాయంత్రం వేళ నాటుకుంటే మంచిది. పొడువుగా పెరిగే ఆఫ్రికన్ రకాల మొక్కలను 40X30 సెంటీమీటర్ల దూరంలో, ఫ్రెంచి పొట్టి రకాలను 20X20 సెంటీమీటర్ల దూరంలో నాటాలి.



నీటి యాజమాన్యం: మొక్కలు నాటిన 60 రోజుల వరకు, కొమ్మలు పెరిగే సమయంలో, పూత దశలో నేలలో తగినంత తేమ ఉండేలా చూడాలి. నీటి ఎద్దడికి గురైతే మొక్క పెరుగుదల తగ్గిపోయి, పూల దిగుబడి పడిపోతుంది.

సస్యరక్షణ చర్యలు: నారు మడిలో తేమ ఎక్కువగా ఉంటే నారుకుళ్లు తెగులు రావచ్చు. ఈ తెగులు సోకితే మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల కాప్టాన్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి నేల తడిచేలా పిచికారీ చేసుకోవాలి. పేను పురుగులు మొగ్గలను ఆశించి నష్టపరుస్తాయి. నివారణకు మలాథియాన్ లేదా డైమిథోయేట్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్లు కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

- తామర పురుగులు పూల నుంచి రసాన్ని పీల్చి వేస్తాయి. ఆకుల మీద తెల్లని మచ్చలు కనిపిస్తాయి. ఇవి ఆశిస్తే మొగ్గలు గోధుమ రంగులోకి మారి, ఎండిపోతాయి. వీటి నివారణకు డైమిథోయేట్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. మొగ్గ తొలిచే పురుగుల నివారణకు కార్బరిల్ మందును లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- వాతావరణంలో అధిక తేమ, ఎక్కువ వేడి ఉన్నప్పుడు ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందుతుంది. మచ్చలు బూడిద లేదా నల్లగా ఉంటాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.

ఎన్టీఆర్ జలసిరికి నాబార్డ్ నిధులు

జిల్లాకు రూ.10 కోట్లు కేటాయింపు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలసిరి పథకానికి మంచిరోజులు వచ్చాయి. ఈ పథకం కింద రైతులకు రాయితీ రుణ ప్రాతిపదికన సాగునీటి బోర్లు తవ్వకాలకు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు నాబార్డు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి విభాగం జిల్లాకు నిధులు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో ఎన్టీఆర్ జలసిరి పథకం కింద గత ఏడాది సుమారు 1500 బోర్లు తవ్వకాలు చేపట్టి, సౌర విద్యుత్ సరఫరా చేయాలని భావించారు. అయితే ఉపాధి హామీ పథకం నిధులతో వ్యవసాయ బోర్ల తవ్వకాలకు నిబంధనలకు ఒప్పుకోవంటూ కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తూ, నిధులు విడుదల చేయలేదు. దీంతో జిల్లాలో జలసిరి పథకం అమలుకు బ్రేక్ పడింది.

గతంలో తవ్విన 120 బోర్లు వృథాగా పడివున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నాబార్డు నిధులతో జలసిరి పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో కొత్తగా ప్రతిపాదించిన సుమారు 2,500 వ్యవసాయ బోర్లకు నాబార్డు నుంచి రూ.10 కోట్లు మంజూరు అయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అధికారులు చెబుతున్నారు.

వరికి ఎరువుల వినియోగంలో మెలకువలు



రాంబిల్లి: కొద్ది రోజుల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో అన్ని ప్రాంతాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. వరి అధిక దిగుబడులకు ఎరువుల వినియోగం ఎంతో కీలకం. అయితే ఏ ఎరువును, ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో అవగాహన వుండక, రైతులు తమకు తోచిన ఎరువులను, ఎప్పుడు పడితే అప్పుడు వేస్తున్నారు. దీనివల్ల ఎరువు వృథా కావడం లేదంటే లోటు ఏర్పడడం జరుగుతుంది. వరి పైరుకు ఎరువుల వినియోగంపై హరిపురం బీసీటీ కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు తెలిపిన వివరాలు....

- ఎకరాకు 75 నుంచి 80 కిలోల యూరియా, 20 కిలోల భాస్వరం, 32 కిలోల పొటాష్‌లను వేసుకోవాలి. వీటిలో భాస్వరాన్ని పూర్తిగా చివరి దమ్ములో వేసుకోవాలి.
- యూరియాను మూడు సమభాగాలుగా చేసి, 25 కిలోల యూరియాతోపాటు 20 కిలోల పొటాష్‌ను చివరి దమ్ములో వేసుకోవాలి. ఒకవేళ చివరి దమ్ములో పొటాష్ వేయనివారు, నాట్లు పూర్తయిన తరువాత వారం రోజుల్లో వేసుకోవాలి.
- 130-135 రోజుల పంట అయితే నాట్లు వేసిన 30 రోజులకు, 50 రోజులకు, 75 రోజులకు మూడు దఫాలుగా యూరియాను సమపాళ్లలో వేసుకోవాలి. ఆఖరి దశలో యూరియాతోపాటు 15 నుంచి 20 కిలోల పొటాష్‌ను వేసుకోవడం ద్వారా గింజ నిండుగా ఉండి, గింజ రాలడం తగ్గుతుంది.
- యూరియాకు పదో వంతు వేపపిండి కలిపి చల్లుకోవడం వల్ల నత్రజని ఎక్కువకాలం పంటకు అందుతుంది.
- యూరియా చల్లేటప్పుడు పొలంలో బురద లేదా పలుచగా నీరు వుండేలా చూసుకోవాలి.
- పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటికి పది గ్రాముల చొప్పున కలుపి పైరుపై పిచికారీ చేస్తే పంట నీటిఎద్దడిని, తెగుళ్లను తట్టుకుంటుంది.
- వరి సాగులో ఎరువుల వినియోగంపై సందేహాలు వుంటే 94407 10538 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కేవీకే శాస్త్రవేత్త శ్రీహరి రావు సూచించారు.

గెడ్డలో జారి పడి యువకుడి మృతి

జి.మాడుగుల : మేకలను మేతకు తీసుకువెళ్లి తిరిగి వస్తూ గెడ్డలో జారి పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మారుమూల నుర్మతీ పంచాయతీచిన్నజాగిరి గ్రామానికి చెందిన మనుగూరు నారాయణరావు (30) సోమవారం ఉదయం మేకలను సమీపంలోఉన్న కొండకు మేతకు తీసుకువెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో ఇసుకగుమ్మి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ విషయాన్ని గమనించని ఆయన గెడ్డ దాటుతూ జారి పడిపోవడంతో గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం సంగులోయ గ్రామ సమీపంలో మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీను కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి ..

కశింకోటరూరల్ : మండలంలోని జమ్మాదులపాలెం సాగునీటి కాలువలో స్థానికులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు.మృతుని వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయి. చామనచాయ రంగు, కుడిచేయి మణికట్టుపై సింహాద్రి అన్న తెలుగు అక్షరాలు, కుడివైపు చాతి మీద దుర్గ అని పచ్చబొట్టు ఉంది. కుడిచేతికి పూసలతాడు ఉన్నాయి. వివరాలకు 9440796288, 08924220799 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

చీరకు నిప్పంటుకుని వివాహిత ...

రావికమతం : మండలంలోని మట్టవానిపాలెంలో ఓ వివాహిత చీరకు నిప్పంటుకోవడంతో మృతి చెందింది. ఎస్ఐ బి. రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు..దొండపూడి గ్రామానికి చెందిన జామి హేమలత (23) సోమవారం మట్టవానిపాలెం గ్రామంలో ఉంటున్న తన అమ్మమ్మ కిరణంపల్లి మహలక్ష్మమ్మఇంటికి చుట్టరికానికి వచ్చింది. బుధవారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు ఆమెను అనకాపల్లిలోని ఎన్‌టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్ : స్థానిక రైల్వేస్టేషన్‌లో బుధవారం గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్ తెలిపిన వివరాల మేరకు...స్టేషన్‌కు సమీపంలో రైతులు రాకపోకలు సాగించే వంతెన కింద మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని యువకుడు సూపర్‌ఫాస్టు రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన వయసు 25 నుంచి 30 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చురీలో ఉంచామని పూర్తి వివరాలకు సెల్ నంబరు 7013460040ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అవకతవకల బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

'అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయీస్' సొసైటీ సభ్యుల డిమాండ్

అనకాపల్లి : అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయీస్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ డీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. సొసైటీ సభ్యులు కానివారి నుంచి డిపాజిట్లు స్వీకరించడమే కాకుండా రుణాలపై రెండు శాతం కమిషన్ తీసుకొని రశీదులు ఇవ్వడం లేదని సమావేశంలో సభ్యులు ఆరోపించారు. రుణాలు మంజూరు చేసేటప్పుడు నిర్దేశిత శాతంలో షేరు ధనం తీసుకునే నిబంధనను పాలకవర్గం పాటిస్తుందా లేదా అనే అంశంపై విచారణ కమిటీ పరిశీలించాలని పేర్కొన్నారు. సభ్యుల నుంచి రికవరీ చేస్తున్న పొదుపు నిధి షేరుధనం, దానిపై వచ్చే వడ్డీ తదితర వివరాలను పాలకవర్గం 15 సంవత్సరాల నుంచి సభ్యులకు తెలియపర్చడం లేదని మహ్మద్, విశ్వేశ్వరరావు, రాంబాబు, గోవింద, నాయుడు తదితరులు ఆరోపించారు. దీనిపై కూడా విచారణ జరపాలన్నారు. కంటింజెంట్ ఖర్చుల రూపంలో ఏటా లక్షలాది రూపాయల ఖర్చు చూపుతూ సభ్యుల సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారన్నారు.

జిల్లాలో గంజాయి రవాణా పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఆ శాఖ ఉన్నతాధికారులు గంజాయి రవాణాకి అడ్డుకట్ట వేయడానికి శత విధాలా ప్రయత్నిస్తున్నా.. ఫలితం ఉండడం లేదు. కారు, ఆటో, బైక్, చివరికి లారీ ట్యాంకర్లు... ఇలా చెప్పుకుంటూ పోతే గంజాయి తరలింపునకు కాదేదీ అనర్హం అన్నట్టుగా అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. వాహనం ఏదైనా స్మగ్లింగే తమ లక్ష్యం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. బుధవారం కూడా జిల్లాలో వేర్వేరు చోట్ల 300 కిలోల గంజాయి పట్టుబడింది. ఇందులో పోలీసులు పది మందిని అరెస్టు చేయగా... ముగ్గురు పరారయ్యారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో మాడుగుల పోలీసులు

300 కిలోల గంజాయి పట్టివేత

మాడుగులలో 140 కిలోలు పట్టివేత

మాడుగుల రూరల్ : ఏజెన్సీ నుంచి మైదానానికి తరలిస్తున్న 140 కిలోల గంజాయిని మాడుగుల పోలీసులు పట్టుకున్నారు. ఇందులో ఇద్దరిని అరెస్టు చేయగా మరొకరు పరారయ్యారు. ఎస్ఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు..ఏజెన్సీ నుంచి గంజాయి తరలిస్తున్నట్టు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు బుధవారం ఉదయం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ మేరకు పాడేరు వైపు నుంచి ఘాట్ రోడ్డు జంక్షన్ వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా 140 కిలోల గంజాయి పట్టుబ డింది. పోలీసుల కళ్లు కప్పి కారు డ్రైవరు పరారీ కావడంతో కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో జి.మాడుగుల మండలం బొయితిలి గ్రామానికి చెందిన జల్లి ప్రసాద్, అదే మండలం సుబ్బులు గ్రామా నికి చెందిన కంచంగి విశ్వనాథ్, తమిళనాడు రాష్ట్రం మనంతి పుట్టి గ్రామానికి చెందిన చెల్లం చిన్నస్వామి ఉన్నారు. కారు డ్రైవర్ ప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ 2.8 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ దాడిలో ఏఎస్ఐలు ఎస్. నాగరాజు, కె. దేముడునాయుడు, సిబ్బంది భాను ప్రకాష్. శ్రీను, బంగారి పాల్గొన్నారు.

కేడీపేట పార్కు వద్ద 60 కిలోలు స్వాధీనం

కృష్ణాదేవిపేట : ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి ఆటోలో తరలిస్తున్న 60 కిలోల గంజాయిని కేడీపేట పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ డి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... బుధవారం చింతపల్లి మండలంలోని మారుమూల గ్రామాల నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈమేరకు వారు గొలుగొండ మండలం కేడీపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ మేరకు ఆటోను తనిఖీ చేయగా అందులో 60 కిలోల గంజాయి పట్టు బడింది. దీంతో పోలీసులు ఆటోలో ఉన్న గూడెంకొత్తవీధి మండలం ఆర్‌వీనగర్ గ్రామానికి చెందిన చిచోన్ అరుణ్ పాండేన్ (17), మటం ప్రమీలా (23), కురజ మరియమ్మ (22), పాంగి ధనలక్ష్మి(45)ని అరెస్టు చేశారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా తుని పట్టణానికి చెందిన రమణ పరారయ్యారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.5లక్షలు ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణాదేవిపేట ఏఎస్ఐ పి.అప్పారావు, మత్యరాజు, రంగారావు, శంకర్, అక్కునాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయితో కేడీపేట పోలీసులు

నర్సీపట్నంలో వంద కిలోలు

నర్సీపట్నం : ఏజెన్సీ నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్న వంద కిలోల గంజాయిని నర్సీపట్నం రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నలుగురు నిందితుల్లో ఒకరు హిజ్రా ఉన్నారు. రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ తెలిపిన వివరాల మేరకు.. పట్టణ శివారులోని నెల్లిమెట్ట వద్ద బుధవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా చింతపల్లి వైపు నుంచి ఆటోలో వస్తున్న వంద కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు తమిళనాడుకు చెందిన బాలయ్య రాజ్‌గోపాల్ (43), మణికుమార్ రత్నస్వామి (32)లతో పాటు వరంగల్ జిల్లా నర్సంపేట గ్రామానికి చెందిన కల్వచర్ల ప్రవీణ్‌చారి, అదే గ్రామానికి చెందిన హిజ్రా కంచర్ల సిరి (30)ను అరెస్టు చేశారు.

- కారు, ఆటో, బైక్....
  గంజాయి రవాణాకు కాదేదీ అనర్హం
- అడ్డూ అదుపు లేకుండా తరలింపు
- పోలీసులకు సవాల్‌గా తరలింపు

పరారైన ఇద్దరు వ్యక్తులు అరెస్టు

నాతవరం : గంజాయి రవాణా చేస్తూ తప్పించుకున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం మాటు వేసి పట్టుకున్నామని నాతవరం ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం డి.యర్రవరంలో 80 కిలోల గంజాయిని వ్యాన్‌లో తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయగా ఇద్దరు తప్పించుకున్నారు. ఈ మేరకు బుధవారం తూ.గో.జిల్లా అన్నవరం ప్రాంతానికి చెందిన వానపర్తి భరత్‌కుమార్, గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన మేడిశెట్టి గణేష్‌ను అరెస్టు చేవారు.

శారదా కాలనీలో పట్టపగలు చోరీ

నాలుగు తులాలు బంగారం, 12 తులాల వెండి గిన్నె అపహరణ

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని శారదా కాలనీ మూడో వీధిలో బుధవారం చోరీ జరిగింది. ఈ సంఘటనలో నాలుగు తులాల బంగారం, 12 తులాల వెండి గిన్నె, పది వేల రూపాయల నగదు అపహరణకు గురైంది. పట్టణ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు..శారదాకాలనీ మూడో వీధిలో ఉంటున్న చల్లా నానాజీ పెయింటింగ్ పని చేస్తుంటారు. ఆయన భార్య కొద్ది రోజుల క్రితమే ఊరు వెళ్లారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఆయన, తన తల్లి అరుణ ఉంటున్నారు. బుధవారం ఉదయం ఆయన ఇంట్లో ఉండగా అరుణ ఆస్పత్రికి వెళ్లింది. ఆమె ఎంతకీ రాకపోవడంతో ఆయన తన తోటి పనివారు గణేష్, మరో ఇద్దరితో కలిసి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద గల రంగుల దుకాణానికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి, తలుపు ద్వారబందానికి తగిలించారు. ఈ విషయాన్ని గమనించిన అగంతకులు తాళం తీసి బీరువాలోని నాలుగు తులాల బంగారం వస్తువులు, వెండి గిన్నె, పది వేల రూపాయల నగదు అపహరించుకుపోయారు. తడి బట్టలతో ఇంట్లోకి ప్రవేశించిన వారు బీరువాలోని నానాజీ బట్టలు ధరించి వారి బట్టలను అక్కడే విడిచిపెట్టారు.చోరీ జరిగిన కొద్ది సేపటికి నానాజీ స్నేహితుడు నగేష్ ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడంతో నానాజీకి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే ఆయన ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండడం, బీరువాలు తెరిచి ఉండ డంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.సీఐ సంపతిరావు విద్యాసాగర్ ఆదేశాల మేరకు డాగ్‌స్క్వాడ్, క్లూస్ బృందానికి సమాచారం అందించారు. క్లూస్ బృందం అగంతకుల వేలిముద్రలు సేకరించారు. డాగ్ ఇంటి నుంచి తుప్పల మధ్య నుంచి శారదా నది వద్ద వరకు వెళ్లి నిలిచిపోయాయి. దీన్ని బట్టి అగంతకులు ఇద్దరు నదిలో స్నానం చేసి దొంగతనానికి పాల్పడి, మళ్లీ నదిలో నుంచే పరారై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పట్ట పగలు పదిన్నర గంటల సమయంలో చోరీ జరగడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.



చిందరవందరగా ఉన్న బీరువా (ఇన్‌సెట్లో) వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ట్రాక్టరు, బైక్ ఢీ

యువకునికి తీవ్ర గాయాలు

మాడుగుల రూరల్ : మండలంలోని ఘాట్ రోడ్డు సమీపంలోని కాగిత చెరువు వద్ద ట్రాక్టర్, బైక్ ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.మాడుగుల వైపు నుంచి ఘాట్ రోడ్డు వైపు ట్రాక్టరు డ్రైవరు పొలంలో దమ్ము పనులు చేసి వస్తుండగా... కేజేపురం గ్రామానికి చెందిన బుద్దా శేషు ఘాట్ రోడ్డు వైపు నుంచి మాడుగుల వస్తున్నారు. ఈ మేరకు ఘాట్‌రోడ్డు సమీపంలోని కాగిత చెరువువద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ద్విచక్ర వాహనచోదకుడు శేషుకి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో మాడుగులనుంచి ఘాట్‌రోడ్డు వైపు జీపులో వెళ్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు వెంటనే బాధితుడ్ని జీపులో మాడుగుల 30 పడకల ఆసుపత్రికి తరలించారు.

బావమరిదిపై బావ దాడి

రావికమతం : రావికమతం గ్రామానికి చెందిన గెంజి వెంకటరమణ,మచ్చ శ్రీనివాస్ బావ బావమరుదులు. వారి మధ్య కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నాయి.ఈ మేరకు బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటిలో ఉన్న శ్రీనివాస్‌పై వెంకటరమణ గునపంతో దాడి చేయడంతో తలపై తీవ్ర గాయమైంది.

పెదబొడ్డేపల్లిలో నైట్ షెల్టర్

అనాథలు, నిరాదరణకు గురైన వారికి ఉపయుక్తం

మెప్మా డైరెక్టర్ ప్రాజెక్ట్ డైరెక్టర్

నర్సీపట్నం టౌన్ : అనాథలు, నిరాదరణకు గురైన వారి కోసం ప్రత్యేక రాత్రి బస (నైట్‌షెల్టర్)ను ఏర్పాటు చేస్తున్నామని మెప్మా పీడీ పిల్లి ప్రేమప్రసన్నవాణి తెలిపారు. దీనికి సంబంధించి పెదబొడ్డేపల్లిలోని కమ్యూనిటీ హాల్‌ను బుధవారం గుర్తించారు. భవనం మరమ్మతుల నిమిత్తం రూ. ఏడు లక్షలు, నిర్వహణ నిమిత్తం రూ.ఆరు లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో 40శాతం నిధులు తక్షణమే విడుదల చేశామని, గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థకు కేంద్ర నిర్వహణ బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు.

50 వేలు జనాభా దాటిన మున్సిపాలిటీలలో ఇటువంటి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా నర్సీపట్నం మున్సిపాలిటీ ఎంపికైందన్నారు. ప్రస్తుతం ఇళ్లు లేక రాత్రి వేళల్లో రోడ్లు మీద, బస్టాండ్‌లలోనూ, పార్కుల వద్ద, బహిరంగ ప్రదేశాలలోనూ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తల దాచుకుంటున్న వారిని గుర్తిస్తున్నామన్నారు. మెప్మా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమయ్యారన్నారు. వీరందరికి కనీస అవసరాలు తీర్చేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా డార్మెటరీలు ఉంటాయని తెలిపారు. ఇదే విషయమై మున్సిపల్ వైస్‌చైర్మన్ సన్యాసిపాత్రుడు, కమీషనర్ సురేంద్రలను కలసి చర్చించామన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి తిరుపతయ్య, స్పెషలిస్ట్ రాజా రామ్మోహన్‌రాయ్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ రమ్యకృష్ణ, కార్యాలయ సిబ్బంది రవి, మురళి పాల్గొన్నారు.



మున్సిపల్ వైస్‌చైర్మన్‌తో మాట్లాడుతున్న మెప్మా పీడీ వాణి

కాసులు కురిసిస్తున్న కాశీపట్నం సీతాఫలాలు

● స్థానికులకు రుచి చూసేందుకు కూడా దొరకని పరిస్థితి



కాశీపట్నం సంతకు తీసుకువస్తున్న సీతాఫలాలు

అనంతగిరి: సీతాఫలం రైతుల కళ్ళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మండలంలో సీతాఫలాలు సాగు చేపట్టిన రైతులకు కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతోంది. ప్రధానంగా బుధవారం నిర్వహించే కాశీపట్నం వారపు సంతలో లభ్యమయ్యే సీతాఫలాలకు ఇతర రాష్ట్రాలలో గిరాకి ఉండడంతో.. మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. కాశీపట్నం పంచాయతీ కేంద్రానికి సమీపంలో గల ఎన్ఆర్‌పురం, సీతారాంపురం, ఎగువబూడి, ఎగువ కోటపర్తి, దిగువ కోటపర్తి, పెద కోనెల, చినకోనెల, తదితర గ్రామాలలో సేంద్రియ పద్ధతిలో క్రిమి సంహారకాలు వాడకుండా సీతాఫలాల తోటలను పెంచుతారు. అందువల్ల ఇక్కడ ఫలాలు మంచి రుచితో పాటు రంగు ఆకర్షణగా ఉంటుంది.

పెరిగిన ఎగుమతులు:

గతంలో ఈ ప్రాంతం లో లభించే సీతాఫలాలు ఎగుమతి తక్కువ స్థాయిలో ఉండేది దాంతో రేట్లు స్థానికులకు అందుబాటులో ఉండేవి. అలాగే కొనుగోలు చేసే వ్యాపారులు కూడా అందరూ సిండికేట్ అయిపోవడంతో రేట్లు రైతులకు గిట్టుబాటు అయ్యేది కాదు. అయితే ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు దారులు అధికంగా రావడంతో రేట్లు పెరిగి రైతులకు మంచి ధర వస్తోంది. అయితే ధర అధికంగా ఉండడంతో స్థానికులు ఇక్కడ లభించే సీతాఫలం కొనుగోలు చేయలేకపోతున్నారు.

కావిడ రూ.2500

సాధారణంగా సీతాఫలం . ఒక కావిడ (సుమారు 100 పళ్లు) ధర గతంలో రూ.300 లేదా 450 ఉండేది. ప్రస్తుతం అదే కావిడ ధర రూ.2500కు అమ్ముడవుతోంది. ఈ ఏడాది ప్రారంభం నుండి ఇదే ధర నిలకడగా ఉండడంతో సహజంగానే సీతాఫలం రైతులకు కాసులవర్షం కురుస్తోంది.

ఎగుమతుల వల్లే అధిక ధరలు



గతంలో ఇక్కడ సీతాఫలాలు కేవలం కోల్‌కతా కు మాత్రమే ఎగుమతి అయ్యేవి. అది కూడా ఒక వ్యాపారి ఇక్కడకు వచ్చి కొనుగోళ్లు చేసేవారు. క్రమంగా విజయవాడ, గుంటూరు, కటక్, బెంగుళూరు వంటి ప్రాంతాలకు కూడా ఎగుమతి అవడం తో డిమాండ్ పెరిగింది.

- పొట్నూరు రాంబాబు, వ్యాపారి కాశీపట్నం



ఎగుమతికి సిద్ధం చేస్తున్న సీతాఫలాలు

మంచి గిట్టుబాటు ధర



కాశీపట్నం సంతకు తీసుకురావాలంటే సుమారు 15కి.మీ నడిచి రావాలి. గతంలో ఇంత కష్టపడి తీసుకువచ్చినా మంచి ధర లభించేదికాదు కానీ ఈ ఏడాది మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది.

- జన్ని కొత్తమ్మ, దిగువకోటపర్తి

సంతోషంగా ఉంది



ఈ ఏడాది శ్రమకు తగ్గఫలితం దక్కింది.నేను గతవారం 2500లకు కావిడ అమ్మాను ఈ వారం కూడా అదే రేటు గిట్టుబాటు అయ్యింది.నాకు చాలా సంతోషంగా ఉంది.ఇంతకు ముందు ఎప్పుడూ ఈ ధరకు నేను అమ్మలేదు.

- కోటపర్తి శ్రీను, పెదకోనెల

డిమాండ్ పెరిగింది



కాశీపట్నం సీతాఫలం అనగానే మార్కెట్ లో డిమాండ్ ఉంది. ఎక్కువ ధర పెట్టినా బయట మార్కెట్‌లో అమ్మగలమనే నమ్మకంతో కొనుగోలు చేస్తున్నాం.

మర్రి రామారావు, వ్యాపారి, విజయవాడ

జర్నలిస్టు హెల్త్ కార్డులకు సంప్రదించాలి

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ కింద రూ.1250 చెల్లించి ఇంతవరకు కార్డులు పొందనివారు వెంటనే సంప్రదించాలని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్ తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ కార్డుల స్కీమ్ కింద జిల్లాలో మొత్తం 551 మంది అక్రిడిటేషన్ జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టుల బీమా కార్డులను కార్యాలయంలో అందజేస్తున్నామని మణిరామ్ తెలిపారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఆయా కార్డులను విశాఖలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగావున్న జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో పొందాలని ఆయన సూచించారు.

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పక వేయించాలి: కలెక్టర్

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): తట్టు రుబెల్లా వ్యాక్సిన్‌ను 9 నెలలు నుంచి 15 ఏళ్ల పిల్లకు విధిగా వేయించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి మండల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 96 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వ్యాక్సినేషన్‌పై సమీక్షించారు. మండలాల వారీగా లక్ష్యాలకు అనుగుణంగా పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవి హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో రామవరం

హైస్కూల్ హెచ్‌ఎం మృతి



ప్రమాదం సంభవించిన స్థలం (ఇన్‌సెట్లో) విజయ్‌కుమార్ (ఫైల్)

విశాఖపట్నం : పెందుర్తి- ఆనందపురం ప్రధాన రహదారి పీఎస్ఎల్ కంపెనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆనందపురం మండలంలోని రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాపాధ్యాయుడు బోడపాటి డేవిడ్ విజయ్‌కుమార్ మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పెందుర్తి సమీపంలో వేపగుంటలోని సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్న బీడీ విజయ్‌కుమార్ నాలుగేళ్లుగా రామవరం హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అతను విధులకు హాజరయ్యేందుకు బుధవారం ఉదయం ఇంటి వద్ద నుంచి బైక్‌పై వస్తుండగా పీఎస్ఎల్ సమీపంలో ఎదురుగా వచ్చి టాటా ఏసీ వ్యాను ఢీకొంది. అనంతరం బైక్‌తో పాటు విజయ్‌కుమార్ రహదారి పక్కన ఆగిఉన్న లారీ కిందకు దూసుకుపోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య వాణి కూడా ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.ఈ విషయం తెలుసుకున్న రామవరం ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. స్థానిక సర్పంచ్ కె.సీతారామరాజు, పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు హెచ్‌ఎం మృతికి సంతాపం తెలిపారు. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఐటీ హబ్ 'క్వాంటమ్'

హెచ్‌ఎస్‌బీసీ ఎదురుగా భవనాన్ని అద్దెకు తీసుకున్న ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

నగరంలో మరో ఐటీ హబ్ రాబోతోంది. దీనిని 'క్వాంటమ్ హబ్'గా వ్యవహరిస్తారు. సిరిపురంలోని హెచ్‌ఎస్‌బీసీ ఎదురుగా వున్న మార్గంలో వున్న ఐదు అంతస్థుల భవనాన్ని 'డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్క్' పథకంలో రాష్ట్ర ప్రభుత్వం అద్దెకు తీసుకుంది. ఒక్కో అంతస్థులో 75 మందికి 'ప్లగ్ అండ్ ప్లే' సౌకర్యంతో ఐటీ స్పేస్ కేటాయిస్తారు. అమరావతిలో చీఫ్ సెక్రటరీ దినేశ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కన్సల్టింగ్ కమిటీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీసీఐటీఐ) సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకున్నారు. క్వాంటమ్ హబ్‌లో 12 ఐటీ కంపెనీలకు స్థలం కేటాయిస్తున్నట్టు ప్రాథమికంగా ప్రకటించారు. ఎన్ఆర్ఐ కంపెనీలతో పాటు హైదరాబాద్ నుంచి విశాఖపట్నం మారాలని అనుకుంటున్న ఐటీ కంపెనీలకు ఇందులో అవకాశం కల్పించారు. విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న పెనా 4 టెక్ సొల్యూషన్స్ కంపెనీకి కూడా ఇందులో స్పేస్ కేటాయించారు. విశాఖపట్నంలో ప్లగ్ అండ్ ప్లేతో ఐటీ స్పేస్ అనగానే హాట్‌కేక్‌లా అయిపోతోందని ఐటీ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. విశాఖలో స్థలం కోరుతూ 40 కంపెనీలు దరఖాస్తు చేయగా, వాటి కోసం కొత్త భవనాలు, స్థలాలు అన్వేషిస్తున్నామని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఇటీవల టెక్ హబ్‌ను ప్రారంభించిన సమయంల్లో వెల్లడించారు.

భారీ వర్షాలకు రైళ్లు రద్దు

విశాఖపట్నం: ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో భారీ వర్షాల వల్ల ఈశాన్య సరిహద్దు రైల్వే పరిధిలోని రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో పలు రైళ్లను రద్దు చేసి ఆ స్థానంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టారు. ఇక పంజాబ్, హరియాణా ప్రాంతాల్లో లా అండ్ ఆర్డర్ పరిస్థితి అదుపులో లేకపోవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా అమృతసర్-విశాఖ హిరాకుడ్ (18508), అలాగే కటక్‌లో ఆధునీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పరదీప్-విశాఖ (22809) ఎక్స్‌ప్రెస్ రైళ్లను బుధవారం రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ డీసీఎం కో ఆర్డినేషన్ తెలిపారు.

రద్దయిన రైళ్లు: బెంగళూరు క్యాంట్-గౌహతి (12509), చెన్నై-న్యూజలపాయ్‌గురి (22611) ఎక్స్‌ప్రెస్ రైళ్లను బుధవారం (30న) రద్దు చేయగా...కన్యాకుమారి-డిబ్రుగర్ (15905) ఎక్స్‌ప్రెస్‌ను 31న (గురువారం), త్రివేండ్రం-గౌహతి ఎక్స్‌ప్రెస్‌ను (12515) సెప్టెంబరు మూడో తేదీన రద్దు చేశారు.

ప్రత్యేక రైళ్లు ఈనెల 31న హౌరా-యశ్వంత్‌పూర్ (02524), కన్యాకుమారి-సంత్రాగచ్చి (06905), హౌరా-త్రివేండ్రం (06516)...సెప్టెంబరు మూడో తేదీన మాల్దా టౌన్-బెంగళూరు (02510), సికింద్రాబాద్-హౌరా ((02513), హౌరా-సికింద్రాబాద్ (07183)...నాలుగో తేదీన సంత్రాగచ్చి-కన్యాకుమారి (06906)...ఐదో తేదీన త్రివేండ్రం-హౌరా (06515), హౌరా-సికింద్రాబాద్‌కు (03514) ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టారు.

'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)

2. చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)

3. పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)

4. ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)

5. ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా

6. భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్

7. ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'నంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్

8. తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?
ఎ) కుప్వారా బి) కధువా సి) కార్గిల్ డి) రాజేరి

9. అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్

10. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?



ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా

11. జాతీయ క్రీడా దినోత్సవం?
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30

12. ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ

13. 101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనందసేన్ గుప్తా ఎవరు?
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత

14. ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్

15. ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్

16. దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై

17. ఇన్ఫోసిస్ నూతన చైర్మన్?
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి

18. 'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

19. ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి

20. దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కొర్సికా(ఫ్రాన్స్)

21. రైల్వే బోర్డు నూతన చైర్మన్?
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్మృతి నారాయణ్ కాకరే డి) అశ్వని లొహని

22. ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు

23. తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి

24. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)

25. ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్‌ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి)సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)

26. ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ

27. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

28. జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్

29. లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా

30. భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు

31. ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా

32. స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?



ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియ

33. ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?
ఎ) ఫిజి బి) నేరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు

34. 2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ

35. నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?
ఎ) మోచి నది బి) తమూర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది

36. షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?
ఎ) ఫోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)

37. 2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్

38. బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్

39. 'జాఠ్'లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

40. 2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

		13) బి	20) ఎ	27) బి	34) బి
		14) సి	21) డి	28) ఎ	35) ఎ
1) సి	7) డి	15) బి	22) బి	29) డి	36) డి
2) డి	8) డి	16) బి	23) బి	30) ఎ	37) సి
3) బి	9) ఎ	17) సి	24) ఎ	31) డి	38) బి
4) ఎ	10) బి	18) సి	25) బి	32) ఎ	39) డి
5) ఎ	11) బి	19) ఎ	26) డి	33) డి	40) బి
6) బి	12) డి				

JOBS ఉద్యోగాలు

ఎఎస్‌ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్‌ఆర్‌బి)- ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 173

పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.

వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్‌స్క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.

అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14

సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29

దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25

వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.

గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి

ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్

అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.

ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి

ఇమెయిల్: recruitment@iiits.in

వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 5

పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆరోపెడిక్స్ 1)

కాంట్రాక్ట్ వ్యవధి: ఆరు నెలలు

అర్హత - వేతనం: సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.

ఇంటర్వ్యూ: సెప్టెంబరు 13న

వేదిక: Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli

ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.

ఇ-మెయిల్: adhocrstps@ntpc.co.in

నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం

2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్

3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంభన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్

4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం

5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్

6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్

7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ

8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపొడర్ డి) ఏదీకాదు

9. ఇంజక్షన్‌ను స్టెరిలైజేషన్ చేయడానికి ఉపయోగించే పద్ధతి?
ఎ) ఆల్కహాల్‌లో కొద్దిసేపు నిల్వ ఉంచాలి
బి) నీటిలో వేడి చేయాలి
సి) ప్రెషర్ కుక్కర్‌లో వేడి చేయాలి డి) ఏదీకాదు

10. కింది వాటిలో నీటి శుద్ధ స్థితి ఏది?
ఎ) వర్షం నీరు బి) బావి నీరు
సి) కుళాయి నీరు డి) స్వేదన జలం

11. నీటిలోని ఆక్సిజన్ ఎన్ని Mg/liter కన్నా తక్కువ ఉండరాదు?
ఎ) 4 బి) 2 సి) 5 డి) 2

12. నూనె కలిపిన కాస్టిక్ సోడా ద్రావణాన్ని వేడి చేయగా వచ్చే పదార్థాన్ని దేని తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) ఇంధనం బి) ఎరువులు
సి) సబ్బులు డి) ప్లాస్టిక్

13. ప్రభుత్వం సరఫరా చేసే నీటిని సాధారణంగా శుద్ధి చేసే పద్ధతి?
ఎ) క్లోరినేషన్ బి) అంశిక స్వేదనం
సి) వడపోత డి) డికాంటేషన్

14. చక్కెర కిణ్వన ప్రక్రియలో ఏర్పడే ప్రధాన ద్రవం?
ఎ) మిథైల్ ఆల్కహాల్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథేన్ డి) బ్యూటేన్

15. రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) లెడ్ ఫెరాక్సైడ్ బి) మెగ్నీషియం ఆక్సైడ్
సి) అమ్మోనియం పర్‌క్లోరేట్
డి) పొటాషియం క్లోరేట్

16. మంచు ముక్కలు గాలిలో కన్నా నీటిలో త్వరగా కరగడానికి కారణం?
ఎ) నీరు గాలి కన్నా ఎక్కువ బరువైనది
బి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో తక్కువ
సి) నీరు, మంచు సంఘటనం సమానం
డి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో ఎక్కువ

17. ఆర్ధ్రతను కొలిచే పరికరం?
ఎ) థర్మామీటర్ బి) హైడ్రోమీటర్
సి) హైగ్రోమీటర్ డి) బారోమీటర్

18. చల్లని నీటిలో పూర్తిగా రూపాంతరం చెందనిది?
ఎ) బెంజోయికామ్లం బి) చక్కెర
సి) వంటసోడా డి) కాస్టిక్‌సోడా

19. పెట్రోల్ వల్ల కలిగే మంటలను ఆర్పేందుకు నీటిని ఉపయోగించరు ఎందుకు?
ఎ) నీటి చల్లదనం కన్నా మంటలు అధికంగా ఉంటాయి
బి) నీరు, పెట్రోల్ రసాయనికంగా చర్య జరుగుతుంది
సి) నీరు, పెట్రోల్ ఒకదానితో ఒకటి కలిసిపోయి పై పొరలోని పెట్రోల్ మండుతుంది
డి) ఏదీకాదు

20. నీరు మరిగే స్థానం?
ఎ) ఎల్లప్పుడూ 100°C
బి) వాతావరణ పీడనంపై ఆధారపడి ఉంటుంది
సి) సాపేక్ష ఆర్ధ్రతపై ఆధారపడుతుంది
డి) సాంద్రతపై ఆధారపడుతుంది

21. వాతావరణం కలిగి ఉండే నీటిఆవిరి పరిమాణం కింది వాటిలో దేనిపై ఆధారపడుతుంది?
ఎ) ఉష్ణోగ్రత పెరిగితే నీటి పరిమాణం పెరుగుతూ ఉంటుంది
బి) ఉష్ణోగ్రత తగ్గితే ఆవిరి పరిమాణం తగ్గుతుంది
సి) ఉష్ణోగ్రతపై ఆధారపడదు డి) ఏదీకాదు

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

22. శరీరంపై మరుగుతున్న నీరు పడినప్పుడు కంటే వేడి నీటి ఆవిరి వల్ల ఎక్కువ బొబ్బలు ఎందుకు వస్తాయి?
ఎ) నీటి ఆవిరి శరీరంలోకి తొందరగా చొచ్చుకొని పోతుంది
బి) నీటి ఆవిరి అధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉంటుంది
సి) నీటి ఆవిరికి వేడి నీటి కంటే శక్తి అధికం
డి) నీటి ఆవిరి అధిక పీడనాన్ని కలిగి ఉంటుంది

23. అరచేతిలో 'ఈథర్' ద్రావణం పోసినప్పుడు చల్లగా ఉండటానికి కారణం?
ఎ) ఈథర్ చల్లని ద్రావణం కనుక
బి) భాష్పీభవనం చెందుతుంది
సి) స్వేద రంధ్రాలను చేరుతుంది
డి) అరచేతిలో కందెనగా మారడం వల్ల

24. ఒక వ్యక్తి సముద్రపు నీటిలోకి ప్రవేశించగానే చల్లదనం పొందిన భావనకు గురవుతాడు. ఎందుకు?
ఎ) ఉష్ణ సంవహన ప్రవాహాలు
బి) శరీరంలో ఉష్ణ లవణాలు పేరుకుపోవడం
సి) దేహంపై నీరు భాష్పీభవనం వల్ల
డి) భూమికి, సముద్ర నీటికి మధ్య ఉష్ణోగ్రతల భేదం

25. థర్మో ప్లాస్క్‌లో చల్లని లేదా వేడి ద్రవాలు చాలాసేపటి వరకు అలాగే ఉండటానికి కారణం?
ఎ) థర్మో ప్లాస్క్‌లో రెండుగోడల నిర్మాణాలు అధమ ఉష్ణ వాహకంగా పనిచేస్తాయి
బి) ఈ రెండు గోడల నిర్మాణాలకు లోపలి భాగం సిల్వర్ పూత ఉంటుంది
సి) రెండు గోడల నిర్మాణాల మధ్య శూన్య ప్రదేశం ఉంటుంది డి) బి, సి

26. ఒక నదిలో ప్రయాణిస్తున్న నౌక సముద్రానికి చేరిన వెంటనే...
ఎ) కొద్దిగా పైకి లేస్తుంది
బి) కొద్దిగా మునుగుతుంది
సి) అదేవిధంగా కొనసాగుతుంది డి) ఏదీకాదు

27. సముద్రపు సాంద్రత దేనిలో పెరుగుతుంది?
ఎ) సముద్రపు లోతు, లవణీయత తగ్గుతూ ఉంటే
బి) సముద్రపు లోతు, లవణీయత పెరుగుతూ ఉంటే
సి) సముద్రపు లోతు పెరిగి లవణీయత తగ్గుతూ ఉంటే
డి) లవణీయత, సముద్రపు లోతు పెరుగుతూ ఉంటే

28. కింది ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
ఎ) నీరు బి) పాదరసం సి) ఈథర్ డి) ఆల్కహాల్

29. ఘనీభవించిన సరస్సులో చేపలు జీవించి ఉండటానికి కారణం?
ఎ) చేపల రక్తం వేడిగా ఉంటుంది
బి) మంచు కింద భాగంలోని నీరు ఘనీభవనం చెందదు
సి) మంచు ఒక మంచి ఉష్ణవాహకం
డి) ఏదీకాదు

30. రెండు పాదరస బిందువులను కలపగా ఒక పెద్ద బిందువుగా మారడానికి కారణం?
ఎ) కనిష్ఠ ఘనపరిమాణం
బి) గరిష్ఠ తలతన్యత
సి) కనిష్ఠ తలతన్యత వైశాల్యం
డి) గరిష్ఠ ఘనపరిమాణం

31. ఘనీభవించిన సరస్సు పైభాగంలో -15°C ఉష్ణోగ్రత ఉంటే కింది పొరల్లో ఉండే ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 0°C బి) 4°C సి) -15°C డి) -7.5°C

32. శీతల ప్రదేశాల్లో ఉపయోగించే థర్మామీటర్‌లో పాదరసం కన్నా ఆల్కహాల్ ద్రావణాన్ని తీసుకోవడానికి కారణం?
ఎ) ఆల్కహాల్ ఉత్తమ ఉష్ణవాహనం
బి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం తక్కువ
సి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం ఎక్కువ
డి) ఏదీకాదు

33. 97% సముద్రపు నీరు, 3% శుద్ధమైన నీరు ఉండే లవణం?
ఎ) జలావరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) శిలావరణం డి) వాతావరణం

34. నీరు అనేది ఒక?
ఎ) ఒక మూలకం బి) ఒక ద్రవం
సి) ఒక మిశ్రమం డి) ఒక సంయోగ పదార్థం

35. నీటిలో ఆక్సిజన్ ఎంత శాతం ఉంటుంది?
ఎ) 86% బి) 96% సి) 21% డి) 100%

36. చెమట ఎక్కువగా పట్టేస్థితి?
ఎ) వేడి అధికంగా ఉండి, గాలిలో తేమ ఉండటం
బి) వేడి అధికంగా ఉండి గాలి పొడిగా ఉండటం
సి) వేడి తక్కువగా ఉండి గాలిలో తేమ ఉండటం
డి) వేడి తక్కువగా ఉండి గాలి పొడిగా ఉండటం

37. వార్షిక గ్లోబల్ ఇన్నోవేషన్ బారోమీటర్‌లో ఇండియా స్థానం?
ఎ) 3 బి) 4 సి) 5 డి) 6

38. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం?
ఎ) ఏప్రిల్ 7 బి) మే 7
సి) ఆగస్టు 7 డి) సెప్టెంబరు 6

39. ఇండియాలో చమురు శుద్ధి కర్మాగారాల సంఖ్య?
ఎ) 19 బి) 18 సి) 17 డి) 16

40. వాటర్ గ్యాస్ అంటే?
ఎ) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్
బి) కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్
సి) అల్యూమినియం హైడ్రేట్ డి) ఏదీకాదు

41. అనిమోమీటర్ ద్వారా దేన్ని లెక్కించవచ్చు?
ఎ) సముద్ర స్థాయిపైన ఎత్తుని బి) గాలి తేమను
సి) సముద్రపు లోతు డి) గాలి వేగాన్ని

42. వెంచురీ మీటర్ ద్వారా దేన్ని లెక్కిస్తారు?
ఎ) ప్రవాహిరేటు బి) గాలివేగం
సి) సాంద్రత డి) ఆర్ధ్రత

43. మేఘాలు ఏర్పడటానికి కింది వాటిలో ఏది అవసరం లేదు?
ఎ) వాతావరణంలోని దుమ్ము కణాలు
బి) నీరు ఆవిరి కావడం సి) నీరు గడ్డకట్టడం
డి) గాలి

44. ద్రవ నైట్రోజన్‌లో దీర్ఘ అపరిశుద్ధమైనది?
ఎ) ద్రవ హీలియం బి) ద్రవ ఆక్సిజన్
సి) ఘన కార్బన్ డై ఆక్సైడ్ డి) ద్రవ హైడ్రోజన్

45. వేసవి ద్రవంగా పిలిచే పదార్థం?
ఎ) పాదరసం బి) నీరు సి) గాలియం డి) రేడియం

సమాధానాలు

1) బి	8) బి	15) సి	23) బి	31) ఎ	39) ఎ
2) బి	9) ఎ	16) డి	24) సి	32) సి	40) ఎ
3) సి	10) ఎ	17) సి	25) డి	33) ఎ	41) డి
4) ఎ	11) ఎ	18) ఎ	26) ఎ	34) డి	42) ఎ
5) డి	12) సి	19) సి	27) డి	35) ఎ	43) సి
6) సి	13) ఎ	20) బి	28) బి	36) ఎ	44) డి
7) సి	14) బి	21) ఎ	29) బి	37) డి	45) సి
		22) సి	30) సి	38) ఎ	

స్కాలర్‌షిప్

నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపిటి), హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్(హెచ్‌బిసిఎస్ఇ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌కు ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

విభాగాలు: ఆస్ట్రానమీ, బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్

అర్హత: నవంబరు 30 నాటికి ఇంటర్ లోపు చదువుతున్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు

వయసు: 1998 జూలై 1 నుంచి 2003 జూన్ 30 మధ్య జన్మించి ఉండాలి

విభాగం: జూనియర్ సైన్స్

అర్హత: నవంబరు 30 నాటికి పదోతరగతి లోపు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: 2003 జనవరి 1 నుంచి 2004 డిసెంబరు 31 లోపు జన్మించి ఉండాలి.

ఈ ప్రోగ్రామ్‌లో అయిదు స్టేజ్‌లు ఉంటాయి. మొదటి స్టేజ్‌ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపిటి) నిర్వహిస్తుంది. మిగిలినవాటిని హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బిసిఎస్ఇ) నిర్వహిస్తుంది.

స్టేజ్ 1 - ఫస్ట్ స్టెప్ టు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ 2018 ఎగ్జామ్స్: నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఇన్ ఆస్ట్రానమీ (ఎన్ఎస్ఇఏ), బయాలజీ (ఎన్ఎస్ఇబి), కెమిస్ట్రీ(ఎన్ఎస్ఇసి), జూనియర్ సైన్స్ (ఎన్ఎస్ఇజెఎస్), ఫిజిక్స్(ఎన్ఎస్ఇపి)

పరీక్ష తేదీలు: ఎన్ఎస్ఇజెఎస్ ఎగ్జామ్ నవంబరు 19న, మిగతావన్నీ నవంబరు 26న

ఎన్‌రోల్‌మెంట్‌నకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15

ప్రతి సబ్జెక్టులో అర్హత పొందిన మొదటి 300 మందిని స్టేజ్ 2కు అనుమతిస్తారు.

స్టేజ్ 2 ఎగ్జామ్స్: ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్స్ ఇన్ ఆస్ట్రోనమీ, బయాలజీ, కెమిస్ట్రీ, జూనియర్ సైన్స్, ఫిజిక్స్(ఐఎన్ఎఒ, ఐఎన్‌బిఒ, ఐఎన్‌సిహెచ్ఒ, ఐఎన్‌జెఎస్ఒ, ఐఎన్‌పిహెచ్ఒ)

స్టేజ్ 3: ప్రతి సబ్జెక్టులో ఓరియంటేషన్ కం సెలెక్షన్ క్యాంప్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారిని స్టేజ్ 4 కింద ప్రి డిపార్చ్యూర్ ట్రైనింగ్‌కు పంపుతారు. తదుపరి స్టేజ్ 5 ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు

వెబ్‌సైట్: www.iapt.org.in
olympiads.hbcse.tifr.res.in

అడ్మిషన్స్

ఎన్ఐఇఎల్ఐటి

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి)- కింద పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **పీజీ డిప్లొమా**

విభాగాలు: క్లవుడ్ కంప్యూటింగ్/ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ

కాలవ్యవధి: 24 వారాలు

కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి

విభాగం: ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టం డిజైన్

కోర్సు వ్యవధి: 24 వారాలు

కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 25 నుంచి

జాబ్ ఓరియంటెడ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులు

- **బిగ్ డేటా అనలిటిక్స్**

కోర్సు కాలవ్యవధి: 16 వారాలు

కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి

- **ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ లెవెల్ 1, ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జావా ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్**

కోర్సుల కాల వ్యవధి: 12 వారాలు

కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 11 నుంచి

వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

31 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి చర్యలు

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్మయిదేవి



ఏఎల్ పురంలో అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న పీడీ

కృష్ణాదేవిపేట/కొయ్యూరు: ఏజెన్సీలో 31 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్మయిదేవి తెలిపారు. గొలుగొండ మండలంలోని ఏఎల్.పురం, కొయ్యూరు మండలంలోని రత్నంపేట గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టిహాకారం అందుతుందా? లేదా? అని ఆరా తీశారు. అలాగే విద్యా బోధన తీరుపై చిన్నారులను, తల్లిదండ్రుల అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతోఆమె మాట్లాడుతూ, ఏజెన్సీలోని 11 మండలాల్లో 31 సూపర్‌వైజర్ పోస్టులను పది రోజుల్లో భర్తీ చేయనున్నట్టు చెప్పారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెల చిన్నారి నుంచి రెండున్నరేళ్ల లోపు పిల్లలకు బాలఅమృతం ప్యాకెట్లను పంపిణీ చేస్తామని పీడీ తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమణమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.23.72 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శ్రీవారి సేవ సభ్యులు

అనకాపల్లి టౌన్: నూకాంబి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం ఆలయం ఆవరణలో జరిగింది. భక్తులు కానుకల రూపంలో రూ.23లక్షల72వేల 226 ఆదాయం లభించింది. అన్నదానం విరాళాలు 38వేల 27 రూపాయలు వచ్చాయని ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సుజాత తెలిపారు. బంగారం 78 గ్రాములు, వెండి కిలో 30 గ్రాములు వచ్చాయన్నారు. అలాగే హుండీలో 28 అమెరికన్ డాలర్లు, 210 సింగపూర్ డాలర్లు, 109 మలేషియా రియాడ్స్, ఐదు అరబ్ ఎమేరేట్స్ దీనార్స్, బ్యాంక్ ఆఫ్ ఇండోనేషియా ఐదువేలు ఉన్నాయని వివరించారు. 70 రోజులకు ఈ ఆదాయం లభించిందన్నారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్‌వీఎన్ మూర్తి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజులు పర్యవేక్షణలో శ్రీవారి సేవా సమితి సభ్యులు ఈ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వెంకటరావు, మళ్ల సురేంద్ర, ఎ.జగన్నాథరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనుల్లో టెండరింగ్

... మొదటి పేజీ తరువాయి

ప్రచారం జరుగుతున్నది. ఇటువంటి అడ్డగోలు వ్యవహారాలకు స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం కేంద్ర బిందువు కావడంతో, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లంటే కాంట్రాక్టర్లకు లెక్కలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ల పేరుతో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లే నీటి పథకాల నిర్మాణాలు చేపడుతున్నారని గతంలో ప్రజాప్రతినిధులు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ పైస్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పెద్దలతో మంతనాలు చేసుకోవడంతో ఇక్కడ ఏమి జరిగినా వెలుగులోకి రావడం లేదని తెలిసింది.

అంచనాల వ్యయం పెంపు

మన్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంటాక్టర్లు కుమ్మక్కై తాగునీటి పథకాల పనుల అంచనాలను విపరీతంగా పెంచేసి, భారీగా నిధులు స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి రూ.10 లక్షల పైబడిన పనుల టెండర్లను ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించాలి. రూ.10 లక్షలు లోపు వ్యయం అయ్యే వాటిని ఈఈ స్వయంగా టెండర్లు నిర్వహించుకోవచ్చు. దీంతో పథకం నిర్మాణానికి కనిష్ఠంగా రూ.5.50 లక్షలు, గరిష్ఠంగా రూ.9.50 లక్షల వ్యయం అవుతుందని అంచనాలను రూపొందించి, పాడేరులోనే టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో మంగళవారం 83 నీటి పథకాలకు టెండర్లు నిర్వహించడంతో..... తమ ప్రాంతాల్లోని నీటి పథకాల పనులు తమకే దక్కేలా చేయాలని, లేకపోతే ఒప్పుకునేది లేదంటూ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు అనుచరులుగా చెప్పుకుంటున్న కొంత మంది కాంట్రాక్టర్లు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వీరంగం చేశారని తెలిసింది.. ఇందుకు మిగిలిన వారు ఒప్పుకోకపోవడంతో టెండర్ల వ్యవహారం గందరగోళానికి దారితీసింది. దీంతో నీటి పథకాల పనుల టెంటర్లు రద్దు చేయాల్సి వచ్చింది.

పెదలబుడులో మరుగుదొడ్ల నిధులు స్వాహా

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సీపీఎం నాయకులు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణాల్లో నిధులు పక్కదారి పట్టాయి. సీఎం చంద్రబాబునాయుడు దత్తత గ్రామంలో భారీ అవినీతిని సీపీఎం నాయకులు సర్వే ద్వారా గుర్తించారు. దీనిపై బుధవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు లోకనాథం, సురేంద్ర మాట్లాడుతూ, ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్ శెట్టి అశోక్‌కుమార్, విశాఖపట్నంకు చెందిన కె.రవిరాజుకుమార్, గుమ్మ శివకృష్ణ వ్యక్తిగత ఖాతాల్లో

నిబంధనలకు విరుద్ధంగా రూ.3.62 వేల ఉపాధి నిధులు జమ చేశారని తెలిపారు. లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ కావాల్సిన డబ్బును సదరు వ్యక్తులు దారి మళ్లించారని ఆరోపించారు. గంజాయిగుడలో రూ.1.37 లక్షలు, చినలబుడు పంచాయతీ పరిధిలోని పకనకుడి గ్రామంలో రూ.1.57 లక్షలు, మంజగుడలో రూ.67 వేలు లబ్ధిదారుల ఖాతాలో వేయకుండా టెక్నికల్ అసిస్టెంట్ వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. మంజగుడ, పకనగుడ గిరిజనులు 2016లో నిర్మించుకున్న మరుగుదొడ్ల బిల్లులను కూడా వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసుకున్నారని తెలిపారు. పెదలబుడు పంచాయతీలో మరుగుదొడ్లు నిర్మిస్తామని కాంట్రాక్టుకు తీసుకొని పనులు పూర్తి చేయకుండానే నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు తమ సర్వేలో గుర్తించామని వారు తెలిపారు. పిట్టమామిడివలస, గోడ్‌గుడ, బిస్టుగుడ, అరకువేలి పరిధిలోని మరుగుదొడ్ల నిర్మాణాల్లో భారీస్థాయిలో అక్రమాలు జరిగినట్టు సర్వేలో తేలిందని చెప్పారు.

విచారణ జరిపిస్తాం: కలెక్టర్

సీఎం దత్తత గ్రామంలో మరుగుదొడ్ల నిధులు స్వాహా ఆరోపణలపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిధుల దుర్వినియోగం జరిగినట్టు రుజువైతే ఎంతటివారైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.30
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.40
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.25
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.30
బీన్స్	రూ.60
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.12
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.80
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.30
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.20
కాకరకాయలు	రూ.30
ఆనపకాయ(చిన్నది)	రూ.10
ఆనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.80
శనగ పప్పు	రూ.80
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.30
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో	
విశాఖపట్నం	362
విజయనగరం	366
శ్రీకాకుళం	366

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	100.00	99.00
విత్ స్కిన్	140.00	168.00
స్కిన్ లెస్	165.00	178.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3630	3875
రెండో రకం	3235	3655
మూడో రకం	2980	3350

దినఫలాలు


అదృష్టసంఖ్యలు : 3, 4



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.



మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పించన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ



మీకు తెలుసా?

వేడి నీటికన్నా చల్లటి నీరు బరువుగా ఉంటుంది.



ఔనా!

మనుషుల్లో లాగానే..పిల్లులు, శునకాల్లోనూ ఎడమ చేతివాటం, కుడి చేతివాటం ఉంటాయి.

సూక్తి

అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించినట్లే. పోరాడి ఓడినవాడు తిరిగి గెలుస్తాడు.

ప్రపంచం నిదురోయింది ఇలా..

తుంపరలు తుంపరలుగా వర్షం పడుతున్న వేళ.. మెత్తని పరుపుపై... నులివెచ్చని దుప్పటి కప్పుకుని పడుకుంటే... ఆ సుఖమే వేరు కదూ! చరిత్రలోకి తొంగి చూస్తే.. మంచాలు ఉండవు, పరుపులు కానరావు. 'గచ్చు' కూడా కనిపించదు. కటిక నేలపైనే కంటి నిండా నిద్రపోయేవారు. ఆనాటి ఆదిమ మానవుడి నుంచి.. ఈనాటి ఆధునిక మానవుడి వరకు ఎలా నిద్రించారో ఓ సారి చూద్దామా!

ప్రారంభం

క్రీ.పూ. 10000



ఈ కాలంలో ఎక్కువ శాతం గుహల్లో నివసించేవాళ్లు. నేలపైన జంతువుల చర్మం వేసుకుని నిద్రించేవారు

క్రీ.పూ. 3600



ఈజిప్షియన్లు కర్రతో చేసిన మంచాలపై పడుకునేవారు.

క్రీ.పూ. 3400



పర్షియన్లు 'వాటర్ బెడ్స్'ను ఉపయోగించేవారు. వీటిని గొర్రె చర్మంతో తయారు చేసేవారు.

క్రీ.పూ. 27



ఈ కాలంలో ఉన్ని లేదా పక్షుల ఈకలతో రూపొందించిన విలాసవంతమైన బెడ్స్ వచ్చాయి. రోమన్లు వీటిపైనే నిద్రించేవారు.

క్రీ.శ. 1300

మొదటిసారిగా 'మాట్రస్' అనే పదం ఈ కాలం లోనే వాడారు. 'మాత్రహ్' అనే అరబిక్ పదం నుంచి 'మాట్రస్' వచ్చింది.

యూరోపియన్లు గడ్డితో తయారుచేసిన 'ఫ్యాబ్రిక్ పరుపు'లపై కునుకు తీసేవారు.

1500
(పునరుజ్జీవన కాలం)



ఇదే కాలంలో కాటన్ పరుపులు వచ్చాయి. ప్రజలు వాటిని ఉపయోగించడం అలవాటు చేసుకున్నారు. అమెరికాలో కాటన్ ఉత్పత్తి పెరిగింది ఈ సమయంలోనే.

18వ శతాబ్దం



1865



'కాయిల్ స్ప్రింగ్ మాట్రస్' ప్రజలకు అందుబాటులోకి వచ్చింది ఈ కాలంలోనే. 'సామ్యూల్ పీ కిటిల్' ఈమాట్రస్‌పై పేటెంట్ హక్కులు పొందాడు.

1879

థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి 'బల్బు'ను పరిచయం చేసిన సంవత్సరం. ఈ ఆవిష్కరణతో అమెరికా సగటు పౌరుని నిద్ర దాదాపు మూడు గంటలు తగ్గింది.

1950



విలాసవంతమైన పరుపులు వచ్చిన కాలం. కన్స్యూమర్ మార్కెట్‌లోకి ఇవి విరివిగా రావడంతో అందరినీ ఆకట్టుకున్నాయి

1960



మోడ్రన్ వాటర్ బెడ్స్ వాడటం మొదలైంది.

1970

స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తొలిసారిగా 'స్లీప్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించింది.

1990



నాసా 'విస్కో ఎలాస్టిక్ ఫోమ్' పరుపుల స్ఫూర్తితో, 'మెమొరీ ఫోమ్ మాట్రస్'లు రూపొందాయి.

ప్రస్తుతం

2012



ఎక్కువ లేయర్లతో సాఫ్ట్ కుషన్‌తో, ఎంతో సౌకర్యంగా ఉండే విలాసవంతమైన పరుపులు అందుబాటులోకి వచ్చాయి.

పదాలు కనుక్కోండి

L	E	A	F	Y	E	Y	P	N
Y	O	A	Y	E	K	L	E	C
C	R	U	E	K	A	D	N	R
E	A	T	L	R	R	L	W	I
I	N	U	L	U	T	O	O	S
P	G	M	O	T	F	C	R	P
C	E	N	W	R	E	D	B	W
E	L	P	P	A	P	M	A	J
B	C	H	A	N	G	E	Q	K

YELLOW PIE BROWN RAKE ORANGE	COLD CRISP AUTUMN RED	LEAF CHANGE APPLE TURKEY


చెప్పగలరా?

ఉడతలో ఉన్నా కానీ మిడతలో లేను
వాద్యంలో ఉన్నా కానీ వాదంలో లేను
మంచిలో ఉన్నా కానీ కంచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

చెప్పగలరా?: ఉద్యమం
జంతర్‌మంతర్: 1. ఉమ్మడి 2. శ్రీకారం 3. సారూప్యం 4. మెరుపు

రంగులు వేయండి



టంగ్ ట్విస్టర్స్

1. Excited executioner exercising his excising powers exces-sively.
2. Pail of ale aiding ailing Al's travails.
3. Double bubble gum, bubbles double.
4. Salty broccoli, salty broccoli, salty broccoli

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. మ్మఉడి ▸ ....
2. శ్రీరంకా ▸ ....
3. రూసాప్యం ▸ ....
4. రుపుమె ▸ ....

ఆంధ్రజ్యోతి
16
విశాఖపట్నం
గురువారం 31 ఆగస్టు 2017



తిరుమల సమాచారం

వసతి గదులు: రూ.500 : అక్టోబరు 23 నుంచి డిసెంబరు 29 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబరు 23 నుంచి డిసెంబరు 29 వరకు ఉన్నాయి.
రూ.50: ఖాళీలు లేవు
శ్రీనివాసమ్: అక్టోబరు 23 నుంచి డిసెంబరు 29 వరకు ఉన్నాయి.



రూ.300 దర్శనం: సెప్టెంబరు 6 నుంచి నవంబరు 30 వరకు ఉన్నాయి (మధ్యలో సెప్టెంబరు 19,23,27,28, 29,30, అక్టోబరు1,7,14 తప్ప)
ఆర్జిత సేవలు : అక్టోబరు 31వ తేదీ ఉన్నాయి. **- విశాఖపట్నం**

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,
ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 06333

- 'సంకల్ప్ సే సిద్ది' లో జడ్పీ చైర్‌పర్సన్ భవానీ
- ఆహార ధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాధించాలి సూచన
- 2022 నాటికి వ్యవసాయ ఆదాయాన్ని రెండింతలు చేద్దామని అంతా ప్రతిజ్ఞ


నవభారత నిర్మాణ ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు, అధికారులు, రైతులు

సమష్టి కృషితో వ్యవసాయ ఆదాయం రెట్టింపు




ప్రసంగిస్తున్న లాలం భవానీ

అనకాపల్లి అగ్రికల్చర్ : వ్యవసాయ ఆదాయం రెండింతలు పెరిగి తద్వారా రైతులు ఆర్థిక ప్రగతి సాధించేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవానీ అన్నారు. ఇక్కడి వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం జరిగిన 'సంకల్ప్ సే సిద్ధి' సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం ఎంత అవసరమో, ఆహార ధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడని స్వయం సమృద్ధి కూడా అంతే ముఖ్యమన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నవభారత నిర్మాణానికి అందరూ పాటుపడాలన్న ప్రధాని పిలుపును ఆమె గుర్తుచేశారు. ఏడీఆర్ డాక్టర్ ఎన్. వేణుగోపాలరావు మాట్లాడుతూ 1942లో స్వాతంత్ర్యయోధులు క్విట్ ఇండియా ప్రతిజ్ఞ చేసి ఐదేళ్లలో స్వాతంత్ర్యం సాధించిన విధంగానే 2022 నాటికి వ్యవసాయ ఆదాయాన్ని రెండింతలు చేద్దాం అని ప్రతిజ్ఞ చేయాలని కోరారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయాధికారి డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు సంకల్ప సే సిద్ధి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. పంట నష్టాలను తగ్గించే పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, నూతన మార్కెటింగ్ విధానం, వ్యవసాయ అనుబంధ రంగాల బలోపేతం వంటి అంశాల ద్వారా వ్యవసాయ ఆదాయం రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు వివరించారు. వ్యవసాయ ఆర్థికవేత్త డాక్టర్ ఐ.వి.వై.రామారావు, శాస్త్రవేత్తలు డాక్టర్ జగన్నాథరావు, డాక్టర్ చిత్కళాదేవి, డాక్టర్ డి.వి.రమణారెడ్డి, వ్యవసాయ సంయుక్త సంచాలకులు శివప్రసాద్, ఉద్యానశాఖ ఏడీ శైలజ, సూక్ష్మ నీటిపారుదల పీడీ శ్రీనివాసరావు, ఆత్మ పీడీ కేసీహెచ్ అప్పలస్వామి తదితరులు మాట్లాడారు. అనంతరం జిల్లా ఏరువాక కేంద్రం ప్రచురించిన వ్యవసాయ సమాచారం పోస్టర్‌ను చైర్‌పర్సన్ భవానీ ఆవిష్కరించారు. అంతకు ముందు సమావేశానికి హాజరైన వారంతా నవభారత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన వ్యవసాయ స్టాల్స్‌ను పరిశీలించారు. ఆర్ఏఆర్ఎస్, కొండెంపూడి కేవీకే, ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మార్పు చిక్కింది..
మంచి ధర దక్కింది

సుమారు పది కిలోల బరువు.. మూడు అడుగుల పొడవు.. ఉన్న అతి పెద్ద మార్పు చేప ఎలమంచిలిలో దర్శనమిచ్చింది. పురుషోత్తపురం సమీపంలోని చెరువులో బుధవారం ఉదయం ఓ మత్స్యకారుడు వేటకు దిగాడు. వల విసరగానే ఓ పెద్ద మార్పు చిక్కింది. దీంతో అతని ఆనందానికి అవధులు లేకపోయాయి. వెంటనే మార్కెట్‌కు తీసుకురాగా అందరూ ఆశ్చర్యంగా తిలకించారు. కోనుగోలు చేసేందుకు కూడా పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. **- ఎలమంచిలి**

దీపం కనెక్షన్ల పంపిణీ వేగవంతం కావాలి

అధికారులకు జాయింట్ కలెక్టర్ సృజన ఆదేశం

పాడేరు : ఏజెన్సీ ప్రాంతంలో ఉచిత దీపం కనెక్షన్ల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సృజన అధికారులకు ఆదేశించారు. బుధవారం ఇక్కడికి వచ్చిన ఆమె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏజెన్సీలో దీపం గ్యాస్ కనెక్షన్ల పంపిణీ, అటవీ హక్కుల చట్టం అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏజెన్సీలో ఇప్పటి వరకు దాదాపుగా 50 శాతం వరకు మాత్రమే గ్యాస్ కనెక్షన్ల పంపిణీ జరిగిందని, పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అలాగే సిలెండర్లు వచ్చిన వెంటనే పంపిణీ జరిగేలా అధికారులు చొరవ చూపాలన్నారు.


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జేసీ సృజన

అటవీ హక్కుల కల్పనకు సమన్వయంతో కృషి

అటవీ హక్కుల చట్టంలో భాగంగా గిరిజనులు సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇచ్చే ప్రక్రియను రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో చేపట్టాలని జేసీ సూచించారు. గిరిజనుల సాగుబడిలో ఉన్న అటవీ భూముల గుర్తింపులో అటవీ శాఖాధికారులు సంపూర్ణంగా సహకరించాలన్నారు. ఏజెన్సీలో మొత్తం 12,101 క్లైములకు గానూ ప్రస్తుతం 5,119 క్లైములకు సంబంధించిన భూములకు సర్వే నిర్వహించారని, మిలిగిన వాటికి త్వరలోనే సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఏజెన్సీలో అన్ సెటిల్ విలేజ్‌లను గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో డి.వేణుగోపాల్, జిల్లా పౌర సరఫరాల అధికారిణి సరోజిని, ఏజెన్సీ మండలాలకు చెందిన తహసీల్దార్లు, సివిల్ సప్లై డీటీలు, జీసీసీ డీఎంలు, బీఎంలు పాల్గొన్నారు.


కూరగాయలతో అలంకరించిన వినాయక విగ్రహం

వెజిటబుల్ వినాయకుడు

పాయకరావుపేట : పట్టణానికి చెందిన ఓ భక్తుడి ఇంట్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. పాతమునసబుగారి వీధికి చెందిన దాసరి శేఖర్ అనే యువకుడు వినాయక చవితి రోజున తన ఇంట్లో మహాగణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నాడు. ఇందులో భాగంగా స్వామిని రోజుకోలా అలంకరిస్తున్నాడు. బుధవారం మిరపకాయ నుంచి ఆనప కాయ వరకు ఇలా సుమారు 20 కేజీల కూరగాయలతో సుందరంగా అలంకరించడంతో పెద్ద సంఖ్యలో పరిసరాలవారు దర్శించుకున్నారు.

పొలానికి పచ్చని సింగారం

చోడవరం: వర్షాభావ పరిస్థితుల కారణంగా వరినాట్లు ఆలస్యం కావడంతో వెలవెలబోయిన పంటపొలాల నేడు పచ్చగా కళకళలాడుతున్నాయి. గడచిన పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరినాట్లు జోరం దుకున్నాయి. గ్రామాల్లో ఎటు చూసినా దమ్ములు, ఆకుతీత, వరినాట్లలో అన్నదాతలు తెగ బిజీగా కనిపిస్తున్నారు. ఇప్పటికే నాట్లు పూర్తయిన పొలాలు పచ్చదనం సంతరించుకున్నాయి. మండలంలోని గౌరీపట్నం, బుచ్చెయ్యపేట మండలం కస్పా భూముల్లో వరినాట్లు పూర్తయ్యాయి. మిగిలిన భూముల్లో దమ్ములు, నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.


గౌరీపట్నంలో పచ్చదనంతో ఉన్న వరి పొలం

గిరిజనుల ఆర్థిక స్వావలంబనపై ప్రత్యేక దృష్టి

- 863 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు చర్యలు
- 2.44 లక్షల మందికి చంద్రన్న బీమా
- చంద్రన్న చేయూతలో 88 వేల మందికి రూ.53 కోట్ల పంపిణీ
- 'ఆంధ్రజ్యోతి'తో వెలుగు ఏపీడీ సుబ్బారావు



పాడేరు: మన్యంలో గిరిజనుల ఆర్థిక స్వావలంబనపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని వెలుగు ఏపీడీ యు.సుబ్బారావు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా ఏజెన్సీలో గిరిజనులకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి 6,219 మంది లబ్ధిదారులకు రూ.18.92 కోట్లతో వివిధ స్వయం ఉపాధి యూనిట్లను అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే ఏజెన్సీ వ్యాప్తంగా 862 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకానికి ఈ ఏడాది చర్యలు ప్రారంభించామని చెప్పారు.

చంద్రన్న చేయూతగా రూ.53 కోట్లు పంపిణీ

స్వయం సహాయక సంఘాలకు చంద్రన్న చేయూతలో భాగంగా ఏజెన్సీ వ్యాప్తంగా 88 వేల, 314 మందికి రూ.53 కోట్లు పంపిణీ చేశామని ఏపీడీ సుబ్బారావు తెలిపారు. అలాగే గిరిజనులకు సాంకేతిక పరమైన సేవలను మరింత చేరువ చేసేందుకు 35 ప్రాంతాల్లో 'వన్ స్టాప్ షాప్'లలో ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే 17 చోట్ల షాపులు ప్రారంభించామన్నారు. వాటిలో మీ-సేవ, ఈ-సేవ, బ్యాంకింగ్ సేవలు అందుతాయన్నారు. అలాగే ఏజెన్సీలో ఇప్పటికే 2 లక్షల 43 వేల 248 మందికి చంద్రన్న బీమా సదుపాయం కల్పించామని, కొత్త మార్గదర్శకాల నేపథ్యంలో అసంఘటిత కార్మికులందరికీ చంద్రన్న బీమా సదుపాయం కల్పిస్తామని ఏపీడీ చెప్పారు. మన్యంలో తాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో తొలి విడతగా 47 గ్రావెటీ నీటి పథకాలను నిర్మించామని, రెండో విడతగా 27 నీటి పథకాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

1,382 రైతు ఉత్పత్తి సంఘాలు

గిరిజన రైతులకు దళారీల బెడద నుంచి విముక్తి చేసేందుకు 1,382 రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేశామని ఏపీడీ సుబ్బారావు తెలిపారు. ఆయా సంఘాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. అలాగే వారికి రుణాలు పంపిణీ చేయడం, సంఘాల్లో పొదుపును అలవాటు చేయడంతో పాటు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించి వ్యవసాయ/ఉద్యాన పంటల అభివృద్ధి, మార్కెటింగ్‌కు అవకాశం కల్పిస్తామన్నారు. ఫలితంగా గిరిజన రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందన్నారు.

వెలుగు వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక శిక్షణలు

వెలుగు వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక శిక్షణలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వెలుగు ఏపీడీ సుబ్బారావు చెప్పారు. గ్రామ స్థాయిలో ఉన్న స్వయం సహాయ సంఘాలు మొదలుకుని, గ్రామైక్య సంఘాలు, మండల మహిళా సమాఖ్యలు, డివిజన్ స్థాయిలో గిరిజన సమైక్య సంఘం, వెలుగు సిబ్బందికి సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ప్రత్యేక శిక్షణలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వెలుగును సంస్థాగతంగా మరింతగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటున్నదని ఏపీడీ వివరించారు.



వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేస్తున్న అభ్యర్థులు

వలంటీర్ పోస్టులకు తీవ్ర పోటీ

చింతపల్లి: ఎస్ఆర్ఎస్‌టీసీ విద్యా వలంటీర్ పోస్టులకు తీవ్ర పోటీ నెలకొంది. మండలంలోని పాలమామిడి, తాటిబంద, చెక్కరాయిబంద, ఊబలగరువు, పులిగొంది, వేనం, రోలుగుంట, చెక్కరాయిబంద, నిమ్మలపాలెం, రామారావుపాలెం, తప్పలమామిడి, లొబ్బుగంట, మూలగరువు, కరకపల్లి గ్రామాల్లో విద్యార్థులకు ప్రాథమిక విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాన్ రెసిడెన్షియల్ స్కూల్ ట్రైనింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌టీసీ)లు మంజూరు చేసింది. ఈ కేంద్రాల్లో విద్యా వలంటీర్ పోస్టులకు బుధవారం సాయంత్రంతో దరఖాస్తు గడువు ముగిసింది. ఒక్కొక్క పోస్టుకు ముగ్గురు, నలుగురు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. ఎంపిక కార్యక్రమాన్ని మెరిట్ ఆధారంగా జిల్లా కలెక్టర్ నిర్వహిస్తారని ఎంఈవో పి.ప్రసాద్ తెలిపారు. ఈ పాఠశాలలు ప్రారంభమైతే అన్ని గ్రామాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్య అందుబాటులోకి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

పోరాడే సంఘాలతోనే కార్మికులకు లబ్ధి

ఈయూ డివిజన్ సంయుక్త కార్యదర్శి మోహన్

పాడేరు రూరల్: సమస్యలపై పోరాడే సంఘాలతోనే కార్మికులకు లబ్ధి చేకూరుతుందని ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు సందడి మోహన్, యు.తాతయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఆర్ఆర్.బాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. లేనిపోని హామీలతో కార్మికులను నట్టేట ముంచే కుటిల రాజకీయాలు చేయడం కార్మికుల క్షేమం కోరుకొనే సంఘాలకు తగదన్నారు. ఎన్ఎంయూ తీరుతో విసుగు చెంది 25 మంది కార్మికులు తమ సంఘంలో చేరారన్నారు. ఎంప్లాయీస్ యూనియన్‌లో ఉన్న మాజీ అధ్యక్షుడు ఎఎస్.నారాయణ యూనియన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు గుర్తించి సస్పెండ్ చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ డిపో కార్యదర్శి చందు, సభ్యులు చంటి, బాబీ, కేవీ.నాయుడు, సీఆర్టీ సతీష్, గంగరాజు,మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు



విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రపాలెం వైద్యాధికారి ప్రసన్న మాట్లాడుతూ, ఏజెన్సీ వ్యాప్తంగా సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఎక్కువ ఉన్నట్టు వైద్యుల పరిశీలనలో తెలిందన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని చెప్పారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి మరోసారి పరీక్షలు చేస్తామన్నారు. ఒక్కో ఏఎన్ఎం ప్రతి రోజూ సుమారు 50 మంది విద్యార్థులకు పరీక్షలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేట్రిన్ డి.సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు

పాడేరు రూరల్: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు పట్టణంలో బుధవారం ఘనంగా జరిగాయి. కిండంగి పంచాయతీ నక్కలపుట్టు గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాయంత్రం 4 గంటల నుంచి వినాయక విగ్రహాన్ని పట్టణ ప్రధాన రహదారుల్లో మేళతాళాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు, బాణసంచాతో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సినిమా హాలు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గిరిజన సంప్రదాయ నృత్యాలతో పాటు తప్పెటగుళ్ల ప్రదర్శనతో ఊరేగించి నిమజ్జనం చేశారు. అలాగే డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంతో విద్యార్థులు ఉత్సాహంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.



నక్కలపుట్టులో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువకులు

'ఆరోగ్య కార్యకర్త తొలగింపు అన్యాయం'

పాడేరు రూరల్: అనారోగ్యంతో విద్యార్థి ఇంటి వద్ద మృతి చెందితే వసతిగృహ ఆరోగ్య కార్యకర్తను తొలగించడం అన్యాయమని సీఐటీయూ ప్రతినిధులు ఆర్.శంకరరావు, బీసీహెచ్.పడాల్ అన్నారు. జి.మాడుగుల మండలం గెమ్మెలి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థికి ఆటల్లో కాలు విరిగితే ఆరోగ్య కార్యకర్త తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, కాల్ సెంటర్‌కు సమాచారాన్ని అందించారని చెప్పారు. విద్యార్థిని ఇంటికి పంపించింది అధికారులైతే ఆరోగ్య కార్యకర్తను బాధ్యుల్ని చేయడం సరి కాదన్నారు. 11 ఏళ్లుగా పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తకు ఎటువంటి రిమార్కు లేదని, ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారులు గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు.

బాలికల రక్షణపై చైతన్యం రావాలి

ఆర్‌డీఎస్ఎస్ఎస్ డైరెక్టర్ మేరీ ఇవాంజిలిన్

చింతపల్లి: బాలికల రక్షణపై విద్యార్థుల్లో చైతన్యం రావాలని ఆర్‌డీఎస్ఎస్ఎస్ డైరెక్టర్ మేరీ ఇవాంజిలిన్ అన్నారు. చౌడపల్లి పాఠశాలలో షై చాయిస్ ఫౌండేషన్ ద్వారా బుధవారం బాలికల రక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముందుగా ప్రొజెక్టర్ ద్వారా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం బాలికలు ఏ విధంగా అపహరణకు గురవుతున్నారు..? అపరిచితులను ఎలా గుర్తించాలి..? వారు మభ్యపెడుతూ చెప్పే మాటలు, వేషధారణ తదితర అంశాలను వివరించారు. బాలికలకు అత్యవసర సేవలు అవసరమైతే చైల్డ్ లైన్ నంబర్ 1098, హెల్ప్‌లైన్ నంబర్ 18004198588కు కాల్ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లోచల చిట్టినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సుగుణమ్మకు సూపరింటెండెంట్‌గా పదోన్నతి



చింతపల్లి: సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెడ్‌నర్సు సుగుణమ్మకు వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆమెను జిల్లా ఈఎన్‌టీ ఆస్పత్రికి బదిలీ చేశారు. చింతపల్లి సీహెచ్‌సీలో రెండున్నరేళ్ల హెడ్‌నర్సుగా ఆదివాసీ రోగులకు మెరుగైన సేవలు అందించారు. ప్రభుత్వం పదోన్నతి కల్పించడంతో బుధవారం స్థానిక సీహెచ్‌సీ నుంచి రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

తాజంగిలో కొనసాగుతున్న బేస్ క్యాంప్

ఇంటింటికీ సేవలు అందిస్తున్న వైద్యులు



శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్య బృందం

చింతపల్లి: తాజంగి గ్రామంలో బేస్ క్యాంప్ కొనసాగుతోంది. ప్రత్యేక వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స అందిస్తున్నారు. లోతుగెడ్డ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ పర్యవేక్షణలో తాజంగి వైద్యాధికారి సతీష్‌కుమార్, వైద్య సిబ్బంది గ్రామంలో ఉంటూ రోగులకు సేవలు అందిస్తున్నారు. పలు వీధుల్లో వ్యాధులతో బాధ పడుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన చికిత్సలు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో వ్యాధులు అదుపులో ఉన్నాయని, వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారని సర్పంచ్ రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో నేతల రమణ, హెచ్‌వీ నడిగెట్ల ప్రకాష్, ఏఎన్ఎం ప్రమీళ, హెచ్‌ఎ మన్మధరావు పాల్గొన్నారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	అర్జున్ రెడ్డి
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	వివేకం

వ్యవసాయ పెట్టుబడులకు రుణం

పీఏసీఎస్ అధ్యక్షుడు మధు


సభ్య రైతులకు రుణాలు అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు మధు

మాడుగుల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులకు అదనపు ఫైనాన్స్ కింద రుణాలు అందించామని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ మధు, బోర ఈశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పాత, కొత్త రైతులకు పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో రూ.10లక్షల వరకు వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం రుణాలను అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘానికి ఎల్‌టీ ద్వారా పాడిగేదెల కొనుగోలుకు రూ.30 లక్షల రుణాలు అందిచేందుకుగాను అనుమతులు ఉన్నాయని, రుణాలు కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కౌలు రైతులను దృష్టిలో ఉంచుకొని వారికి కూడ రుణాలు అందించేందుకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే ఐదుగురు కౌలు రైతులు గ్రూపుగా ఏర్పడితే జాయింట్ లయబిలిటీ ద్వారా ఒక్కో గ్రూపునకు రూ.50వేల వరకూ తక్కువ వడ్డీతో రుణం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచి మేనేజర్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించాలి

ఆటోలతో ప్రదర్శన జరిపిన యూనియన్


ప్రదర్శన జరుపుతున్న రాజరాజేశ్వరీ యూనియన్ నేతలు

దేవరాపల్లి: అంతకంతకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ స్థానిక రాజరాజేశ్వరి ఆటో యూనియన్ ప్రతినిధులు గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆటోలతో ప్రదర్శన చేశారు.

బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎస్ఐ డి.ఈశ్వరరావు, లలితా నాయుడు, ఈర్నె రాకేష్, నరసింహమూర్తి, డీవీ శంకర్, వెంకటరావు, దేముడునాయుడు, చల్లా తాతయ్యలు, పేరినాయుడు, పలువురు ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్


అరెస్టయిన పేకాటరాయుళ్లు

కె.కోటపాడు : మండలంలోని గవరపాలెంలో గురువారం పేకాట ఆడుతున్న ఏడుగుర్ని అరెస్ట్ చేశామని ఎ.కోడూరు ఎస్ఐ ఎ.సత్యనారాయణ తెలిపారు.

గ్రామ శివార్లలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి అక్కడ పేకాట ఆడతున్న గ్రామానికి చెందిన సిమ్మ పైడితల్లి, సిమ్మ దేముడు, సిమ్మ మరిడియ్య, లెక్కల అప్పారావు, చింతల బలరాం, సిమ్మ గురువులు, పాతవలసకి చెందిన రావాడ నూకాలును అరెస్ట్ చేశామని తెలిపారు. వారి నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కోటపాడు విద్యార్థుల ప్రతిభ



విజేతలతో పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమార్ తదితరులు

కె.కోటపాడు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కె.కోటపాడు హైస్కూల్ విద్యార్థులు విజేతులుగా నిలిచారు. 9వ తరగతికి చెందిన ఆర్.దివ్య జిల్లాలో ప్రథమ స్థానంలో, 9వ తరగతికి చెందిన కె.ముత్యాలనాయుడు ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

ఘనంగా అన్న సమారాధన



మాడుగుల: మాడుగుల బస్టాండ్ సమీపంలోని దేవి ఆడిటోరియం ఎదురుగా మాడుగుల మోటార్‌వర్కర్స్ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన గావించారు. స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అదే విధంగా తుడుం వీధిలో నెలకొల్పిన వినాయక విగ్రహం నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

ఎ.కొత్తపల్లిలో సాక్షరభారతి ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు

దేవరాపల్లి: మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో సాక్షర భారతి కోఆర్డినేటర్లు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చదవాలి, సంతకాలు నేర్వాలి, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కో ఆర్టినేటర్ వీపీవీ త్రినాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆ దిశగా ప్రజలను గ్రామ కోఆర్టినేటర్లు చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు.

బడిఈడు పిల్లల సర్వేలో ఎంఈవో పాత్ర భేష్

సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి కితాబు


భవిత కేంద్రంలో బోధనోపకరణాలను పరిశీలిస్తున్న శ్రీదేవి

చీడికాడ: బడిఈడు పిల్లల సర్వేలో శతశాతం వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో చీడికాడ ఎంఈవో పాత్ర అభినందనీయమని ఆర్‌వీఎం ఐఈ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు.

బుధవారం ఆమె మండలంలోని తురువోలులో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన బోధనోపకరణాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఎంఈవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎంఈవో కె.గంగరాజు, సిబ్బంది ఎస్.దేముడు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడువాడలో పల్లెనిద్ర, మన గ్రామం-మన విశాఖ

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో గురువారం మన గ్రామం-మన విశాఖ, పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. మండల కో-ఆర్డినేటింగ్ అధికారి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజలు సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. అలాగే రాత్రికి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

చీడికాడలో....

చీడికాడ: మండల కేంద్రం చీడికాడలో పల్లెనిద్ర కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఆర్‌ఎం.గ్లాడ్స్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మన గ్రామం మన విశాఖ కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటారని, అలాగే సమావేశంలో ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆమె చెప్పారు.

ప్రజలు హాజరై తమ సమస్యలు విన్నవించుకోవాలని కోరారు. పల్లెనిద్రకు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నాలుగు నెలలుగా అందని విద్యుత్ బిల్లులు

అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాల ప్రజల ఆందోళన

దేవరాపల్లి: అనంతగిరి మండలానికి చెందిన నాలుగు గిరిజన పంచాయతీల్లో నాలుగు నెలలుగా విద్యుత్ బిల్లులు ఇవ్వడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. పినకోట, పెదకోట, జీనబాడు, కివర్ల పంచాయతీలో సుమారు 1600 వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 50 యూనిట్‌ల లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితం ప్రకటించింది. ఈ ప్రాంతంలో 15 నుంచి 20 లోపు యూనిట్‌లు వినియోగిస్తారు. నాలుగు నెలలుగా అధికారులు బిల్లులు ఇవ్వక పోవడంతో ఎప్పుడైనా ఒక్కసారిగా బిల్లులు చెల్లించమంటే తామెలా చెల్లించగలమని ఆయా పంచాయతీల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	అర్జున్ రెడ్డి
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	వివేకం

ప్రజాసాధికార సర్వే కేంద్రం ప్రారంభం



రోలుగుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసాధికార సర్వే కేంద్రాన్ని తహసీల్దార్ పెంటకోట అప్పల నాయుడు బుధవారం ప్రారంభించారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాసాధికార సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోని వారు తక్షణమే ఈ కేంద్రంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఆధార్, రేషన్‌కార్డులు, బ్యాంకు ఖాతా నకళ్లతో హాజరు కవాలని సూచించారు. కేంద్రం ఇన్‌చార్జిగా సీనియర్ అసిస్టెంట్ కె.ఆశోక్‌ను నియమించామన్నారు. ఇతర వివరాల కోసం 9491759192 ఫోన్ నంబరు ద్వారా సంప్రదించాలని కోరారు.

సహిత విద్య పిల్లలకు రవాణా ఖర్చులు

రోలుగుంట : సహిత కేంద్రానికి హాజరయ్యే విద్యార్థులకు ప్రయాణ భత్యం కింద నెలకు రూ.250 ఇస్తున్నట్లు సహిత విద్య ఉపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు స్థానిక సహిత కేంద్రంలో బుధవారం పలువురు దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపిస్ట్ రామ్‌జీ కిరణ్ ఫిజియోథెరపీ చేశారు. రోలుగుంట, కంచుగుమ్మల, శరభవరం గ్రామానికి చెందిన పిల్లలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిరోజూ లేదా ప్రతి వారమూ పిల్లల్ని సహిత కేంద్రాలకు తీసుకురావాలంటే ఖర్చుతో కూడుకున్న పనని, ఈ దృష్ట్యా పిల్లల తల్లిదండ్రులకు రవాణా ఖర్చుల నిమిత్తం నెలకు రూ.250 ఇస్తున్నట్లు తెలిపారు. నూరుశాతం అంగవైకల్యం ఉన్న పిల్లలకు ప్రత్యేకంగా మనిషిని నియమించేందుకు రూ.300 ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇటువంటి 42 మంది పిల్లలను గుర్తించామన్నారు.

మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

చోడవరం టౌన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ విజయవాడలో జరప తలపెట్టిన మిలియన్ మార్చ్‌కు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక బాలికోన్నత పాఠశాల మైదానంలో ఏపీటీఎఫ్ నాయకులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు వంటాకు గోవింద్, ప్రధాన కార్యదర్శి ఎం.మహాలక్ష్మి తదితరులు మాట్లాడుతూ, పాతపెన్షన్ విధానం పునరుద్ధరణకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల మైదానం వరకూ సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటలకు జరగబోయే మిలియన్ మార్చ్‌ను లక్ష గొంతుకుల నినాదంతో చేపడుతున్నామని అన్నారు. బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.కృష్ణకుమారి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టి.రాజ్‌కిరణ్, చిరంజీవి, నగేష్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పొలం పిలుస్తోంది

చోడవరం రూరల్: వరిలో ఆకుముడత తెగులు రాకుండా ఉండేందుకు నారు చిగుళ్లను తుంచి నాటాలని మండల వ్యవసాయ అధికారి ఈఆర్‌ఏ శ్రీనివాస్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్ష్మీపురం, దామునాపల్లి గ్రామాల్లో రైతుల పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వరి ఆకు వేసేటప్పుడు ఒక చదరపు మీటరుకు దీర్ఘకాలిక రకాలు అయితే 33 కుదుర్లు ఉండేలా నాటుకోవాలని, ప్రధాన పొలంలో ద్రవ జీవామృతం 15రోజులకు ఒకసారి పొలానికి అందించాలని సూచించారు. ఎంపీఈవో ఎ.జ్యోతి, ఆర్.తేజశ్రీ, ఉద్యానశాఖ ఎంపీఈవో భవానీ, గోపి పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- సహితవిద్య సమన్వయ అధికారి శ్రీదేవి
- ఆకట్టుకున్న బోధనోపకరణాల ప్రదర్శన



బోధనోపకరణాల ప్రదర్శన తిలకిస్తున్న ఎంపీపీ గూనూరు కొండతల్లి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సహితవిద్య సమన్వయ అధికారిణి శ్రీదేవి

చోడవరం టౌన్: భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహితవిద్య సమన్వయకర్త ఎన్.శ్రీదేవి అన్నారు. పట్టణంలోని విద్యావనరుల కేంద్రం వద్ద గల భవిత కేంద్రంలో బుధవారం ప్రత్యేక బోధనోపకరణాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ గూనూరు కొండతల్లి, సర్పంచ్ దొమ్మేసి అప్పలనర్స, ఎంపీటీసీ సభ్యురాలు మారెడుపూడి రమాదేవి, ఎంపీడీవో జీవీ చిట్టిరాజు, ఎంఈవో పి.అచ్యుతరావు తదితరులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీదేవి మాట్లాడుతూ జిల్లాలో 43 భవిత కేంద్రాలు ఉండగా వాటిలో 16 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయని, మరో 27 భవిత కేంద్రాలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నామని అన్నారు. జిల్లావ్యాప్తంగా 21 రకాల వైకల్యాలకు గురైన 18 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించి వారిని దైనందిన జీవితంలో సొంతంగా పనులు నిర్వహించుకునేలా తర్ఫీదునివ్వడంతో పాటు వారిని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులతో మమేకమయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తీవ్ర బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలకు ప్రతి శనివారమూ వారి ఇళ్లకు వెళ్లి తర్ఫీదునిస్తున్నామన్నారు. ఫిజియోథెరపీ అవసరమైన వారికి ప్రతి సోమవారమూ భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్నామని, త్వరలోనే స్పీచ్ థెరపిస్ట్, సైకాలజిస్ట్‌ల ద్వారా సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలను త్వరలోనే అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. అంతకుముందు దివ్యాంగుల బోధనోపకరణాల ప్రదర్శన తిలకించారు. బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.కృష్ణకుమారి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ రమణ, దేముడు, భవిత కేంద్రం రిసోర్సు ఉపాధ్యాయులు బీఏ రాజు, సరస్వతీ దేవి, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాల్గొన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులు

ఖాళీ పోస్టుల భర్తీ కోరుతూ సీపీఎం ధర్నా



రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చోడవరంటౌన్: ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం సీపీఎం నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా రైతులకు పండించిన పంటలకు పెట్టుబడిపై 50శాతం అదనంగా గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత వరకూ ఆ ప్రస్తావనే తీసుకురాలేదని అన్నారు. అలాగే తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం డివిజన్ కన్వీనర్ గండి నాయనిబాబు, మండల కార్యదర్శి నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల నిర్వాహకులకు బైండోవర్

బుచ్చెయ్యపేట : మండలంలో వడ్డాది, పొట్టిదొరపాలెం, రాజుపాలెం గ్రామాల్లో బెల్ట్‌షాపులు ద్వారా మద్యాన్ని విక్రయిస్తున్న ముగ్గుర్ని బుధవారం చోడవరం ఎక్సైజ్ ఎస్ఐ అనిల్‌కుమార్ అరెస్ట్ చేసి మండల మెజిస్ట్రేట్ కేవీవి శివ ఎదుట హాజరుపరిచారు. ఇకపై మద్యం అమ్మకాలు చేపట్టబోమని బి.అర్జున, జి.లక్ష్మణరావు, కె.దేముళ్లు నుంచి బాండ్ పేపరుపై రాతపూర్వకంగా హామీ తీసుకుని తొలి తప్పుగా భావించి శివ వారిని విడిచిపెట్టారు.

విద్యాసామర్థ్యం పెంపునకు కృషిచేయాలి

ఉపాధ్యాయులకు ఎంఈవో అప్పారావు సూచన

రావికమతం: బోధనాభ్యాసాలు, విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. మండలంలోని టి.అర్జాపురం మోడల్ ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించినప్పుడే వారిలో సామర్థ్యం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం ఏర్పడే విధంగా విద్యార్థును తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు వారికి ఏయే అంశాలపై ఆసక్తి ఉందో వాటిలో కూడా అవగాహన కల్పించాలన్నారు. విందాం-నేర్చుకుందాం రేడియో పాఠాలను ప్రతిరోజూ తప్పనిసరిగా వినిపించాలని సూచించారు. అంతకుముందు రికార్డులను పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం అమలు తీరు పరిశీలించారు. అలాగే విందాం నేర్చుకుందాం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రేడియోపాఠం వినిపించడంపై కూడా ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి

చోడవరం కోర్టు సీనియర్ సివిల్‌జడ్జి శివరాంప్రసాద్

చోడవరంటౌన్: కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని చోడవరం మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, చోడవరం కోర్టు సీనియర్ సివిల్‌జడ్జి పి.శివరాంప్రసాద్ అన్నారు. స్థానిక కోర్టులో పోలీస్, ఎక్సైజ్, బ్యాంకు అధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సెప్టెంబర్ 9న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై చర్చించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రకాష్, చోడవరం, మాడుగుల నియోజకవర్గ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి శివరాంప్రసాద్

95 శాతం వరినాట్లు

బుచ్చెయ్యపేట : వారాంతంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పెద్దేరు, బొడ్డేరు, తాచేరు నదులతో పాటు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పటి వరకూ 95 శాతం వరినాట్లు జరిగాయి. వరి సాధారణ విస్తీర్ణం 2728 హెక్టార్లు కాగా బుధవారానికి 2500 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. వడ్డాది, విజయరామరాజుపేట, మంగళాపురం, లోపూడి, ఎల్‌బీపీ.అగ్రహారం, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, చినఅప్పన్నపాలెం, కోమళ్లపూడి, గంటికొర్లాం, భట్లోవ, నిమ్మలోవ, లూలూరు రెవెన్యూ గ్రామాల్లో శతశాతం వరినాట్లు జరగగా, మెట్ట ప్రాంతంలో 90 శాతం మేర వరినాట్లు జరిగాయి. మరో మూడు రోజుల్లో శతశాతం నాట్లు పూర్తికాగలవని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



బంగారుమెట్టలో వరి నారు తీస్తున్న దృశ్యం

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

వాహనచోదకులు హెల్మెట్ ధారణ తప్పనిసరి

- అర్హులైన యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు వుండాలి
- రిజిస్ట్రేషన్ లేని వాహన చోదకులకు భారీగా జరిమానా
- అన్ని వర్గాల ప్రజలు, సంఘాలతో సమావేశం
- శాంతిభద్రతలకు భంగం కలిగించే 25 మంది గుర్తింపు: ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి

నర్సీపట్నం: ద్విచక్ర వాహనచోదకుడు విధిగా హెల్మెట్ ధరించాలని నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హెల్మెట్ ధరించని వారిపై విరివిగా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. పట్టణంలోకి వచ్చే రూట్‌లతో పాటు పట్టణ పరిధిలో కూడా విధిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్. ధరించాలన్నారు.వాహన డ్రైవింగ్ వచ్చిన అర్హులైన యువత విధిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు. రాష్ డ్రైవింగ్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను నడపడం,



నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి

స్పోర్ట్స్ బైక్‌లను పరిమితికి మించిన వేగంతో నడిపే వారిపై భారీగా జరిమానా విధిస్తున్నామన్నారు. ప్రజలు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు అవసరమైన ప్రచార బోర్డులను నర్సీపట్నం పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నామన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో గల 27వార్డుల్లో పోలీస్ సిబ్బంది సర్వే జరిపి సంఘ విద్రోహ శక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగించేవారు తరచుగా ఆయా ప్రాంతాల్లో గొడవలు, కొట్లాటలకు వెళ్లే వారిని గుర్తించే ప్రక్రియ చేపడుతున్నారని ఏఎస్పీ అన్నారు. ఇప్పటివరకూ 25 మందిని గుర్తించామని, అటువంటి వారి తల్లిదండ్రుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నామన్నారు.

వివిధ సంఘాలు, విద్యా సంస్థలతో సమావేశం

పట్టణాన్ని శతశాతం హెల్మెట్ వినియోగ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ట్రాఫిక్ నిబంధనలు అమలుకు పోలీస్‌శాఖకు తగిన సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరేందుకు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపార, ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులతో దశలవారీగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు తమ సహాయ సహకారాలు, సలహాలు, సూచనలు అందజేయాలని ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి కోరారు.

నేడు ఏఎంసీ చైర్మన్ అప్పలనాయుడు కార్యాలయానికి హాజరు

వచ్చేనెల 3న నర్సీపట్నంలో ప్రమాణస్వీకారం



గొలుగొండ: నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అడిగర్ల అప్పలనాయుడు గురువారం కార్యాలయానికి హాజరుకానున్నారు. గొలుగొండ మండలానికి చెందిన ఈయన్ని చైర్మన్‌గా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించిన విషయం విదితమే. వచ్చేనెల 3వ తేదీన నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి చోడవరం, ఎలమంచిలి ఎమ్మెల్యేలతో పాటు అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాసరావు, అన్ని మండలాల నాయకులు హాజరుకానున్నారు.

చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ

నాతవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో టి.అమృత్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన ములగపూడి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు వేసే డ్రాయింగ్‌ను, ఇతర అంశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలో గన్నవరం, ములగపూడి పాఠశాలలను ఆనందలహరి అభ్యసన కార్యక్రమానికి ఎంపిక చేశారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, కె.నానాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయండి

నాతవరం: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి ఆయాశాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ మిషాసింగ్ కోరారు. బుధవారం సాయంత్రం ఆమె ఏపీడీ శ్రీనివాసరావుతో కలిసి మండలంలోగల ఎం.బి.పట్నంలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామస్థులతో సమావేశమై ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకుని పారిశుధ్య మెరుగునకు సహకరించాలన్నారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు,పల్లి బాపన్ననాయుడు, ఉప సర్పంచ్ కిల్లాడ నూకరాజు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను ఆదుకునేందుకు చర్యలు

నర్సీపట్నం టౌన్: వీధి వ్యాపారులను ఆర్థికంగా ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నామని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు. బుధవారం ఆమె పెదబొడ్డేపల్లిలోని మెప్మా కార్యాలయంలో పట్టణంలోని 39 స్లమ్‌లెవల్ సమాఖ్యల రిసోర్స్‌పర్సన్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయే ప్రాంతాల్లో వ్యాపారం చేస్తే అభివృద్ధి ఉంటుందో గుర్తించేందుకు పట్టణంలో జోన్‌లుగా విభజించి మ్యాపింగ్ చేయించే పనులు చేపడతామన్నారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ సురేంద్రతో చర్చిస్తామన్నారు. ఏవో తిరుపతయ్య, రాయ్, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ రమ్యకృష్ణ, సీవోలు తిరుపతి రవి, శ్యామ్‌సన్, రాజు, డీఈవో మురళి, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధి వినాయక ఆలయ రజతోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న అయ్యన్న తనయుడు రాజేష్

నర్సీపట్నం రూరల్: మండలంలోని నీలంపేటలో అభయాంజనేయ యూత్ సంఘం ఆధ్వర్యంలో సిద్ధి వినాయక ఆలయ రజతోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి అయ్యన్నపాత్రుడు సహాయ సహకారాలతో మాజీ సర్పంచ్ బోళెంరాజుబాబు, రాజేశ్వరి దంపతులు ఈఆలయాన్ని నిర్మించారు. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అన్న సమారాధన చేశారు. ఎంపీపీ సుకల రమణమ్మ, మంత్రి అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్, ఎంపీటీసీ సభ్యురాలు బోళెం రాజేశ్వరి, బోళెం వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం గ్రామంలో వినాయక నిమజ్జనం చేశారు.

ధర్మసాగరంలో అభివృద్ధి పనులు ట్రైనీ కలెక్టర్ పరిశీలన

నర్సీపట్నం రూరల్: మండలంలోని ధర్మసాగరంలో అభివృద్ధి పనులను ట్రైనీ కలెక్టర్ మిషాసింగ్ బుధవారం పరిశీలించారు. గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్లు, ఎన్టీఆర్ గృహాల నిర్మాణం, సుజల స్రవంతి ప్రాజెక్ట్ నిర్మాణం, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన జీడితోటల పెంపకం, వర్మీ కంపోస్ట్ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గ్రామస్థులతో చర్చించి ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీపీ సుకల రమణమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ సుకల రమణమ్మ, గ్రామ పెద్ద సుకల అప్పలనాయుడు,ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో రమణ బాబు, ఏపీవో సూర్యమణి, పంచాయతీ కార్యదర్శి పి.రాజశేఖర్ పాల్గొన్నారు.



జీడితోటలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మిషా సింగ్

ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

నర్సీపట్నం టౌన్: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని నర్సీపట్నం టౌన్ సీఐ ఎస్.సింహాద్రినాయుడు అన్నారు. బుధవారం పట్టణంలోని రిషి డిగ్రీ కళాశాలలో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా ఐక్యతాభావంతో మెలగాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.ఎన్.అప్పన్న, రిషి కళాశాల కరస్పాండెంట్ కోన సతీష్, ప్రిన్సిపాల్ రమేష్, డైరెక్టర్ నాయుడు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు రుణాలు అందించాలి

నర్సీపట్నం రూరల్: విశ్వబ్రాహ్మణులకు బ్యాంకుల లింకేజీతో సంబంధం లేకుండా నేరుగా బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పెదపాటి గోవిందరావు కోరారు. బుధవారం సాయంత్రం విశ్వబ్రాహ్మణుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో నంబర్ 18ని విడుదల చేయడం అభినందనీయమన్నారు.నర్సీపట్నం కార్పెంటర్ యూనియన్ అధ్యక్షుడు సత్తిరాజు, రాము, కన్నబాబు, ప్రకాష్‌రావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కృష్ణాదేవిపేట: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కె.రామశ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం గొలుగొండ మండలం చోద్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం జూనియర్ సివిల్‌జడ్జిలు జి.గోపాలకృష్ణ, వి.యజ్ఞనారాయణ, నర్సీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నూరు శ్రీరామమూర్తి, మాజీ అధ్యక్షుడు చింతల ప్రకాష్, కొయ్యూరు సీఐ పీవీ ఉదయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ కోప్పోజు లక్ష్మి, ఉపసర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్, శేషు పాల్గొన్నారు.

నేడు మొండికండిలో మన ఊరు-మన విశాఖ

నర్సీపట్నం రూరల్: మండలంలోని వేములపూడి పంచాయతీ శివారు మొండికండిలో గురువారం మన ఊరు -మన విశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో బీహెచ్‌వి రమణబాబు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సీహెచ్ మహలక్ష్మి, ఎంపీపీ సుకల రమణమ్మ పాల్గొంటారని ఆయన కోరారు. అందువల్ల మండలస్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పోలీస్ సిబ్బందికి ఏఎస్పీ రివార్డులు



పోలీసులకు రివార్డులు అందజేస్తున్న ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి

నర్సీపట్నం : నర్సీపట్నం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోగల నాతవరం, నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన పోలీస్ సిబ్బంది బుధవారం ఆరుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేయడంతో వారికి నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి నగదు రివార్డులు అందజేశారు. కానిస్టేబుళ్లు జి.శ్రీను, ఎం.శ్రీను, హోంగార్డు కె.శ్రీను, కానిస్టేబుళ్లు కె.వరహాలు (నాతవరం), బి.నాని (గొలగొండ)లకు ఏఎస్పీ రివార్డులను అందజేశారు.

వెన్నెలపాలెంలో అట్రాసిటీ కేసు విచారణ

నాతవరం: మర్రిపాలెం పంచాయతీ వెన్నలపాలెంలో బుధవారం నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి అట్రాసిటీ కేసుకు సంబంధించి సాక్షులను విచారించారు. వెన్నలపాలెంకు చెందిన బంగారుమణితో పాటు కొంతమంది ఇదే గ్రామానికి చెందిన మాకిరెడ్డి మురళీని కులంపేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్పీ రస్తోగి, నాతవరం ఎస్ఐ అశోక్‌కుమార్ వెన్నలపాలెం వెళ్లి అట్రాసిటీ కేసుకు సంబంధించి సాక్షులను విచారించారు.ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ విచారణలో వాస్తవమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

నర్సీపట్నం: నూకాంబిక నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం నర్సీపట్నంలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా రాజాన అప్పలరాజు,ఉపాధ్యక్షుడిగా టి.తాతబాబు, కార్యదర్శిగా సీలారపు రమణ, గౌరవాధ్యక్షుడిగా శవరపు రమణ, జాయింట్ సెక్రటరీగా జి. నాగరాజులు ఎన్నికయ్యారన్నారు.

ఎన్నికైన సభ్యులంతా సంఘ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	:	08854 254044
ఎంపీడీవో కార్యాలయం	:	9441953611
తహసీల్దార్ కార్యాలయం	:	9441836336
వెలుగు ఏపీఎం	:	9866074067

సినిమా గైడ్

గౌతమ్ : వివేకం
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీ (ఏసీ) : ఫిదా

పంట భూములకు ముంపు

చిన నర్సాపురం రైతుల ఆందోళన

పాయకరావుపేట : మండలంలోని చిన నర్సాపురంలో సుమారు 70 ఎకరాల పంట పొలాలు ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాండవ నది ఎగువ ప్రాంతంలో వర్షాలు పడడంతో నీటి ప్రవాహం పెరిగింది. అలాగే తాండవ నదిపై ఉన్న ముఠా ఆనకట్ట నుంచి కాలువ ద్వారా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద రాంభద్రపురం నుంచి చిన నర్సాపురం రహదారి నిర్మిస్తున్న కాంట్రాక్టర్ మట్టిని కాలువలో వేయడంతో నీరు పంట పొలాల్లోకి చేరుతోంది. దీనికితోడు పాయకరాణివారి చెరువు కాలువలో నుంచి అధికంగా వస్తున్న నీరు కూడా చిన నర్సాపురం వద్ద వ్యవసాయ భూముల్లోకి చేరుతుండడంతో సుమారు 70 ఎకరాల్లో నారు మడులు, వరి నాట్లు వేసిన భూములు ముంపునకు గురయ్యాయి. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ కాలువలోని మట్టిని తొలగించి తమ భూముల్లో నీటిని వెంటనే తగ్గించకుంటే ఖరీఫ్‌లో వేసిన నాట్లు, నారుమళ్ళు కుళ్లిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి పంట కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న మట్టిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.


పొలాల్లోకి చేరిన నీరు

పొలం గట్లు శుభ్రం చేసుకోవాలి

- లేకుంటే పాముపొడ తెగులు వ్యాప్తి
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- ఎలమంచి ఏడీ మాలకొండయ్య

ఎస్.రాయవరం : పొలం గట్లు శుభ్రం చేసుకోకపోతే పాము పొడ తెగులు వచ్చే అవకాశం ఉందని ఎలమంచిలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు డి.మాలకొండయ్య సూచించారు. ఎస్.రాయవరం, లింగరాజుపాలెం తదితర గ్రామాల్లో పాము పొడ తెగులు సోకినట్టు గుర్తించారు. బుధవారం ఏవో ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ గ్రామాల్లోని వరి పొలాలను వ్యవసాయాధికారుల బృందం పరిశీలించింది. ప్రస్తుతం పొలాల గట్లపై ఈ తెగులు ఉందని, దీనిని సకాలంలో నివారించకపోతే నేరుగా వరి పంటకు వ్యాపిస్తుందన్నారు. పొలం గట్ల మీద ఉన్న కలుపుని తీసి గట్లను శుభ్రంగా చేసుకోవాలన్నారు. లేకుంటే దుబ్బు చేసే దశలో వరికి పొడ తెగులు లేక మాగుడు తెగులు సోకి ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయని ఏవో ఉమా ప్రసాద్ అన్నారు. గట్లపై వున్న పాము పొడ మచ్చ తెగులు పంటలపై సోకకుండా వాటిని పూర్తిగా తొలగించాలన్నారు. అనంతరం కంది విత్తనాలు, రాయితీపై ఆయిల్ ఇంజన్లు అందజేశారు. ఏఈవోలు శ్రీనివాస్, నూకరాజు, రైతులు పాల్గొన్నారు.


ఆయిల్ ఇంజిన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎనిమిదో తేదీ నుంచి పాఠశాలల్లో బయోమెట్రిక్

ఎంఈఓ కె.ఎన్.గాంధీ

పాయకరావుపేట : మండలంలోని ఎంపిక చేసిన 36 పాఠశాలల్లో వచ్చే నెల 8వ తేదీ నుంచి బయోమెట్రిక్ విధానం అమలులోకి రానుందని ఎంఈఓ కె.ఎన్.గాంధీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది మండలంలో 18 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం బయోమెట్రిక్ మెషిన్లు సరఫరా చేసి ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేసిందని అన్నారు. వివిధ కారణాలతో పనిచేయకపోవడంతో ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి బయోమెట్రిక్ విధానం అమలుకు నోచుకోలేదన్నారు. పాడైన బయోమెట్రిక్ మెషిన్లను స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి 36 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. బయోమెట్రిక్ విధానం అమలుతో పాఠశాల పనితీరును జిల్లా ఉన్నతాధికారులతోపాటు, సీఎం డ్యాష్ బోర్డులో చూసే అవకాశం ఉందన్నారు.

విద్యార్థులకు విజ్ఞాన పోటీలు

గ్రంథాలయాధికారి తిరుమలకుమారి



పాయకరావుపేట : జాతీయ గ్రంథాలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల కు విజ్ఞాన పోటీలు నిర్వహించనున్నట్టు స్థానిక శాఖా గ్రంథాలయాధికారి జి.తిరుమలకుమారి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాయకరావుపేట మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని అన్నారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీ విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, ప్రీలోడెడ్ టాబ్లెట్ పీసీలను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీను ఉన్నారు.

అధ్వానంగా ఉపమాక ఆలయ రహదారి

నక్కపల్లి : మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయానికి సమీపాన ఉన్న రహదారి అధ్వానంగా ఉంది. ఈ దారిలో గోశాల, వాటర్ ట్యాంకు, పువ్వుల తోట ఉన్నాయి. అలాగే చందనాడ, ఎన్.నర్సాపురం గ్రామస్థులు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. ఏ మాత్రం వర్షం పడినా రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతుంది. అలాగే బురద పేరుకుపోతుంది. సుమారు నాలుగైదు రోజులు ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా రోడ్డుకు ఇరువైపులా అపరిశుభ్ర వాతావరణం వుంది. కనీసం టీటీడీ అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. కళ్లముందరే అనేక వ్యర్థాలు పేరుకుపోయినా వాటిని తొలగించేందుకు ఆలయ అధికారులు శ్రద్ధ చూపడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీని వల్ల ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు ఈ ప్రాంతాన్ని శుభ్రం చేసి వర్షపునీరు నిల్వవుండకుండా చూడాలని, రహదారికి ఇరువైపులా పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన నీరు

విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలి

పాయకరావుపేట : స్థానిక వీవర్స్ కాలనీలో ఒక వైపునకు ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరి చేయాని ఆ వీధి నివాసులు కోరుతున్నారు. హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్న స్తంభం ఒక వైపునకు ఒరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం చిన్నపిల్లలు అదే దారి రాకపోకలు చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న గణేష్ విగ్రహాలు


ఎస్.నర్సాపురంలోని శివుడి రూపంలో గణపతి


నక్కపల్లి మండలం బండారుపేటలో ఏర్పాటు చేసిన జల వినాయకుడు

పాయకరావుపేట/నక్కపల్లి : పాయకరావుపేట మండలంలోని ఎస్.నర్సాపురంలో శ్రీవరసిద్ధి వినాయక సంఘం సభ్యులు గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన శివుడి రూపంలో గణపతి విగ్రహం. నక్కపల్లి మండలం బండారుపేటలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆ కాలనీ యువకులంతా కలిసి సుమారు ఏడు అడుగుల మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహం అడుగుభాగాన వాటర్‌ఫాల్‌ను తలపించే రీతిలో సెట్టింగ్ చేశారు. అందులో వరి దుబ్బులతోపాటు చేపలు, తాబేలు కూడా విడిచి పెట్టారు. దీన్ని పిల్లలు ఆసక్తికరంగా తిలకిస్తున్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు జన్మదినం


చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటవురట్ల: మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ రాజు జన్మదిన వేడుకలను కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం కోటవురట్ల మండలం తంగేడులో ఆయన ఇంటి వద్ద డీవీ యువసేన ఆధ్వర్యంలో పుట్టినరోజు కేక్‌ను సాగి రామచంద్రరాజు, కట్ చేశారు. అనంతరరం 1500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ సాగి రామభద్రరాజు, చంటిబాబు రాజు, ఎంపీపీ అయ్యిపురెడ్డి వరహాలమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ కిల్లాడ వెంకటేశ్వర సాయి, షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ పెట్లరాంబాబు, చామంతల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగి ఈశ్వరరావుకు సన్మానం


ఈశ్వరరావును సన్మానిస్తున్న పీడీ చిన్నమ్మయ్యదేవి

కోటవురట్ల: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఈశ్వరరావుకు అధికారులు, సిబ్బంది బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ చిన్నమ్మయ్య దేవి మాట్లాడుతూ క్రమశిక్షణతో పనిచేసిన ఉద్యోగికి నిరంతరం గుర్తింపు ఉంటుందన్నారు. సర్వీసులో ఎటువంటి రిమార్కు లేకుండా రిటైర్డు అయ్యే ఉద్యోగులు జీవితాంతం ప్రశాంతంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఇందిరా దేవి, ప్రాజెక్టు సిబ్బంది తదితరులు ఈశ్వరరావు దంపతులను సత్కరించారు.

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - లై
తులసీ చిత్రమందిర్ - నేనే రాజు నేనే మంత్రి
పరమేశ్వరి - జయ జానకి నాయక

ఎన్‌టీఆర్ గృహ నిర్మాణాలకు స్పందన

- భారీగా దరఖాస్తులు
- ఉత్సాహం చూపుతున్న ప్రజలు

ఎలమంచిలి : పట్టణంలోని పేదల సొంతింటి కలను సాకారం చేసే దశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకానికి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. పట్టణంలోని పేదలకు జి ప్లస్ 3 పద్ధతిలో ఇళ్లు నిర్మించనున్నారు. లబ్ధిదారుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 లక్షల రాయితీ ఇస్తుండగా మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. లబ్ధిదారులు ప్రతి నెలా బ్యాంకులకు ఈ మొత్తాన్ని చెల్లించేలా పథకాన్ని రూపొందించారు. మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి నిరుపేదలకు ప్రభుత్వం నుంచి సొంతింటి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో ఏళ్ల తరబడి ఎదురుచూసేవారు. ఎట్టకేలకు టీడీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గత నెలలో మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులతో ఛైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ సత్యనారాయణ అవగాహన సదస్సులు నిర్వహించారు. పథకం గురించి వారికి పూర్తిగా వివరించారు. ఇంతవరకూ నిరుపేదల్లో కొందరు ఇంటి నిర్మాణం కోసం అవసరమైన స్థలాల కోసం కొందరు, పక్కా గృహాల నిర్మాణానికి మరికొందరు పాలకులు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎట్టకేలకు పట్టణానికి జిప్లస్ 3 గృహ సముదాయం పథకం మంజూరైంది. అయితే గతంలోనే ఇళ్ల కోసం రెండు వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అందులో అసలైన నిరుపేదల జాబితాను పాలకులు, అధికారులు తయారుచేశారు. మూడు అంతస్తులలో కేటగిరి 1లో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక రకం, కేటిగిరీ 2లో 367 చ. అ విస్తీర్ణంలో మరో రకం, కేటగిరీ 3లో 430 చ.అ విస్తీర్ణంలో మూడో రకం కింద ఇళ్లు నిర్మించనున్నారు. ప్రతి గృహా నికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3లక్షల రూపాయలు రాయితీ అంది వ్వడమే కాకుండా మిగిలిన రుణాన్ని బ్యాంకుల నుంచి ఇచ్చేలా ప్రణాళిక రూ పొందించారు. దీంతో ఏ తరహా గృహం కావాలో నిర్ణయించుకునేఅవకాశాన్ని లబ్ధిదారుల ఆర్థిక స్థోమత బట్టి ఉంటుంది. అధిక శాతం మంది 2, 3 కేటగిరీలకు ప్రాధాన్యమిస్తున్నారు.

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలి

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

ఇంటర్వ్యూ



ఎలమంచిలి : పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ వేగి సత్య నారాయణ అన్నారు. ముఖ్యంగా బహిరంగ మల విసర్జన అరికట్టి పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న : వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుంది. దీని పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : పట్టణ జనాభాకు తగ్గట్టుగా తాగునీటి వనరులు లేకపోవడంతో ఈ సమస్య ఎదురవుతుంది. రూ.84 కోట్లతో మెగా రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి ప్రభుత్వానికి అంచనాలు తయారు చేసి నివేదిక అందించాం. కేంద్రం నుంచి అనుమతి వచ్చినా..అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇంకా రాలేదు. ప్రస్తుతం ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న : బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : మున్సిపాలిటీలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు లక్ష్యానికి మించి నిర్మించేలా చూస్తున్నాం. అలాగే ఎక్కడికక్కడే సామూహిక మరుగుదొడ్ల నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

ప్రశ్న : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులేమిటి?

జవాబు : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రూ.25 కోట్ల 13వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ పనులు చేపట్టాం. ప్రస్తుతం రూ. 3 కోట్ల 14వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

ప్రశ్న : కాలనీల ముంపు నివారణకు ఏయే చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : ముంపు కాలనీలను గుర్తించాం.వాటిల్లో వరద నీరు చేరకుండా రైల్వే అధికారుల ద్వారా రెండు కోట్ల రూపాయలతో కాలువ పనులు జరుగుతున్నాయి. అలాగే స్థానికంగా ఉన్న కాలువలను ఆధునికీకరించాల్సి ఉంది.

ప్రశ్న : యానాద్రి కాలువ ఆధునికీకరణ పనులు ఎప్పటికి జరుగుతాయి?

జవాబు : కాలువ ఆధునికీకరణకు రూ. 2 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం. ఇప్పటికే కాలువకి ఇరువైపుల ఉన్న ఆక్రమణలు తొలగించే ప్రక్రియ చేపట్టాం.

ప్రశ్న : కోతుల సమస్య పరిష్కరించడం లేదు?

జవాబు : కోతుల సమస్య పరిష్కారానికి ప్రాథమికంగా అంచనాలు తయారు చేశాం.వాటిని పట్టి అటవీ ప్రాంతానికి తరలించడానికి ఢిల్లీ నుంచి బృందం రావాల్సి ఉంది.

ప్రశ్న : పందుల సంచారం తీవ్రతరంగా ఉంది ? వాటిని నివారించడం లేదు?

జవాబు : పందుల పెంపకందారులతో ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి, హెచ్చరించాం. మున్సిపల్ సిబ్బందితో పందుల పట్టివేత చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను పూర్తిస్థాయిలో నివారించడం లేదు?

జవాబు : ఇప్పటికే పలుమార్లు దుకాణాలపై దాడులు చేసి వ్యాపారులను హెచ్చరించాం. భవిష్యత్తులో దీనిపై పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తాం.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

ఎలమంచిలి రూరల్ :ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పింఛన్ ఉద్యోగుల సంఘం ఎలమంచిలి మండల కన్వీనర్ జి. ప్రకాశరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 1వ తేదీన విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌కి ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. 2004 తరువాత ప్రభుత్వం పాత పింఛన్ విధానం రద్దు చేసి, సీపీఎస్ విధానం పెట్టిందని, ఇది ఉద్యోగులకు తీరని నష్టాన్ని కలుగజేస్తుందన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మానం పొందిన వారితో ఉపాధ్యాయులు

రాంబిల్లి : రాంబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన 17 మంది ఉపాధ్యాయులను స్థానిక ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం చిరంజీవిశర్మతో పాటు 16 మందిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుత హెచ్‌ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతతో పని చేసిన ఉపాధ్యాయులు బదిలీపై ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో గౌరవ మర్యాదలు ఉంటాయన్నారు. అనంతరం కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను కూడా ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ రమేష్, సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయిని భవానీ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కూర్మావతార వినాయకుడు



అచ్యుతాపురం : పూడిమడక మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన కూర్మావతార వినాయకుడు భక్తులను ఆకట్టుకుంటోంది. పంచాయతీ శివారు కొండపాలేనికి చెందిన చెకోవీర యూత్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీరానికి వచ్చే పర్యాటకులు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

బ్యాంకు ఎదుట డ్వాక్రా మహిళల ధర్నా

మునగపాక : మునగపాక ఎస్‌బీఐలో అమ్మా భగవాన్ డ్వాక్రా గ్రూపునకు సంబంధించిన లక్షా 18 వేల రూపాయలతో ఖాతా ముగించి, నగదు ఏం చేశారో బ్యాంకు సిబ్బంది చెప్పకపోవడంతో మహిళలు ధర్నాకి దిగారు. అమ్మా భగవాన్ సేవింగ్ ఖాతాలో ఉన్న లక్షా 18 వేల రూపాయలు ఏమయ్యాయి, తమ ఖాతాను అనుమతి లేకుండా ఎందుకు ముగించారని వారు సిబ్బందిని నిలదీశారు. దీనికి సిబ్బంది సమాధానమిస్తూ 60 వేల రూపాయలను అప్పు ఖాతాకు జమ చేశామని, మిగతా సొమ్మును త్వరలోనే జమ చేస్తామని చెప్పారు. ఇప్పుడు ఆ సొమ్ము ఎక్కడుందని మహిళలు ప్రశ్నించగా సిబ్బంది సరైన సమాధానం చెప్పలేక పోయారు. పాత బ్యాంకు ఖాతాను రద్దు చేయడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పోతాయి కదా అని ప్రశ్నించగా సమాధానం చెప్పలేక సిబ్బంది తప్పించుకునే ధోరణిలో మాట్లాడారు. పూర్తి వివరాలకు బ్యాంకు మేనేజరని అడగాలని, ఆమె సెలవులో ఉన్నందున తరువాత రావాలని నిర్లక్ష్యంగా చెప్పడంతో మహిళలు కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మా భగవాన్ గ్రూపు సభ్యులు దాడి కుమారి, కోడూరి సరోజిని, టెక్కలి అప్పలనర్స, కోడూరి లక్ష్మి, దాడి పద్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ వద్ద మహిళల నిరసన

యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఎలమంచిలి : పట్టణంలోని శ్రీ చైతన్య స్కూలు విద్యార్థులు బుధవారం ఎమ్‌పవర్ ఇండియా నినాదంతో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి రాజు మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అన్నారు.యువత శక్తి సామర్థ్యాలను దేశసేవకు వినియోగించాలన్నారు. స్వదేశీ వస్తు స్వీకరణ జరిగినట్లైతే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగువుతుందన్నారు.అనంతరం స్కూలు ప్రతినిధులు దేశానికి యువత శక్తి సామర్థ్యాలపై వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశం స్వయం ప్రతిపత్తి సాధించి అన్ని రంగాల్లోనూ ముందడుగు వేయాలని కోరారు.కార్యక్రమంలో స్కూల్ రీజనల్ ఇన్‌చార్జ్ ఎం. రమణ, ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ ఋషికేష్ దాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి రాజు



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

రాంబిల్లి : ప్రభుత్వం తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎంనాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి దేముడునాయుడు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టి మూడేళ్లు కావస్తున్నా.. గ్రామాల్లోని సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, రుణ సౌకర్యం కల్పించడం లేదని ఆరోపించారు. అలాగే సెజ్, నేవల్‌బేస్‌ల్లో కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. అనంతరం తహసీల్దార్ ఆదిమహేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చోడిపల్లి గంగరాజు, ఐద్వా నాయకురాలు నాగమణి, ఎం. దేవి, డీవైఎఫ్ఐ నాయకులు ఎం.శ్రీను పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



కొత్తూరులో రైతులకు కంది విత్తనాలు ఇస్తున్న ఏవో గాయత్రి

రాయితీలు సద్వినియోగం చేసుకోండి

రాంబిల్లి : రాయితీ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ గాయత్రి అన్నారు. మామిడివాడ,కొత్తూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిప్సం ఉచితంగా అందిస్తున్నామని, కావాల్సిన రైతులు ఆధార్ కార్డుతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇటీవల పడిన వర్షాలతో వరినాట్లు ఊపందుకున్నాయన్నారు.

పరిశోధన స్థానం డీఆర్‌గా డాక్టర్ కృష్ణ ప్రసాద్‌జీ

అనకాపల్లి అగ్రికల్చర్ : అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్‌గా డాక్టర్ కృష్ణ ప్రసాద్‌జీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం ఇక్కడ బాధ్యతలు స్వీకరిస్తారు. ఇంతవరకు ఇక్కడ ఏడీఆర్‌గా ఉన్న డాక్టర్ ఎన్.వేణుగోపాలరావు వ్యవసాయ విశ్వవిద్యాలయ కేంద్ర కార్యాలయానికి పదోన్నతిపై వెళ్తున్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- అర్జున్‌రెడ్డి
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - ఆనందో బ్రహ్మ
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : వివేకం


మండల పరిషత్ కార్యాలయం

ఇదీ కశింకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల తీరు

■ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై స్పందన అంతంతే !
■ పూర్తిస్థాయిలో పరిష్కారం కానప్పుడు సమావేశాలెందుకని ప్రశ్న
■ ఒకటిన జరిగే వేదికనైనా ప్రణాళికతో నిర్వహించాలని సూచన

సరదాగా కాసేపు!

'సరదాగా కాసేపు'.. కశింకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీరు దాదాపు ఇలాగే ఉంది. ప్రతి మూడు నెలలకోసారి జరిగే ఈ తంతుకు అధికారులు ఆహ్వానాలు పంపడం.. ప్రజా ప్రతినిధులు రావడం.. తప్పితే, వారు ప్రస్తావించిన అంశాలను పెద్దగా చెవిన వేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల మనోగతమే ఉదాహరణగా కనిపిస్తోంది. కనీసం ఈ శుక్రవారం జరిగే వేదికనైనా ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కార్యోన్ముఖులు కాగలరని ఆశిద్దాం.

కశింకోట రూరల్/ అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గ పరిధి కశింకోట మండలంలో 26 పంచాయతీలు ఉన్నాయి. ఆయా పరిధిలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నా అందులో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారి పరిధిలోని గ్రామాల్లో సమస్యలపై పదేపదే గళం విప్పుతున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదనే వాదన చాలా మందిలో వినిపిస్తోంది. రోడ్లు, కాలువలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం, గ్రామ కంఠాల ఆక్రమణలు ఇలా అనేక రకాలైన సమస్యలను ఈ వేదిక దృష్టికి తెచ్చినా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదని అంటున్నారు. అలాగే పలు పనులకు సంబంధించి బిల్లులు కాలేదని, డ్వాక్రా సంఘాలకు సంబంధించిన పేమెంట్లు సక్రమంగా చెల్లించడం లేదని వాపోతున్నారు. ఇటువంటి వాటిని అధికారులు ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసిన ట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన జరగనున్న మండల సమావేశంలోనైనా సభ్యుల సమస్యలు పరిగణనలోకి తీసుకుని తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

రహదారి సమస్య తీరలేదు



మా గ్రామానికి సరైన రహదారి లేదు. ఈ సమస్యను పలుమార్లు మండల సమావేశంలో ప్రస్తావించాను. కంఠశోషే తప్ప ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

- ఆళ్ల అప్పలనర్సమ్మ, ఎంపీటీసీ, వెదురుపర్తి

పింఛన్లు రద్దైనా పట్టించుకోలేదు



మండల పరిషత్ సమావేశాలు మొక్కుబడిగానే సాగుతున్నాయి. మా గ్రామానికి చెందిన సమస్యలేవీ పరిష్కారం కావడం లేదు. గతంలో ఇచ్చిన పింఛన్లు కొన్ని రద్దయ్యాయి. వాటిని పునరుద్ధరించలేదు. పలు అభివృద్ధి పనులు చేయలని కోరాను. పట్టించుకునేవారు లేరు.

- మలసాల అనురాధ, సర్పంచ్, ఏఎస్‌పేట

104 వాహనం ఊరి ముఖం చూడడం లేదు



104 వాహనం మా గ్రామానికి రావడం లేదు. ఈ విషయాన్ని ప్రతి మండల సమావేశంలో వివరిస్తూనే ఉన్నాను. అయినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు. అలాగే గ్రామంలో యూపీ స్కూల్‌కు ప్రహరీ నిర్మించాలని కోరాను. అది కూడా జరగలేదు.

- గొంతిన పైడితల్లమ్మ, ఎంపీటీసీ, ఏఎస్‌పేట

పింఛన్లు మంజూరు కాలేదు



మా గ్రామంలో వారికి పింఛన్లు మంజూరు చేయాలని కోరాను. ఫలితం లేకపోయింది. ఇంకుడు గుంతలు తవ్వి ఏళ్ల గడుస్తోంది. వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించ లేదు. గ్రామ కంఠం స్థలం ఉన్నప్పటికీ ఆక్రమణకు గురైంది. వీటిపై కూడా సమావేశాల్లో ప్రస్తావించాను.

- కలిగట్ల బాపునాయుడు, సర్పంచ్, ఎన్‌జీ పాలెం

కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు కోరినా..



మా గ్రామంలోని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలు మార్లు మండల సమావేశాల్లో కోరాను. అలాగే దోబీఘాట్ కూడా మంజూరు చేయాలని విన్నవించాను. నా గోడు పట్టించుకునేవారు కరువయ్యారు.

- గొంతిన నాగరత్నం, సర్పంచ్, సోమవరం

మా గ్రామంలో అభివృద్ధి బాగుంది



అభివృద్ధి పనులు మా గ్రామంలో బాగానే జరుగుతున్నాయి. అయితే మరికొన్ని పనులు చేయాల్సి ఉంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఎన్ఆర్ఈజీఎస్ పనులు బాగానే జరిగాయి. ప్రతిపాదనలు చేసిన మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలి.

- బండారు శ్రీను, సర్పంచ్, సుందరయ్యపేట

నీరు- చెట్టు పనులు చేపట్టాం



నీరు- చెట్టు పనులు మా గ్రామంలో బాగా జరిగాయి. చెరువుల్లో పూడికలు తీయడం వలన నీటి నిల్వలు పెరిగాయి. అలాగే సీసీ రోడ్లు కూడా బాగానే నిర్మించారు. హౌసింగ్ పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉంది.

- గొల్లవిల్లి జయ, సర్పంచ్, బయ్యవరం

నా హయాంలో మండలాన్ని అభివృద్ధి చేశా



కశింకోట మండలాన్ని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సహకారంతో ఎంతో అభివృద్ధి చేశాను. రెండున్నరేళ్లు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించాను. నేను పనిచేసిన కాలంలో మండల పరిషత్ సమావేశాల్లో ప్రతిపాదించిన పనులు అధిక శాతం పూర్తి చేశాను.

- పెంటకోట సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ, కశింకోట, మాజీ ఎంపీపీ

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



కశింకోట మండలంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. అన్ని గ్రామాలకు సమానమైన ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సహకారంతో మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగింది. ఇకపై కూడా అభివృద్ధి చేస్తాం. పెండింగ్ అంటూ ఏమీ లేకుండా ప్రతిపాదించిన పనులన్నీ పూర్తి చేస్తాం.

- పంచదార్ల లక్ష్మి, ఎంపీపీ, కశింకోట

తీర్మానాల మేరకు పనులు పూర్తి



కశింకోట మండల పరిషత్ సమావేశాల్లో ప్రతిసారీ అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు చేస్తున్నాం. ఆ మేరకు ఆయా పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నాం. అక్కడక్కడ ఏమైనా మిగిలితే మిగిలి ఉండవచ్చు. ఆ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తాం.

- మలసాల ధనమ్మ, జడ్పీటీసీ, కశింకోట

నలభై మందికి కంటి వైద్య పరీక్షలు

నెహ్రూచౌక్ : దేమునిగుమ్మం రామాలయం వద్ద గల రోటరీ కంటి వైద్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంతానికి చెందిన నలభై మంది హాజరుకాగా, అందులో ఆరుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి బుధవారం నిర్వహించారు. రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్, రోటరీ అధ్యక్షుడు రమణాజీ, కార్యదర్శి రామ్మోహన్‌రావు, ప్రొగ్రాం కన్వీనర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

నెహ్రూచౌక్ : భీమునిగుమ్మంలో ఎమ్మెల్యే పీలా చొరవతో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభమైనట్టు ఆ ప్రాంత టీడీపీ నాయకుడు సబ్బవరపు గణేష్ బుధవారం తెలిపారు. ఎనిమిదో వార్డు పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో మురుగు ఇళ్ల ముందుకు నిలిచిపోతుండడంతో వర్షాకాలంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. ఇది గుర్తించిన ఎమ్మెల్యే సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో సమస్యలు పరిష్కారం కానున్నట్టు చెప్పారు.

డీసీసీబీ చైర్మన్ సుకుమార్‌వర్మకు సత్కారం


డీసీసీబీ చైర్మన్‌కు గజమాల వేస్తున్న సిదిరెడ్డి శ్రీనివాసరావు

కశింకోట రూరల్ : డీసీసీబీ చైర్మన్ సుకుమార్‌వర్మ జన్మదినం సందర్భంగా కశింకోట డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు బుధవారం ఆయనను సత్కరించారు. విశాఖలోని కో- ఆపరేటివ్ బ్యాంకుకు వెళ్లి శాలువా కప్పి, గజమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు కాండ్రేగుల అప్పారావు, ఆంధ్ర ప్రసాద్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులతో నోబుల్ చారిటీస్ సభ్యులు, ఉపాధ్యాయులు

నెహ్రూచౌక్ : ఇక్కడి జీవీఎంసీ బాలుర హైస్కూల్‌లో బుధవారం నోబుల్ చారిటీస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా డాక్టర్ కె.విష్ణుమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. నోబుల్ చారిటీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ శరగడం సూకరాజు మాట్లాడుతూ పచ్చదనం పెంపునకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వయో వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అప్పారావు, హెచ్‌ఎం డీవీఎస్ఎన్ శర్మ, కె.దుర్గా ప్రసాద్, నీలిమా పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలు సందర్శించిన టీబీ నోడల్ అధికారి

పాడేరు: రాష్ట్ర క్షయ నివారణ విభాగం నోడల్ అధికారి టి.రామారావు బుధవారం ఏజెన్సీలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించారు. ఏజెన్సీలో క్షయ నివారణకు చేపడుతున్న చర్యలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన, ముందుగా మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని కిండంగి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. తర్వాత జి.మాడుగుల మండలం కులుపాడులోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. ఏజెన్సీలో ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా క్షయ రోగులకు అందుతున్న సేవలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మాతాశిశువులకు ఎటువంటి సేవలు అందిస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. చిన్నారులకు ఎంఆర్ వాక్సిన్ వేస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వసుంధర, ఏడీఎంహెచ్‌వో గురునాథరావు, అపిడిమిక్ సెల్ హెల్త్ సూపర్‌వైజర్ జి.సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.


వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీస్తున్న నోడల్ అధికారి

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

42 యూనిట్ల రక్తం సేకరణ.. దాతలకు బహుమతులు

పాడేరు రూరల్: పీఎంఆర్సీ భవనంలో చైతన్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తదానం చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి యువతీ, యువకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. విశ్వమాత మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని వెలుగు ఏపీడీ యు.సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రక్తదానం చేస్తే ప్రాణ దానం చేసివారవుతారన్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి ఎన్.శోభారాణి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో రక్తహీనత వల్ల అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనత మరణాల నియంత్రణకు యువతీ యువకులు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ శిబిరంలో 42 మంది నుంచి 42 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు చైతన్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.రవికుమార్ తెలిపారు. వీరికి డ్రా తీసి మొదటి ముగ్గురికి బహుమతులు ప్రదానం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్, ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు విభాగాల సిబ్బంది, చైతన్య చారిటబుల్ ట్రస్టు సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తాన్ని అందిస్తున్న దాతలు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: ఎంపీడీవో

కొయ్యూరు: ఉపాధి పథకం సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఇమ్మానుయేలు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాఫీ ప్లాంటేషన్ పనులు జాప్యం కావడం సిబ్బంది అలసత్వమే నన్నారు. పనిచేయని సిబ్బందిని విధుల నుంచి తప్పించాలని ఉన్నతాధికారులు ఆదే శాలు జారీ చేశారన్నారు. ఇద్దరు కంప్యూటర్ అపరేటర్లు విధుల పట్ల నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నట్టు గుర్తించానని, ఇదే పరిస్థితి కొనసాగిస్తే విధుల నుంచి తప్పిస్తామని ఎంపీడీవో హెచ్చరించారు. నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేయకపోతే ఉపేక్షించబోనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చింతపల్లి క్లస్టరు ఏపీడీ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.


పనితీరు బాగులేదని ఉపాధి సిబ్బందిని నిలదీస్తున్న ఎంపీడీవో

సబ్ డివిజన్‌కు 686 గృహాలు మంజూరు

హౌసింగ్ డీఈఈ నాగరాజు

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్‌కు 686 ఎన్టీఆర్ పక్కా గృహాలు మంజూరయ్యాయని హౌసింగ్ డీఈఈ జి.నాగరాజు తెలిపారు. బుధవారం లోతుగెడ్డ గ్రామంలో ఎక్కా గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చింతపల్లికి 265, జీకే వీధికి 240, కొయ్యూరుకు 181 గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభిస్తే నిధులను వ్యక్తిగత ఖాతాల్లోకి స్థాయిల వారీగా జమ చేస్తామన్నారు. 2018-19 నాటికి చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలకు 686 ఎన్టీఆర్ పక్కా గృహాలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అలాగే లింటల్, రూఫ్ స్థాయిలో అసంపూర్తిగా నిలిచిపోయిన పక్కా గృహాల లబ్ధిదారులు రేకులతో పైకప్పు నిర్మించుకునేందుకు నిధులు విడుదలయ్యాయన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన 722 గృహాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయించాలని జేఈలను ఆదేశించినట్టు ఆయన తెలిపారు.

ప్రజా సాధికార సర్వేకు కాల్ సెంటర్ ఏర్పాటు

పాడేరు రూరల్: ప్రజా సాధికార సర్వే నిర్వాహణకు రెవెన్యూ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ జె.దుర్గారవీంద్రనాథ్ తెలిపారు. ఇంత వరకు సర్వే చేయించుకోని వారు సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ సెంటర్‌కు వచ్చి నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 08935-250404 నంబర్‌కు సంప్రదించాలని ఆయన సూచించారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పాడేరు రూరల్: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతానికి కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో మధుమోహన్‌కుమార్ సూచించారు. మినుములూరులో బుధవారం మరుగుదొడ్లను పరిశీలించారు. ఉపాధి పథకం ఏపీవో, టీఏ, సీవోలు తయారు చేయాల్సిన ఏడు రిజిష్టర్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, మాజీ సర్పంచ్ ఎం.కన్నాపాత్రుడు పాల్గొన్నారు.

మావోయిస్టులు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడడమా..?

చింతపల్లి డీఎస్పీ అనిల్

సీలేరు: ప్రజాస్వామ్యం కోసం మాట్లాడే నైతిక హక్కు మావోయిస్టులకు లేదని చింతపల్లి డీఎస్పీ పి.అనిల్ అన్నారు. బుధవారం సీలేరు పోలీసు స్టేషన్ సందర్శించిన ఆయన విలేకరులతో కొద్దిసేపు మాట్లాడారు. ప్రజాస్వామ్యం అంటే అడవుల్లో తుపాకీలు పట్టుకుని తిరగడం కాదన్నారు. ఆదివాసీల కోసం అడవుల్లో ఉంటున్నామంటూ చెబుతున్న మావోయిస్టులు , మారుమూల గ్రామాలకు రోడ్లు వస్తే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. రోడ్లు వస్తేనే మారుమూల గ్రామాలకు పాఠశాలలు, ఆస్పత్రులు ఏర్పడి గిరిజనులు అభివృద్ధి చెందుతారన్న విషయాన్ని వారు గ్రహించాలన్నారు. అవుట్ పోస్టులను అడ్డుకోవాలని పిలుపునిచ్చే అధికారం మావోయిస్టులకు లేదన్నారు. అవుట్‌పోస్టుల ఏర్పాటు గిరిజనుల రక్షణ కోసమేనన్నారు. ధారకొండలో సెల్ టవర్ ఏర్పాటుతో ప్రజలకు వెసులుబాటుగా ఉందన్నారు. అక్టోబర్‌లో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం గిరిజ యువత ఆసక్తి కనబరిస్తే చింతపల్లిలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆయన వెంట సీఐ నారాయణరావు, ఎస్ఐ విభూషణరావు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

జి.మాడుగుల: ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో ప్రేమాకరరావు కోరారు. జి.ఎంకొత్తూరులో గిరిజనులు సిల్వర్ ఓక్ మొక్కలను అందజేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటుకుని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది రూడి అప్పారావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ విధానంలో శ్రీవరి ప్రదర్శన క్షేత్రాల నిర్వహణ

పాడేరు రూరల్: వంజంగి గ్రామంలో డ్రమ్‌సీడర్ విధానంలో శ్రీవరి ప్రదర్శన క్షేత్రాలను నిర్వహించామని ఏవో ఎ.సంధ్య తెలిపారు. శ్రీవరి ప్రదర్శన క్షేత్రాల వల్ల అధిక దిగుబడులు వస్తాయన్నారు. డ్రమ్‌సీడర్ వినియోగంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ చంద్రశేఖరరావు, ఏఈవోలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

180 మంది జ్వర బాధితులకు రక్త పరీక్షలు

పాడేరు రూరల్: తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజులు భారీ వర్షాలు కురవడంతో గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతి సారీ మన్యంలో వర్షాలు పడిన రెండవ రోజు నుంచి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి బుధవారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఓపీకి 376 మంది రోగులు మాజరయ్యారు. వీరిలో 180 మంది జ్వర బాధితులకు ఆస్పత్రిలో ఉన్న రక్త పరీక్షల విభాగంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఎనిమిది మంది రోగులు వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నట్టు గుర్తించారు. వారిని ఆస్పత్రిలోని ఉంచి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు.


పరీక్షల కోసం క్యూ కట్టిన జ్వర బాధితులు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు రెడ్‌క్రాస్, అగ్నిమాపక అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల శిక్షణ తరగతుల్లో రెండోరోజు బుధవారం స్థానిక అగ్నిమాపక అధికారులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ జిల్లా ఫీల్డ్ అధికారి మంగమ్మ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఐఏఎస్ఎన్.రాజు మాట్లాడుతూ ప్రమాదాలు సంబవించిన సమయంలో పాఠశాల, కళాశాలలోల్లో పై అంతస్తుల్లో ఉండే విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డెమో క్లాసులు నిర్వహించారు. ప్రమాదవశాత్తు ఆక్సిజన్ అందనిప్రదేశంలో ప్రమాదానికి గురైన వ్యక్తులు ఉన్న సమయంలో వారికి ఆక్సిజన్ ఏ విధంగా అందించాలన్న అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా ఫీల్డ్ అధికారి మంగమ్మ మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉన్నందున విద్యార్థులు రక్తదానం చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ స్టేట్ ట్రైనర్ అపర్ణ, వలంటీర్ దిలీప్ కుమార్, ప్రిన్సిపాల్ పి.సోమరాజు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు బాలకృష్ణా రెడ్డి, సీహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గట్టు వేసి వర్షపు నీటిని అడ్డగించారు

చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్‌కు మోదమాంబ కాలనీవాసుల వినతి

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీలో కొంతమంది స్వార్థం కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నామని కాలనీ ప్రజలు తహసీల్దార్ పి.శేషశైలజకు లిఖిత పూర్వకంగా విన్నవించారు. మోదమాంబ కాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నామని, అయితే ఇటీవలి కాలంలో సీసీ రోడ్లు నిర్మించిన అధికారులు కాలువలు నిర్మించకపోవడతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోయి అవస్థలు పడుతున్నామని, దీనికి తోడు వర్షపు నీరు కూడా చేరుతోందని, నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకుండా కాలనీకి చెందిన భూస్వామి గౌరీపట్టపు నారాయణరావు దౌర్జన్యంగా కాలనీ స్థలంలో గట్టు వేయడంతో నీరంతా ఇళ్లముందు నిలిచిపోతోందని పేర్కొన్నారు. దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శేషశైలజ భూస్వామి వేసిన గట్టును వెంటనే తొలగించాలని, అతడి భూమి వివరాలను తెలుసుకోవాలని వీఆర్వో వెంకటస్వామిని ఆదేశించారు. దీంతో సంబంధిత వీఆర్వో, సర్వేయర్, ఇతర సిబ్బంది ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఇళ్ల మధ్యలో వేసిన గట్టును తొలగింపజేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : సీపీఎం

దేవరాపల్లి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.రాజు డిమాండ్ చేశారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో పని చేస్తున్న యువతను బుధవారం ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రంలో లక్షా 42వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, 2017 చివరినాటికి రిటైర్ అవుతున్న వారి సంఖ్య 35 వేలకు చేరనుందని అన్నారు. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి ఎటువంటి చర్యలూ లేవన్నారు. తాము అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన తెలుగుదేశం నాయకులు ఆ తరువాత ఆ విషయాన్నే విస్మరించారన్నారు. కేఎస్ఎన్.రాజు, కె.భూషణం, పి.కన్నంనాయుడు, వై.చెల్లయ్యమ్మ, వి.మణి, జి.నందిని, కల్యాణి, రామకృష్ణ, కె.ప్రసాద్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


యువకుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

పిల్లలకు బాధ్యతగా వ్యాక్సిన్ వేయించాలి

కె.కోటపాడు : తల్లిదండ్రులకు పిల్లలకు తటు, పొంగు వ్యాధులు ప్రబలకుండా రుబెల్లా తమవంతు బాధ్యతగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని విశాఖ పట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల ఎస్‌పీఎం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.యర్రయ్య అన్నారు. బుధవారం మండలంలోని కెసంతపాలెం, దాలివలస సబ్ సెంటర్లలో వ్యాక్సినేషన్ అమలు తీరును పరిశీలించారు. ఇంటింటా తిరిగి పిల్లలకు వ్యాక్సిన్ వేయించారా?లేదా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎం.ఆర్,వ్యాక్సిన్లతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. వైద్య సిబ్బంది పిల్లలందరికీ పూర్తి స్థాయిలో వ్యాక్సిన్లు వేయించాలని కోరారు. ఆయన వెంట పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ యు.రమేశ్, ఎంపీహెచ్ఈవో కేవీ రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ కె.నరసింగరావు, హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ గురించి వివరిస్తున్న ఏఎంసీ ప్రొఫెసర్ యర్రయ్య

శ్రమదానంతో తుప్పల తొలగింపు



దేవరాపల్లి: స్థానిక పంట కాలువపై పెరిగిపోయిన తుప్పలను, డొంకలను రైతులు శ్రమదానంతో బుధవారం శుభ్రం చేశారు. ఈ కాలువపై తుప్పలు పెరిగిపోవడంతో నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడిందని, ఈ దృష్ట్యా తామే వాటిని తొలగించామని సంతపేట, కొత్తూరు రైతులు కొల్లి ఈశ్వరరావు, వరదపురెడ్డి సన్నిబాబు, వి.దేముడుబాబు తదితరులు తెలిపారు.

నేడు నరసయ్యపేటలో పల్లెనిద్ర

మాడుగుల రూరల్ : మండలంలోని ఎల్.పొన్నవోలు పంచాయతీ నరసయ్యపేటలో గురువారం మన గ్రామం-మన విశాఖ, పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్ తెలిపారు.

ఘనంగా వరలక్ష్మి జన్మదిన వేడుకలు

దేవరాపల్లి: దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి గవిరెడ్డి రామానాయుడు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి వరలక్ష్మికి తినిపించారు. మండలంలోని పలువురు టీడీపీ నాయకులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి గాలి రవికుమార్, దేవరాపల్లి, కె.కోటపాడు మండల పార్టీ అధ్యక్షులు బండారు రామారావు, కొరుపోలు జయరాం తదితరులు పాల్గొన్నారు.


వరలక్ష్మికి కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి

మాడుగుల రూరల్ : మండలంలోని కేజేపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం హెచ్ఎం రాపేటి రామకొండలరావు, స్థానిక సర్పంచ్ పెంటకోట అప్పారావు, ఎంఈవో దేముడమ్మ, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్బంగా హెచ్ఎం రామకొండారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థీ మొక్కలు నాటాలని సూచించారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సన్యాసిరావు, వైస్ చైర్‌పర్సన్ శరగడం తులసి, కర్రి నాగమణి, కాళ్ల అప్పలనాయుడు, రాపేటి గోవింద్, ఆడారి కన్నారావు, సీఆర్‌పీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న సర్పంచ్ తదితరులు

షెడ్డు పరిస్థితి ఇలా...

- కొత్తూరు పాఠశాలల్లో దెబ్బతిన్న వంటషెడ్డు
- అవస్థలు పడుతున్న భోజన పథక నిర్వాహకులు
- మూడేళ్లుగా ఇదే పరిస్థితి

మరి వంటెలా?





హుద్‌హుద్‌లో దెబ్బతిన్న రేకులషెడ్డు (ఇన్‌సెట్లో) షెడ్డుపైన రేకులు లేని దృశ్యం

ఎప్పుడో మూడేళ్ల క్రితం వచ్చిన హుద్‌హుద్ తుఫాన్‌కు సంభవించిన నష్టాల ఛాయలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. ఇందుకు ఉదాహరణ స్థానిక కొత్తూరు జంక్షన్‌లో గల బాలికోన్నత, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంటషెడ్డు. అప్పటి తుఫాన్‌లో ఈ వంటషెడ్డు బాగా దెబ్బతింది. పైన రేకులు ఎగిరిపోయాయి. అప్పటి నుంచి దీని మరమ్మతుకు గానీ లేదా కొత్త వంటషెడ్డు నిర్మాణానికి గానీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గడచిన మూడేళ్లుగా భోజన పథక నిర్వాహకులు వంట చేయడానికి నానా అవస్థలూ పడుతున్నారు. ఇప్పుడు వర్షాలు పడుతుండడంతో వారి పరిస్థితి మరింత వర్ణనాతీతం.

చోడవరం టౌన్: కొత్తూరు జంక్షన్‌లోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో 420 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం నిర్మించిన వంటషెడ్డు హుద్‌హుద్ తుఫాన్ ధాటికి దెబ్బతింది. దీంతో వంట సామగ్రిని భద్రపరచుకునేందుకు షెడ్డు లేకపోవడంతో వర్షం పడేటప్పుడు అవన్నీ తడిసి ముద్దవుతున్నాయి. ఇక్కడ గ్యాస్ లేకపోవడంతో కట్టెలపైనే వంటలు చేయాల్సి వస్తోంది. వర్షానికి అవి తడిసిపోతుండడంతో అవి సక్రమంగా మండక నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. షెడ్డు పూర్తిగా పల్లపు ప్రదేశంలో ఉండటంతో వర్షాలకు షెడ్డు లోపలకు బురదనీరు చేరి సామగ్రి పాడవుతోందని నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే అవస్థలు పడి షెడ్డులో ఏదో మూల వంట చేస్తున్నామని పేర్కొన్నారు. వంట రుచిగా లేకపోయినా, ఏమైనా తేడా వచ్చినా నిలదీసే అధికారులు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో వీచిన గాలికి రేకుల షెడ్డు మరమ్మతులకు గురైందని, మరమ్మతుకు చర్యలు తీసుకోవాల్సిందిగా డీఈవో, పీవో దృష్టికి పలుమార్లు తీసుకువెళ్ళినా స్పందించలేదని తెలిపారు. గడచిన మూడేళ్లలో ముగ్గురు ఎంఈవోలు మారినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. మంచినీటి బోరు వద్ద వాడుకనీరు పోయే దారిలేక నీరంతా ఆ చుట్టుపక్కలే చేరి పరిసరాలు బురదగా మారుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు కల్పించుకుని వెంటనే మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని భోజన పథకం నిర్వాహకులు కోరుతున్నారు.



బురదలో నుంచి వండిన పదార్థాలు తీసుకువెళుతున్న కార్మికులు

అధికారులు పట్టించుకోవడం లేదు



హుద్‌హుద్ తుఫాన్ సమయంలో వంట షెడ్డు దెబ్బతింది. పథకం నిర్వహణ పరిశీలించేందుకు వచ్చిన డీఈవో, పీవోలకు సమస్యను వివరించి, ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. కనీస సౌకర్యాలు లేకుండా వండి వార్చేందుకు కష్టంగా ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలి. **గూనూరు వరలక్ష్మి,** భోజన పథకం నిర్వాహకురాలు

షెడ్డు మరమ్మతు చేపట్టాలి



సామాన్లు భద్రపరచుకునేందుకు షెడ్డులేదు. వర్షం పడేటప్పుడు షెడ్డు ఆవరణ అంతా నీటితో నిండి బురదగా మారుతోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. బోరు నుంచి వాడుక నీరు పోయే దారిలేక నీరంతా నిలిచిపోతోంది. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలి **బి.నారాయణమ్మ,** భోజన పథకం కార్మికురాలు

ఉన్నతాధికారులకు నివేదించాం



ఇక్కడి పాఠశాలలో వంటషెడ్డు మరమ్మతు చేపట్టక ఇబ్బందులు పడుతున్నమాట వాస్తవం. ఇదేకాక మండలంలో 20 వరకు పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం సమస్య తాత్కాలికంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. నిధులు విడుదల అయిన వెంటనే షెడ్డు మరమ్మతు పనులు చేపడతాం.

పి.అచ్యుతరావు, ఎంఈవో, చోడవరం

చందన రూపంలో గణపయ్య



చోడవరం టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరస్వామి బుధవారం చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్, చలపతి తదితరులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజూ సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

పీఎస్ పేటలో సరస్వతి పూజ

మండలంలోని పీఎస్ పేట లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం ఉదయం బాలబాలికలచే సరస్వతీ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరస్వామి వారికి మారేడుదళ పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉధృతంగా జ్వరాలు

- ఆస్పత్రులకు పెరుగుతున్న తాకిడి
- వాతావరణ మార్పుతో పెరుగుతున్న జ్వరబాధితులు

చోడవరం: వాతావరణంలో మార్పుల ప్రభావంతో పాటు గడచిన వారంరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో ఎక్కువమంది జ్వరాలతో బాధపడుతున్నారు. ఎక్కువ శాతం మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. వర్షాలు ఉధృతం కావడంతో ఎక్కువ మంది జ్వరాలబారిన పడ్డారు. చాలామంది ప్రైవేటు వైద్యులను, ఆర్‌ఎంపీలను ఆశ్రయించి చికిత్స పొందుతుండగా, ప్రభుత్వ ఆసుపత్రికి కూడా జ్వరపీడితుల సంఖ్య ఎక్కువైంది. మంగళ, బుధవారాల్లో పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి భారీగానే రోగులు తరలివచ్చారు. మంగళవారం ఓపీ 229 కాగా, అందులో 16మంది జ్వరాలతో బాధపడుతున్న వారు ఉన్నారు. బుధవారం ఓపీ 267 కాగా 23మంది జ్వరాలతో బాధపడుతున్న వారు ఉన్నారు. పలు వార్డులలో ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించి జ్వరపీడితులకు వైద్య సహాయం అందించారు. వైరల్ జ్వరాలతో పాటు కొందరికి టైఫాయిడ్ జ్వరాలు కూడా రావడంతో ప్రైవేటు ఆసుపత్రుల వద్ద కూడా రోగుల రద్దీ పెరిగింది.



ఆసుపత్రిలో క్యూలో నిలబడిన రోగులు

రోలుగుంటలో పశువైద్య శిబిరం

రోలుగుంట : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను వేయించాలని పశువైద్యాధికారి అనూష రైతులకు తెలిపారు. రోలుగుంటలో బుధవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో 110 పశువులకు టీకాలు వేశారు. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు వచ్చే అవకాశమున్నందున ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

'డ్రైనేజీ' కోసం నివేదికలు తయారు చేయండి

కమిషనర్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆదేశం
అక్టోబర్ 2న డంపింగ్‌యార్డు ప్రారంభం
రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి
మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ సీహెచ్ సన్యాసిపాత్రుడు





రిటైర్డ్ పారిశుధ్య కార్మికులకు పారితోషికం చెక్కులను అందజేస్తున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు, హాజరైన కౌన్సిలర్లు

21వవార్డులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అంచనా నివేదికలు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ సురేంద్రకు మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు సూచించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ ఏడాది కార్పొరేషన్ రుణాలు మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దరఖాస్తులందరికి రుణాలు మంజూరయ్యేలా కృషిచేస్తామన్నారు. ఎనిమిదో వార్డు వైసీపీ కౌన్సిలర్ కోనేటి వెంకటలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, వీటి నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించగా కమిషనర్ సురేంద్ర స్పందించి ఇప్పటికే 250 కుక్కలకు టీకాలు వేయించామన్నారు. దశల వారీగా పట్టణంలో కుక్కలు, పందుల ఏరివేత కార్యక్రమం ముమ్మరం చేశామన్నారు.

మున్సిపాలిటీలోని బలిఘట్టం శివారు లింగాపురం వెళ్లే మార్గంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న డంపింగ్ యార్డును అక్టోబర్ 2న ప్రారంభించనున్నామని వైస్‌చైర్మన్ తెలిపారు. ఆరోవార్డులో రూ.2 కోట్లతో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. దాతలు ముందుకు వస్తే ఇక్కడ కూడా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు చేయడానికి సహకరిస్తామన్నారు.

సెప్టెంబర్ 4న అయ్యన్న సోదరుల జన్మదినం సందర్భంగా నర్సీపట్నం 150 పడకల ఏరియా ఆస్పత్రిలో తలపెట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సన్యాసిపాత్రుడు కోరారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలన్నారు. మున్సిపల్ సమావేశానికి అధికార పార్టీ కౌన్సిలర్లు హాజరుకాగా ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఐదుగురు కౌన్సిలర్లు హాజరు కాలేదు.

రిటైర్డ్ పారిశుధ్య కార్మికులకు గ్రాట్యుటీ చెక్కుల పంపిణీ

పంచాయతీగా వున్నప్పటి నుంచి నర్సీపట్నంలో పని చేసి ఇటీవల పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికులు మారోతి సూరమ్మ, జలగడుగుల వరలక్ష్మి, చెన్నా గోపీ, బండి లక్ష్మి, పరపతి లక్ష్మి, సేనాపతి జగన్నాథంలకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన గ్రాట్యూటీ సొమ్ము రూ.12లక్షల చెక్కులను చైర్‌పర్సన్ అనిత, వైస్‌చైర్మన్ సన్యాసిపాత్రుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, కార్యాలయ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం తీరుపై డీఎల్‌పీవో ఆగ్రహం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్‌పీవో శిరీషారాణి

కృష్ణాదేవి పేట: ఏఎల్‌పురం పంచాయతీలో పారిశుధ్యం నిర్వహణ తీరుపై అధికారులు, పాలకవర్గంపై నర్సీపట్నం డీఎల్‌పీవో ఆర్.శిరీషారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె పంచాయతీల్లో ఇళ్లకు జియో ట్యాగింగ్ సర్వే పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఏఎల్‌పురంలోగల పలు వీధులను పరిశీలించారు. మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగునీటి నిల్వలను చూశారు. దీంతో ఈవోఆర్‌డీ త్రిమూర్తులు, పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యలోపం వుంటే మీరు ఏం చేస్తున్నారు పనిచేయకుంటే సెలవు తీసుకొని వెళ్లిపోవాలన్నారు. రెండు రోజుల్లో పంచాయతీలో పారిశుధ్య సమస్యలుంటే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. గ్రామంలో పందుల యజమానులకు నోటీసులు జారీ చేసి పారిశుధ్యం కోసం చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఏఎల్‌పురం పంచాయతీకి శాశ్వత కార్యదర్శిని నియమించడానికి చర్యలు చేపడుతున్నట్టు ఆమె చెప్పారు. నర్సీపట్నం డివిజన్‌లో 313 పంచాయతీల్లో ఇళ్లకు జియో ట్యాగింగ్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యలోపం వుంటే ప్రజలు నేరుగా తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ త్రిమూర్తులు,సర్పంచ్ లగుడు పద్మ, లగుడు మురళీకృష్ణ, జియో ట్యాగింగ్ కాంట్రాక్ట్ సిబ్బంది, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

మాకవరపాలెం: వచ్చేనెల 1వ తేదీన విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.శ్రీరామూర్తి తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో మిలియన్ మార్చ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంట్రిబ్యూషన్ పెన్షన్ విధానం వల్ల ఉపాధ్యాయులు నష్టపోతారన్నారు. దీనిపై రాష్ట్ర స్థాయిలో ఏపీటీఎఫ్ తీవ్రంగా పోరాటం చేస్తోందన్నారు. వచ్చేనెల 1న విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి ఎరుకునాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు 1,483 దరఖాస్తులు

మాకవరపాలెం: కొత్త ఓటర్ల నమోదుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 1,483 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కె.రమామణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో నెల రోజులుగా కొత్త ఓటర్ల చేర్పులపై సమావేశాలను నిర్వహించారన్నారు. గ్రామాల్లో కొత్త ఓటర్ల నమోదుకు ఆఫ్‌లైన్,ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేశారన్నారు. గురువారంతో ఈ నమోదు పూర్తవుతుందన్నారు.

పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలి



మాకవరపాలెంలో పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శిరీషారాణి

మాకవరపాలెం: గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ పనులను వేగవంతం చేయాలని నర్సీపట్నం డీఎల్‌పీవో శిరీషారాణి అన్నారు. బుధవారం ఆమె మాకవరపాలెం, తామరం, వజ్రగడ గ్రామాల్లో పారిశుధ్యం పనులను పరిశీలించారు. తామరంలో ఇంటి సర్వేను పరిశీలించారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ స్థలాలను పరిశీలించారు. మాకవరపాలెం మెయిన్ రోడ్డులో చేపడుతున్న పారిశుధ్యం పనులను పరిశీలించారు. వజ్రగడలో ఇప్పటివరకు పంచాయతీ భవనాన్ని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయతీ భవనాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ స్థలాలను ఎంపిక చేసి తడి, పొడి చెత్త పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, మాకవరపాలెం పంచాయతీ కార్యదర్శి శివరామ్ పాల్గొన్నారు.

ముున్సిపల్ కార్యాలయంలో ముమ్మరంగా పల్స్ సర్వే



పల్స్ సర్వే వివరాలు నమోదు చేస్తున్న ఉద్యోగి

నర్సీపట్నం టౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్ సర్వే నమోదు ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. కార్యాలయంలో పల్స్ సర్వే వివరాలు నమోదు చేసుకునేందుకు ముగ్గురు ఎన్యూమరేటర్‌లను ఏర్పాటు చేశారు. బుధవారం అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి తమ వివరాలు పల్స్ సర్వే నమోదు చేయించుకున్నారు. గతంలో పట్టణంలో లేకుండా జీవనోపాధి కోసం వలసలు వెళ్లిన వారంతా ప్రస్తుతం కార్యాలయానికి వచ్చి వివరాలు నమోదు చేయించుకుంటున్నారన్నారు. గతంలో యంత్రం లోపం వల్ల వివరాలు నమోదు కాని వారు సైతం పక్కాగా వివరాలు నమోదు చేయించుకుని వెళుతున్నారని ఎన్యూమరేటర్‌లు తెలిపారు. ఇప్పటివరకు 30 మంది వివరాలు నమోదు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ అప్పలరాజు, కౌన్సిలర్ రుత్తల కృష్ణ పాల్గొన్నారు.

అన్న సమారాధన



కేడీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్న సమారాధన

కృష్ణాదేవి పేట: గొలుగొండ ఏఎల్‌పురం లింగంపేట,చోద్యం, పల్లావూరు, నాగాపురం, రేఖపల్లి, కొంగశింగి తదితర గ్రామాల్లో బుధవారం ఘనంగా వినాయక నిమజ్జనం జరిగింది. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. కేడీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. ఈకార్యక్రమంలో కొయ్యూరు సీఐ పీవీ ఉదయ్‌కుమార్, ఏపీఎస్‌పీ సీఐ శ్రీనివాసరావు, కేడీపేట, మంప ఎస్‌ఐలు రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా స్థానిక సీఐ ఉదయ్‌కుమార్ తమ సిబ్బందితో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సదస్సు

నర్సీపట్నం రూరల్: నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఈనెల 31న ప్రయాణికుల సదస్సు నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ సూర్య పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకూ ప్రయాణికుల సదస్సు, నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులు సలహాల కోసం 7382916428 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రహదారులు బురదమయం



ఎస్.నర్సాపురంలో బురదమయంగా సీసీ రోడ్డు

పాయకరావుపేట : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు బురదమయంగా మారాయి. ముఖ్యంగా పుంతరోడ్లు కాలు మోపేందుకు కూడా అవకాశం లేకుండా మారుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండలంలో గత కొద్ది రోజులు పడుతున్న వర్షాలకు పట్టణంతోపాటు మండల గ్రామాల్లో పలు రోడ్లు బురదగా మారి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అరట్లకోట, మంగవరం, సత్యవరం, మాసాహెబ్‌పేట, కొత్తూరు, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, కుమారపురం, ఈదటం, కందిపూడి తదితర గ్రామాల్లో మట్టి రోడ్లపై పాదం మునిగిన బురద పేరుకుపోయింది. కొన్ని చోట్ల గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోతుంది. సీసీ రహదారుల సైతం బురదమయంగా మారుతుంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.



అధ్వానంగా పెదరాంభద్రపురం, సత్యవరం రోడ్లు



బురదతో నిండిన పాయకరాణివారి చెరువు పుంతరోడ్డు



పెదరాంభద్రపురంలో అధ్వానంగా సీసీ రోడ్డు, కాలువ

ప్రజాప్రతినిధుల సహకారంతో

ప్రమాదాల నివారణ

- జాతర్లలో అసాంఘిక కార్యకలాపాల నిరోధం
- నక్కపల్లి సీఐ రుద్రశేఖర్



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, (అంతర చిత్రం) మాట్లాడుతున్న సీఐ రుద్రశేఖర్

నక్కపల్లి : ప్రమాదాల నివారణకు ప్రజాప్రతినిధులు సహకరించాలని నక్కపల్లి సీఐ సీహెచ్ రుద్రశేఖర్ కోరారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సర్పంచ్‌లు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్‌లు, ఇతర వాహనాలు నడిపేవారు రహదారి భద్రతలు పాటించేలా అవగాహన తీసుకురావాలన్నారు. హెల్మెట్లు లేకుండా బైక్‌లు నడిపినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో జాతర్ల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో బెల్టుషాపులు లేకుండా సహకరించాల్సిన బాధ్యత గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఉత్సవాలు సందర్భంగా అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు జరగకుండా కొన్ని గ్రామాలపై నిఘా వేశామని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే నిర్వాహకులతోపాటు అందులో భాగస్వామ్యం ఉన్న వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ పి.సింహాచలం, నక్కపల్లి మాజీ ఉప సర్పంచ్ వీసం నానాజీ, సర్పంచ్‌లు ఎరుపిల్లి శ్రీనివాసరావు, గింజాల లక్ష్మణరావు, ప్రగడ జగదీష్, ఎంపీటీసీ సభ్యులు వానుపిల్లి అప్పలస్వామి, పిక్కి తాతియ్యలు, గట్టెం గణేష్ పలు గ్రామ పెద్దలు సూరకాసుల గోవింద్, గంటా తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు కేశవరంలో పల్లెనిద్ర

పాయకరావుపేట : మండలంలోని కేశవరం గ్రామంలో గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివరావు తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యలను గుర్తిస్తారు. గ్రామసభ నిర్వహించి గ్రామాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తగిన సమాచారంతో పాల్గొనాలని కోరారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- త్వరలో పనులపై కేంద్ర కమిటీ పరిశీలన
- ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

నక్కపల్లి : మండలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ పిడుగు ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకూ జరిగిన పనులు, జరుగుతున్న పనుల గురించి ఏపీవో నానిబాబు వివరించారు. వర్షాలు తగ్గిన తర్వాత పనులను వేగవంతం చేయాలన్నారు. కేంద్ర బృందం త్వరలోనే ఈ పనులను పరిశీలించేందుకు మండలానికి వచ్చే అవకాశం ఉందన్నారు.

సాక్షర భారత్ కేంద్రాలు సమర్థంగా నిర్వహించాలి

సాక్షర భారత్ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీవో పిడుగు ఉమామహేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కో-ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా కేంద్రాలను సక్రమంగా తెరవకపోయినా, సమర్థంగా నిర్వహించలేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతోపాటు పరీక్షలకు వారిని సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు,చిట్టుమూరి రాఘవ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు 300 మంది హాజరు

- నేడే ఆఖరి అవకాశం
- ఎంపీడీఓ సాంబశివరావు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాంబశివరావు

పాయకరావుపేట : పాయకరావుపేట మండలానికి ఈ ఏడాది మంజూరైన ఎస్సీ, బీసీ, కాపు సబ్సిడీ రుణాలకు సంబంధించి ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరుకాని అభ్యర్థులకు బుధవారం ఆయా బ్యాంకుల్లో మరోసారి నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు మూడు వందల మంది హాజరయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థుల దరఖాస్తులను ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివరావు పరిశీలించారు. అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించాలని బ్యాంకులకు సిఫారసు చేశారు. ఎంపీడీఓ సిఫారసు మేరకు బ్యాంకుల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పాయకరావుపేట మండలానికి ఎస్సీలకు 361, బీసీలకు 190, కాపులకు 258 యూనిట్లు మంజూరు చేయగా ఆన్‌లైన్ ద్వారా 5,664 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికి ఈ నెల 23 నుంచి 29 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆ ఇంటర్వ్యూలకు నాలుగు వేల మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూలకు హాజరుకాని అభ్యర్థులకు మరో అవకాశంగా బుధ, గురువారాల్లో ఆయా బ్యాంకుల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ పి.వెంకటనారాయణ ఉన్నారు.

నామవరం-పెంటకోట రహదారి విస్తరణకు సర్వే

పాయకరావుపేట : మండలంలో నామవరం నుంచి పెంటకోట రహదారి విస్తరణ కోసం అధికారులు సర్వే నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. పాయకరావుపేట మండలంలోని డక్కన్ ఫైన్ కెమికల్ పరిశ్రమ కోసం మండలంలోని నామవరం నుంచి పెంటకోట వరకు సుమారు 15 కిలోమీటర్ల రోడ్డును విస్తరించే పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ పనులకు రూ.25 కోట్లు మంజూరైన సంగతి విదితమే. రోడ్డు విస్తరణకు వివిధ ప్రభుత్వ శాఖలతో ఆరు బృందాలు ఏర్పడిన అధికారులు ఇప్పటికే సర్వేచేసి విస్తరణకు సేకరిస్తున్న జిరాయితీ భూములను గుర్తించారు. వీటికి నష్టపరిహారం అంచనాలు వేసిన అధికారులు ప్రస్తుతం భూ యజమానులకు పరిహారం పంపిణీ చేస్తూ రిజిస్ట్రేషన్లు చేసే పనిలో ఉన్నారు. మండల సర్వేయరు పి.ఆర్.పాల్‌దాస్ పలువురు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సహకారంతో ఈటీఎస్ మెషిన్ ద్వారా ప్రభుత్వ భూమిని గుర్తించి సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 అడుగుల రోడ్డు విస్తరణకు సరిహద్దులు నిర్ణయిస్తున్నామన్నారు. రోడ్డుకు 60 అడుగులు అవసరంకాగా కొన్ని చోట్ల 70 నుంచి 90 అడుగుల వరకు కూడా ప్రభుత్వ భూమి ఉందని, అంతవరకు సరిహద్దు నిర్ణయిస్తున్నామని ఆయన తెలిపారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నిర్లక్ష్యమే ముంచింది

- సకాలంలో చేపట్టని తూముల పనులు
- భారీ వర్షాలకు చెరువుల్లా మారిన వాడ్రాపల్లి ఆవ ప్రాంత భూములు
- 50 ఎకరాల్లో నీట మునిగిన వరినాట్లు
- నష్టపోయిన వాడ్రాపల్లి, మునగపాక రైతులు





వాడ్రాపల్లిలో నీట మునిగిన వరినాట్లు (ఇన్‌సెట్లో) తీసుకువచ్చిన తూములు

మునగపాక : అధికారుల నిర్లక్ష్యం రైతులను నిండా ముంచింది. వర్షాకాలానికి ముందే కల్వర్టుకు తూములు ఏర్పాటు చేయాలని రైతులు పలుమార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా మూడు రోజుల క్రితం పడిన భారీవర్షాలకు వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో 50 ఎకరాల్లో వరినాట్లు నీట మునిగాయి. తిమ్మరాజుపేట నుంచి వాడ్రాపల్లి వరకు విశాఖ డెయిరీ నిధులతో కొత్తగా రోడ్డు వేశారు. దీని వల్ల వాడ్రాపల్లి, మునగపాక గ్రామాల మధ్య రవాణా సదుపాయం మెరుగుపడింది. అంతేకాదు రైతులకు కూడా పొలాలకు వెళ్లేందుకు మార్గం కుదిరింది. డెయిరీ నిధులతో నాలుగు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయడంతో రైతులు, స్థానికులు ఎంత గానో సంతోషించారు. అయితే రోడ్డు నిర్మాణ సమయంలోనే పంట భూముల నుంచి రోడ్డు వేస్తుండడంతో సాగునీటి కాలువల్లో సిమెంట్ గొట్టాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. లేకపోతే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు పొలాలపైకి వస్తుందన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, డెయిరీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు వారు కూడా అంగీకరించారు. వెంటనే సాగునీటి కాలువలు ఉన్న చోట సిమెంట్ గొట్టాలు ఏర్పాటు చేసేందుకు తూము లను రప్పించారు. కానీ వీటిని ఏర్పాటు చేయడంలో జాప్యం జరగడంతో రైతులు అనుకున్నంత జరిగింది. మూడు రోజుల ముందు వరకు ఎటువంటి



తూముల ఏర్పాటుకు మధ్యలో తవ్వేసిన రోడ్డు

వర్షాలు లేకపోవడంతో కొన్నిచోట్ల రైతులు మోటార్ల సహాయంతో వరి నాట్లు వేసుకున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం భారీ వర్షం కురియడం, ఎగువ ప్రాంతాల నుంచి నీరు రావడంతో వరినారుమడులు, అక్కడక్కడ వేసిన నాట్లు పూర్తిగా మునిగిపోయాయి. పంట పొలాల మధ్య రోడ్డు వేయడంతో దిగువ ప్రాంతానికి నీరు వెళ్లక అక్కడ వరినాట్లు వేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తూముల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సకాలంలో పనులు జరగకే...

మళ్ల నూకరాజు, రైతు, వాడ్రాపల్లి



వరినాట్లు వేసుకోవడం కోసం ఏర్పాటు చేసుకున్న నారుమడి పూర్తిగా నీట మునిగిపోయింది. దీంతో మళ్లీ నారు కొనుక్కొని వేసుకోవాలి. అధికారులు సకాలంలో పనులు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

నష్టపోయాం

పి. సూరి సన్యాసినాయుడు, రైతు, మునగపాక



మోటారు ద్వారా నీరు తోడుకొని వరినాట్లు వేసుకున్నాం. ఇప్పుడు అవన్నీ పూర్తిగా మునిగిపోయి చెరువులా తయారయ్యాయి. మాకు జరిగిన నష్టాన్ని ఎవరు పూడ్చుతారు. రోడ్డు వేసిన అధికారులు ఎగువ ప్రాంతంలోని నీరు దిగువ ప్రాంతానికి వెళ్లడానికి తూములు ఏర్పాటు చేయలేదు.

వ్యాధుల కాలం అప్రమత్తం

మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ

ఎలమంచిలి : ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రభలే అవకాశం ఉండడంతో ప్రజలతో పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ సూచించారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర ప్రాణాంతక వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తొలగించి, వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అలాగే పట్టణంలో దోమల నివారణకు నాలుగు బృందాల సేవలను వినియోగిస్తున్నట్టు తెలిపారు.వ్యాధులు ప్రభలకుండా ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఆరోగ్య సూత్రాలు పాటించేలా కరపత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఎక్కడైనా పారిశుధ్య లోపం తలెత్తితే తక్షణమే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

కాలువల పూడ్చివేతపై ఫిర్యాదు

మునగపాక : తోటాడ శ్మశాన వాటిక సమీపంలో ఏర్పాటు చేస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనుల్లో భాగంగా సాగునీటి కాలువలను పూడ్చివేస్తున్నారని సీపీఎం నాయకుడు ఆళ్ల మహేశ్వరరావు తహసీల్దార్ రాంబాబుకి ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. కాలువలు పూడ్చివేయడం వల్ల దిగువ ప్రాంత పంట భూములకు నీరు అందదని, తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చదువులో పోటీతత్వం ఉండాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మునగపాక : విద్యార్థుల మధ్య ఆదర్శవంతమైన పోటీ ఉండాలని, ప్రతి ఒక్కరూ విజేతలు కావడానికి కృషి చేయాలని ప్రముఖ ఆర్థోపెడిక్ పి. సతీష్‌కుమార్ అన్నారు. వాడ్రాపల్లిలో తన సొంత నిధులతో నిర్మించిన పెతకంశెట్టి రామజోగినాయుడు మాస్టారు ఆరవ గ్రంథాలయ వారోత్సవం ముగింపు కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు, టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఎంపీపీ ఆడారి మంజు, గ్రంథాలయ కమిటీ ఛైర్మన్ పి. రామజోగినాయుడు, కార్యదర్శి బొడ్డేడ సత్యనారాయణ, కాండ్రేగుల నూకరాజు, మళ్ల వరహా నరసింగరావు, శేషు, నూక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు

మునగపాక : మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వుడా పరిధిలోని భూములకు, ప్రభుత్వ భూములకు తహసీల్దార్ రాంబాబు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారని జడ్పీటీసీ సభ్యుడు దాడి లక్ష్మీ సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. నాగవరంలో సర్వే నంబరు 151లో ఎనిమిది ఎకరాలు కొంత మంది వ్యక్తుల పేరున పట్టాలు మంజూరు చేశారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

ఇద్దరు రికార్డింగ్ డాన్సర్లు అరెస్టు

రాంబిల్లి: గొరపూడి పంచాయతీ శివారు కొండవారకొంపలు వద్ద వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఇద్దరు రికార్డింగ్ డ్యాన్సర్లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కుమార్‌స్వామి తెలిపారు. వారిని బుధవారం ఎలమంచిలి కోర్టుకు తరలించామన్నారు. ఉత్సవాల్లో భాగంగా చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

యువజనోత్సవాల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఎలమంచిలి : అనకాపల్లిలో ఈ నెల 29వ తేదీన జరిగిన డివిజన్ స్థాయి యువజనోత్సవాల్లో పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపి ప్రథమ, తృతీయ బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె. మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జానపద బృంద నృత్యంలో ప్రథమ, తృతీయ బహుమతులు సాధించినట్టు చెప్పారు. పోటీల్లో పాల్గొన్న ఎస్. పూర్ణచంద్రరావు, కె. సాయి, బి. వినోద్, శ్యామల, యామిని, సోనియా రాణి, విమల ఉన్నారు. వీరు ప్రథమ బహుమతి పొందగా, విమల, శ్యామల, పత్రిసాయి, సోనియా రాణి, కె. సాయి బృంద గానంలో తృతీయ స్థానాన్ని పొందారు. వీరు వచ్చే నెల 20వ తేదీన విశాఖలోని ప్రభుత్వ మహిళా



అధ్యాపకులతో విద్యార్థులు

డిగ్రీ కళాశాలలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కాగా విజేతలను ప్రిన్సిపాల్ మాల్యాద్రితో పాటు వైస్ ప్రిన్సిపాల్ జగన్నాథం, అధ్యాపకులు రాజశేఖర్, డాక్టర్ కె. పద్మ, డాక్టర్ బి. లక్ష్మి, కె. రామయ్య, తదితరులు కూడా అభినందించారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఎలమంచిలి : తులసీనగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరగనున్నట్టు కమిషనర్ వేగి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఛైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈసమావేశానికి పాలకులతో పాటు అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు అన్నదాన కార్యక్రమం

ఎలమంచిలి : పట్టణంలోని మున్సిపల్ ప్రజారోగ్య శాఖ గ్యారేజ్ వద్ద గురువారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం జరగనున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగే కార్యక్రమాన్ని ఛైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ సత్యనారాయణ ప్రారంభిస్తారని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

గుక్కెడు నీటికి ఎన్ని కష్టాలో..?

- పట్టణంలో తరచూ తాగునీటి ఇబ్బందులు
- ప్రతి నెలా రెండు రోజులు కొళాయిలు బంద్
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు

ఎలమంచిలి : మున్సిపాలిటీలో తరచూ తాగునీటి ఇబ్బందులతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొళాయిల ద్వారా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నా.. పాలకులు, అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. మూడు రోజులుగా కొళాయిలు బంద్ కావడంతో ప్రజలు గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మున్సిపాలిటీలో అధిక వార్డులకు ఎస్. రాయవరం మండలం సోముదేవునిపల్లి వద్ద ఉన్న వరహా నదిలో సంప్‌ల ద్వారా అందిస్తున్నారు. అక్కడి నుంచి సుమారు 17 కిలోమీటర్ల మేర పైపులైను ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే సోముదేవునిపల్లి వద్ద ఉన్న రక్షిత పథకానికి తరచూ సాంకేతిక లోపం వల్ల నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. నెలలో ప్రతిసారి కనీసం రెండు మూడు రోజులు కొళాయిలు నిలిపివేస్తున్నారు.ఆ సమయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయడం లేదు. అధికారులు కొన్ని వార్డులకు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. దీంతో మిగతా వార్డుల్లోని ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.



ధర్మవరం వీధిలో బోరు వద్ద మహిళల పాట్లు

10లోగా పీఆర్ ఇన్‌స్ట్రక్షన్ సర్వే పూర్తి

కార్యదర్శులకు డీపీవో కృష్ణకుమారి ఆదేశం



కొత్తూరులో ఇంటి సర్వేను పరిశీలిస్తున్న డీపీవో

కొత్తూరు : ఇంటి పన్ను పునరుద్ధరణలో భాగంగా పంచాయతీల్లో చేపడుతున్న పంచాయతీరాజ్ ఇన్‌స్ట్రక్షన్స్ సర్వే (పీఆర్ఐఎస్)ను వచ్చే నెల పదో తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి పి.కృష్ణకుమారి ఆదేశించారు. కొత్తూరు పంచాయతీ భవనంలో బుధవారం అనకాపల్లి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఇంటి పన్ను రికార్డులు, రివిజన్ బుక్ ప్రకారం ఐదు లక్షల నివాసాలకు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రెండు లక్షల నివాసాల వివరాలు మాత్రమే ఆన్‌లైన్ జరిగినట్టు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఆర్‌సీసీ శ్లాబ్, మంగుళూరు పెంకుటిళ్లు, రేకుల షెడ్లు, మిద్దె ఇళ్లు, పూరిపాకలు తదితర నివాసాలు ఉన్నాయని, వాటి పక్కా వివరాలతో కూడిన ఇంటి పన్ను వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. సర్వేను పంచాయతీ కార్యదర్శిలు శతశాతం పూర్తిచేయలేని పక్షంలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న విద్యార్థులు, యువకులతో ఇంటికి ఎనిమిది రూపాయల చెల్లించైనా వివరాలను ఆన్‌లైన్ చేసే సర్వేను పూర్తిచేయాలన్నారు. త్వరలో పంచాయతీల్లో కూడా ఆన్‌లైన్‌లో పన్ను విధానం, పన్నులు చెల్లింపులు చేసే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టవచ్చునన్నారు. అనంతరం కొత్తూరులో ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈవోఆర్డీ అప్పలరాజు, కొత్తూరు ఈవో రమేష్, మండలంలోని పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీకి కేటాయించి భూముల పరిశీలన

రహదారి ఏర్పాటుకు నివేదిక పంపాలని తహసీల్దార్‌కు ఆర్డీవో సూర్యకళ సూచన



కోడూరులో భూములపై ఆరా తీస్తున్న ఆర్డీవో సూర్యకళ

కొత్తూరు : మండలంలో ఏపీఐఐసీకి కేటాయించిన ప్రభుత్వ భూములను సదరు సంస్థ అధికారులతో కలిసి ఆర్డీవో సూర్యకళ బుధవారం పరిశీలించారు. కుంచంగిలో ప్రతిపాదించిన 309 ఎకరాలలో అవసరమైన 134 ఎకరాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి డి.ఫారం పట్టాదారుల వివరాలను నివేదించాలన్నారు. అలాగే వేటజంగాల పాలెంలో సర్వే నంబర్ 30, 85లలో సుమారు వంద ఎకరాలు గతంలో కేటాంచిన భూమిని ఏపీఐఐసీ తిరస్కరించడంతో ఆ భూములను వెటర్నరీ యూనివర్సిటీ లేదా స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటుకు ప్రతిపాదిస్తామన్నారు. కోడూరు సర్వే నంబర్ 21లో సుమారు 172 ఎకరాలు ఏపీఐఐసీకి కేటాయించామని, ఈ స్థలానికి చేరుకునేలా రహదారి ఏర్పాటుకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. ఏపీఐఐసీ అధికారులు కృష్ణమూర్తి, సూరిబాబు, మధు, డీఐవో బాబూరావు, మండల సర్వేయర్ లీల, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి : సీఐ సాగర్



విజేతలైన విద్యార్థులతో సీఐ సాగర్

అనకాపల్లి రూరల్ : విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని పట్టణ సీఐ ఎస్.విద్యాసాగర్ కోరారు. స్థానిక అంబేద్కర్ మున్సిపల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన జాతీయస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలవడంతో వారిని అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీఐ దిశానిర్దేశం చేశారు. ట్రస్టు చైర్మన్ మంత్రి అప్పలరాజు, ఎంహెచ్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకుల అప్పారావుకు ప్రముఖుల నివాళి



అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాడి తదితరులు

అనకాపల్లి టౌన్ : ప్రముఖ వాణిజ్యవేత్త కొణతాల అప్పారావు (ఆకుల అప్పారావు)కు బుధవారం పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రైతు సంఘం రోడ్డులోని ఆయన నివాసం వద్ద జరిగిన సంతాప సభలో ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ, వైసీపీ జిల్లా కన్వీనర్ గుడివాడ అమర్‌నాథ్, పట్టణశాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, టీడీపీ నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, రిటైర్డు న్యాయమూర్తులు వేగి సూరి అప్పారావు, కొయిలాడ రమణాజీ, లీడర్ పత్రిక సంపాదకులు వి.వి.రమణమూర్తి, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, బెల్లం వర్తకులు, సినీ రంగానికి చెందిన డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు పాల్గొని అప్పారావు చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

'పోస్టల్ ఎంప్లాయీస్ సొసైటీ'లో అవకతవకలపై విచారణ



విచారణ చేపడుతున్న ఉమారాణి

అనకాపల్లి : అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం విచారణ ప్రారంభమైంది. ఇక్కడి సొసైటీ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.ఉమారాణి విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో ఉన్న 84 మంది సభ్యులు అవకతవకలపై ఫిర్యాదు చేశారన్నారు. వారందరికీ నోటీసుల ద్వారా పిలిపించి విచారణ జరుపుతున్నట్టు చెప్పారు. విచారణలో అవకతవకలు నిర్ధారణ జరిగితే బాధ్యలపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

గుడి కూల్చివేతపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు



జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాలాజీరావుపేటవాసులు

అనకాపల్లి : పట్టణంలోని బాలాజీరావుపేట వద్ద నిర్మించిన వినాయక మం దిరాన్ని జోనల్ సిబ్బంది బుధవారం కూల్చివేశారు. ఆ ప్రాంతీయులంతా ఏకమై రావిచెట్టు వద్ద వినాయక మందిరాన్ని నిర్మించుకున్నారు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు జోనల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు కూల్చివేశారు. ఈ మేరకు బాలాజీరావుపేట ప్రజలు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి కోరుతూ మహిళల ధర్నా



అనకాపల్లి టౌన్ : ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ మహిళలు బుధవారం ఆర్డీవో, జీవీఎంసీ జోనల్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఎం కార్యాలయం నుంచి ప్రదర్శనగా వచ్చి ధర్నా నిర్వహించారు. పట్టణ జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను నియమించాలని, మహిళా కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించి పట్టణ ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, ఆ నిధులతో దళిత మహిళలకు ఉపాధి కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దాక్షాయణి డిమాండ్ చేశారు.

పాల సొసైటీ కార్యదర్శులకు సత్కారం

అనకాపల్లి రూరల్ : పాల సొసైటీల్లో వేతన కార్యదర్శులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన బుచ్చయ్యపేట మండలం దిబ్బిడి, సబ్బవరం మండలం గొర్లివానిపాలెం వేతన కార్యదర్శులు పెదిరెడ్ల సూర్యనారాయణ, ఆర్.సత్యనారాయణలను ఏపీ పాల ఉత్పత్తిదారుల వేతన కార్యదర్శులు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. యూనియన్ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వైఎన్ భద్రం, ఉత్తరాంధ్ర జిల్లాల పాల సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.